ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి
11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 61 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ సోమవారం 12 జనవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 61 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD MON 12 JANUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur



## మంత్రి కోమటిరెడ్డి పరిస్థితి చూస్తే జాలేస్తోంది

- రేవంత్ నడుపుతోంది సర్కారా? సర్కస్ కంపెనీనా? అంటూ హరీశ్ రావు ఫైర్
- కోమటిరెడ్డికి తెలియకుండానే సినిమా టికెట్ రేట్లపై జీవోలు వస్తున్నాయని విమర్శ
- సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ఇచ్చిన హామీని మరిచారని ఆరోపణ
- టికెట్ల దందా వెనుక ఓ రాజ్యాంగేతర శక్తి ఉందని సంచలన వ్యాఖ్యలు
- ఈ వ్యవహారంపై గవర్నర్ విచారణ జరపాలని డిమాండ్

వివరాలు 2లో..

## రామగుండంలో 800 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్

కొద్దిరోజుల్లోనే అధికారిక ప్రకటన
ప్రజాప్రతినిధి అంటే ఎమ్మెల్యే స్థాయిలో విలాస జీవితం కాదు

- రాజకీయ అవసరాల కోసం ప్రజలను అయోమయానికి గురిచేయొద్దు
- పాలకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేస్తం
- పేదలు ఆత్మ గౌరవంతో బ్రతికేలా ఇందిరమ్మ ఇండ్లు
- మత విద్వేషాలు రెచ్చగొట్టే వారిని పట్టించుకోవద్దు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క





**హైదరాబాద్ పెన్ పవర్:**రామగుండం బహిరంగ సభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు చేశారు. ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం పేదల ఆత్మగౌరవం, సంక్షేమం, ఉపాధి అవకాశాలు, ప్రాంతీయ అభివృద్ధిపై దృష్టి సారించి ముందుకు సాగుతోందని అన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో ప్రజల అవసరాలు తీరలేదని చెప్పారు. దొరల మనస్తత్వంతో పరిపాలన జరిగిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసం, ప్రజల చేతే పనిచేస్తోందని అన్నారు. రాష్ట్రంలోని 5.14 లక్షల రెగ్యులర్ ఉద్యోగులకు(సింగరేణి, విద్యుత్ రంగాలతో సహా)కోటి రూపాయల ప్రమాద బీమా కల్పిస్తున్నాం. ఇది కార్మికుల కుటుంబాల భద్రతతో పాటు, ప్రభుత్వంలో పనిచేసే ప్రతి ఉద్యోగి కుటుంబాలకు భరోసా కల్పిస్తున్నామని అన్నారు.

**దేశంలో ఏకైక రాష్ట్రం తెలంగాణ**

ఇండ్లు లేని నిరుపేదలకు ఆత్మగౌరవంతో

వివరాలు 2లో..

## ఇండియాలో భారీ దాడులకు కుట్ర..?

### ఒకరిద్దరూ కాదు.. ఏకంగా 1000 మంది సూసైడ్ బాంబర్లు రెడీ..!



**పెన్ పవర్ డెస్క్:**కరుడుగట్టిన ఉగ్రవాది, జైష్-ఎ-మొహమ్మద్ టెర్రర్ గ్రూప్ చీఫ్ మసూద్ అజార్‌కు సంబంధించిన ఓ ఆడియో రికార్డ్ బయటపడింది. ఇండియాపై పీకలదాకా విషం నింపుకుని ఉండే మసూద్ ఎప్పటిలాగే ఈ ఆడియోలో భారత్‌పై సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఏ క్షణంలోనైనా భారీ సంఖ్యలో భారత్‌పై ఆత్మాహుతి దాడులకు సిద్ధంగా ఉన్నామన్నాడు. ఒకరిద్దరూ కాదు.. ఇండియాపై దాడికి 1000 మందికి పైగా సూసైడ్ బాంబర్లు రెడీగా ఉన్నారని పేర్కొన్నాడు.

వివరాలు 2లో..

## సాధికారత అంటూనే ఒవైసీ మహిళలపై ఆంక్షలు విధిస్తున్నారు



- హిజాబ్ ధరించిన మహిళ ప్రధాని అవుతారన్న ఒవైసీ వ్యాఖ్యలపై బండి సంజయ్ తీవ్ర స్పందన
- ముందు మీ పార్టీకి బురఖా ధరించిన మహిళను అధ్యక్షురాలిని చేయాలని సవాల్
- ఎంఐఎం పార్టీ ఎంతమంది ముస్లిం మహిళలకు టికెట్లు ఇచ్చిందో చెప్పాలని ప్రశ్న
- ట్రిపుల్ తలాక్‌ను రద్దు చేసి ముస్లిం మహిళలకు బీజేపీ న్యాయం చేసిందని వెల్లడి

వివరాలు 2లో..

## ఔరా సైబర్ నేరగాళ్లు..! సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ భార్యకే కుచ్చుటోపీ!



- సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ భార్య ఊర్మిళ
- స్టాక్ మార్కెట్ లాభాల ఆశచూపి రూ.2.58 కోట్లు స్వాహా
- వాట్సాప్ గ్రూపులో చేర్చి, నకిలీ యాప్‌తో మోసగించిన కేటుగాళ్లు
- మోసం కోసం భర్త బంగారాన్ని కూడా తాకట్టు పెట్టిన బాధితురాలు
- ఫిర్యాదు స్వీకరించి దర్యాప్తు చేస్తున్న సైబర్ క్రైమ్ పోలీసులు

**హైదరాబాద్ పెన్ పవర్:**ఇటీవల ఓ మాజీ ఐపీఎస్ అధికారి భార్య సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయారన్న వార్త వెలుగులోకి వచ్చింది. అయితే, ఆ మాజీ ఐపీఎస్ అధికారి సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ అని,

వివరాలు 2లో..

## సికింద్రాబాద్‌ను ముక్కలు చేస్తే సహించం



**హైదరాబాద్ పెన్ పవర్:** సికింద్రాబాద్ కార్పొరేషన్ కోసం ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. డీలిమిటేషన్ పేరుతో సికింద్రాబాద్‌ను ముక్కలు చేస్తే సహించేది లేదని.. కార్పొరేషన్‌తో పాటు జిల్లాను కూడా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. "ఈ నెల 17న నల్లబ్యాడ్జీలతో నిరసన తెలపాలని నిర్ణయించాం. సికింద్రాబాద్‌లో రైల్‌రోకో, బంద్‌లు నిర్వహిస్తాం. నిరవధిక దీక్షలు, అవసరమైతే ఆమరణ దీక్ష చేస్తాం. సికింద్రాబాద్ అస్తిత్వాన్ని దెబ్బకొట్టే కుట్ర జరుగుతోంది. జీహెచ్ఎంసీ డివిజన్ల పునర్విభజన తప్పుల తడకగా ఉంది. మేయర్‌కి కూడా తెలియకుండా డివిజన్లు విభజించారు" అని తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు.

## ట్రాన్స్ జెండర్స్‌కు ఇందిరమ్మ ఇళ్లు




**హైదరాబాద్ పెన్ పవర్:**జూబ్లీహిల్స్ ఉపఎన్నిక బీఆర్ఎస్‌కి రెఫరెండం అని చెప్పి చిత్తుచిత్తుగా పడిపోయినా కూడా ప్రజాప్రభుత్వంపై ప్రతిపక్ష నేతలు కారుకూతలు కూస్తున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు జరిగిన అన్నీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కి ప్రజలు తగిన బుద్ధి చెబుతూనే వస్తున్నారని, మళ్లీ నిసిగ్గుగా మున్సిపాలిటీ ఎన్నికలు సెమీఫైనల్స్ అంటూ మాట్లాడడం సిగ్గుచేటని అన్నారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా పర్యటనలో భాగంగా రామగుండం మున్సిపాలిటీలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారు వేణు గోపాలరావు, స్థానిక శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ చైర్మన్‌లు, జిల్లా ఉన్నతాధికారులతో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.

**మమ్మల్ని విమర్శించడం హాస్యాస్పదం**

అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రామగుండం స్థానిక శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్

వివరాలు 2లో..

## వీబీజీ రామ్‌జీ పథకానికి రాష్ట్రాలు నిధులిస్తే తప్పేంటి?

**హైదరాబాద్ పెన్ పవర్:** వికసిత భారత్ తమ లక్ష్యమని భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర కార్యాలయంలో వీబీజీ రామ్‌జీ చట్టంపై ఆదివారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో పాల్గొని మాట్లాడారు. వీబీజీ రామ్‌జీ అనేది తమ స్వప్నమని చెప్పారు."దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రధాని మోదీ అనేక సంస్కరణలు తీసుకొస్తున్నారు. వాటిలో భాగంగానే వీబీజీ రామ్‌జీ పథకాన్ని తీసుకొచ్చారు. అవినీతిని అరికట్టేందుకు పారదర్శకత తీసుకొచ్చేందుకే ఈ కొత్త చట్టం. కానీ, అవినీతి చేసేందుకే కాంగ్రెస్ ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తోంది. భాజపా తీసుకొచ్చే ప్రతి పథకాన్ని వ్యతిరేకించడం రాహుల్ గాంధీకి పరిపాటిగా మారింది. రాష్ట్రాలు భాగస్వామ్యం అయినప్పుడే బాధ్యత పెరుగుతుంది. వీబీజీ రామ్‌జీ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు ఇస్తే తప్పేంటి? మోదీకి

వివరాలు 2లో..



## అత్యాధునిక పద్ధతిలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ తవ్వకాలు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఎస్ఎల్‌బీసీ పనుల పురోగతిపై మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ఇంజనీర్ ఇన్ చీఫ్ అంజద్ హుస్సేన్, ఇంజనీర్లతో మంత్రి సమావేశమై పనుల పురోగతిపై చర్చించారు. యుద్ధ ప్రాతిపదికన పునఃప్రారంభ పనులు చేపట్టాలని ఆదేశించారు. సొరంగం తవ్వడానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించనున్నట్లు మంత్రి తెలిపారు. తొలగించిన టీబీఎం స్థానంలో అత్యాధునిక పద్ధతిలో టన్నెల్ తవ్వకాలు జరపనున్నారు. మిగిలిన సొరంగ మార్గం 9.8 కిలోమీటర్ల పరిస్థితులపై సమాచారం అందించే ఎలక్ట్రో మాగ్నటిక్ సర్వే పూర్తయినట్టు అధికారులు మంత్రికి వివరించారు. భూగర్భ పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేసే విధంగా సపోర్ట్ సిస్టం కూడా ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రపంచంలోనే అతి పొడవైన సొరంగ మార్గం ఎస్ఎల్‌బీసీని పూర్తిచేయడాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని ఉత్తమ్ వివరించారు. సొరంగ మార్గం పనుల్లో క్షేత్ర స్థాయిలో పని చేసే సిబ్బందికి 25శాతం అదనపు జీతాలు ఉంటాయని తెలిపారు. భారత రాష్ట్ర సమితి పదేళ్ల పాలన వల్లే ఎస్ఎల్‌బీసీ పనుల్లో ఆలస్యం జరిగిందన్న మంత్రి.. ప్రాజెక్టు పూర్తి చేసి నల్గొండను సస్యశ్యామలం చేయడమే కాకుండా, ఫ్లోరోసిస్‌ను శాశ్వతంగా లేకుండా చేస్తామని ప్రకటించారు.

## రిపబ్లిక్ డే వేడుకల కోసం 1275 కిలోల చికెన్ ఆర్డర్..

- ఢిల్లీలో ఘనంగా జరగనున్న వేడుకలు
- విమానాలను పక్షులు ఢీ కొట్టకుండా ఏర్పాట్లు
- ఎర్రకోట, జామా మసీద్ ప్రాంతాల్లో పక్షులకు ఆహారంగా చికెన్



**పెన్ పవర్ డెస్క్:**రిపబ్లిక్ డే వేడుకలకు దేశ రాజధాని ఢిల్లీ ముస్తాబవుతోంది. వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఢిల్లీవ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. కర్తవ్య పథ్‌లో జరిగే పరేడ్ కోసం త్రివిధ దళాలు పూర్తిస్థాయిలో సిద్ధమవుతున్నాయి. యుద్ధ విమానాలతో విన్యాసాల కోసం వైమానిక దళం విస్తృత సన్నాహాలు చేస్తోంది. ఈ క్రమంలోనే 1275 కిలోల చికెన్ ను ఆర్డర్ పెట్టారని సమాచారం.రిపబ్లిక్ డే పరేడ్ సందర్భంగా వైమానిక దళం ఆకాశంలో చేసే విన్యాసాలకు ఆటంకం కలగకుండా పక్షులకు ఆహారంగా ఇచ్చేందుకు చికెన్ ఆర్డర్ చేశారట. ఆకాశంలో ఎగిరే విమానాలను పక్షులు ఢీ కొంటే ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎర్రకోట, జామా మసీద్ వంటి 20 ప్రాంతాల్లో జనవరి 15 నుంచి 26 వరకు గద్దల కోసం మాంసం విసిరే కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు.

## ఎడిటర్ వ్యూ

# చమురుపై ట్రంప్ కు ఈ భారీ మోజు ఎందుకో తెలుసా..!

ప్రపంచ చమురు సామ్రాజ్యాన్ని తాను శాసించాలి అన్నట్లుగా ట్రంప్ ప్రవర్తిస్తున్న సంగతి తెలిసిందే. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లపైనే.. భారత్ ఎక్కడ నుంచి కొనుగోలు చేయాలో కూడా ఆయనే చెబుతారు! ఈ క్రమంలో వెనిజువెలా పై ట్రంప్ కన్నుపడింది.. ఆ దేశంపై నార్కో టెర్రరిస్టు ముద్ర వేశారు. అయితే.. ఇప్పటికే భారీగా నిల్వలున్న అమెరికా.. ఇంకా పెద్ద ఎత్తున కొనుగోళ్లకు ఎందుకు ఈ స్థాయిలో ఆసక్తి చూపిస్తుందనేది ఆసక్తిగా మారింది. దీనికి పలు కారణాలు తెరపైకి వస్తున్నాయి.

అవును... తన మాట వింటే ముద్దులు, లేకపోతే గుద్దులు అన్నట్లుగా ప్రపంచం దేశాలపై పడిపోతున్న ట్రంప్ ఇటీవల వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్య సెలియా ఫ్లోరెస్ ను అరెస్ట్ చేసి ప్రపంచాన్ని నివ్వెరపోయేలా చేశారు. ఆపై ఆ దేశపు చమురు నిల్వలు పూర్తిగా, నిరవధికంగా తమ ఆధీనంలోనే ఉంటాయని ప్రకటించారు. ఈ స్థాయిలో వెనిజువెల పై ట్రంప్ కన్ను వేయడానికి గల కారణం.. ఈ భూమ్మీద అత్యధిక చమురు నిల్వలు అక్కడే ఉండటం!వాస్తవానికి ప్రపంచంలో అత్యధికంగా చమురు ఉత్పత్తి అమెరికాలోనే జరుగుతుంది. ఇందులో భాగంగా... గత ఏడాది రోజుకి 1.34 కోట్ల బ్యారెల్ల క్రూడాయిల్ ను ఆ దేశం అమ్మగలిగింది. అయినప్పటికీ ఇతర దేశాల నుంచి పెద్ద ఎత్తున చమురు కొనాలని ట్రంప్ పంతం పట్టుకుంటున్నారు. ఇందులో భాగంగా... గత ఏడాదిలో సుమారు 20 లక్షల బ్యారెల్లను కొనుగోలు చేసింది. అయినప్పటికీ ట్రంప్ ఆశ చావడం లేదు. అందుకు కారణం.. హెవీ క్రూడ్, లైట్ క్రూడ్ ఆయిల్ అమ్మకాలు, కొనుగోళ్లలో ఉన్న తేడా కూడా!వాస్తవానికి 1970లలో అధిక చమురు ధరలు, కొరత కారణంగా అమెరికా ఉత్పత్తి చేసిన దానికంటే ఎక్కువ చమురును వినియోగించింది. అప్పటి నుండి అమెరికా "ఇంధన స్వాతంత్ర్యం" విధానంపై దృష్టి సారించిందని చెబుతారు. పైగా వైశాల్యం దృష్ట్యా చూస్తే అమెరికా చాలా పెద్దది. ఈ క్రమంలో.. అలాస్కా నుండి తూర్పు తీరానికి చమురును రవాణా చేయడం కంటే.. అలాస్కా నుండి ఆసియాకు ముడి చమురును ఎగుమతి చేస్తూ.. దక్షిణ అమెరికా నుండి తూర్పు తీరానికి ముడి చమురును దిగుమతి చేసుకుంటుంది.

ఇదే సమయంలో... అమెరికా ఉత్పత్తి చేసే 'లైట్ క్రూడ్' విలువ ఎక్కువ. దీంతో.. వాళ్లు ఉత్పత్తి చేసే తేలికపాటి ముడి చమురును అధిక ధరకు విదేశాలకు అమ్మి.. విదేశాల్లో దొరికే 'హెవీ క్రూడ్'ను తక్కువ ధరకే కొంటోంది. అందుకు గల కారణం.. హెవీ క్రూడ్ ను శుద్ధి చేసే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన రిఫైనరీలు అమెరికాలో ఉన్నాయి. ఇవి వెనుజెవెలా వంటి దేశాలకు అందుబాటులో లేవు. దీంతో.. అక్కడ నుంచి హెవీ క్రూడ్ ను దిగుమతి చేసుకుని, దాన్ని లైట్ క్రూడ్ గా మార్చి ఎక్కువ ధరకు అమ్ముతుందన్నమాట!

# రామగుండంలో 800 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్

- మొదటి పేజి తరువాయి

జీవించేలా రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టాం. ప్రతి శాసనసభ నియోజకవర్గంలో కనీసం 3,500 ఇండ్లు, మొత్తం రూ.22,500 కోట్లతో అమలు చేస్తున్నాం. స్థలాలు లేని వారికి స్థలాలు కూడా అందిస్తున్నామని స్పష్టం చేశారు. రేషన్ కార్డు లబ్ధిదారులకు దొడ్డు బియ్యం ఇచ్చే విధానానికి స్వస్తి చెప్పి, 96 లక్షల కుటుంబాలకు సన్న బియ్యం ఏకధాటిగా పంపిణీ చేస్తున్న దేశంలో ఏకైక రాష్ట్రం తెలంగాణని తెలిపారు. రాష్ట్రంలో దాదాపు 53 లక్షల గృహ వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ కోసం, పేదలు, మధ్య తరగతి కుటుంబాల తరపున మరియు 29 లక్షల వ్యవసాయ పంపుసెట్ల బిల్లులు ప్రభుత్వమే చెల్లిస్తోంది. ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం ఇప్పటికే రూ.8,600 కోట్లు ఆర్టీసీకి చెల్లించినట్లు గుర్తుచేశారు.

### కాపాడాల్సిన బాధ్యత మనందరిది

పాదయాత్రలో ప్రజలు కోరిన 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుకు కేబినెట్ ఆమోదం తెలిపిందని అన్నారు. ఉద్యోగాలు, ఆర్థిక అభివృద్ధికి కీలకమని చెప్పారు. సింగరేణి, ఎన్టీపీసీ, రామగుండం ఫర్టిలైజర్స్ వంటి ప్రాజెక్టులు గత కాంగ్రెస్ హయాంలోనే తీసుకొచ్చినవి -- గత 10 ఏళ్లలో బీఆర్ఎస్ ఒక్కటి కూడా తీసుకురాలేదని అన్నారు. సింగరేణి కాలరీస్ భవిష్యత్తును కాపాడాల్సిన బాధ్యత మనందరిది. ఈ సంస్థలో 42 వేల రెగ్యులర్ ం 40 వేల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తుంది. ఉద్యోగులతో పాటు సింగరేణిని కాపాడుకోవడం మన బాధ్యత. సింగరేణి భవిష్యత్తులో రేర్ ఎర్త్ మినరల్స్, మైనింగ్‌లో ముందుండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

### పేదల సంక్షేమమే కాంగ్రెస్ భావజాలం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో 2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రపంచ దేశాలతో పోటీపడేలా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతాం. పాదయాత్రలో నోట్ చేసుకున్న ప్రజల అవసరాలను ఒక్కొక్కటిగా తీరుస్తున్నాం. రామగుండం ప్రాంత సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చేపడుతున్నాం. కేంద్ర ప్రీ-బడ్జెట్ సమావేశాల నుంచి తిరిగి వచ్చి కూడా ప్రజల కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తున్నాను. పేదల సంక్షేమమే కాంగ్రెస్ భావజాలం. ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం.. ప్రజల ప్రభుత్వం -- ప్రజల కోసం -- ప్రజల చేతే అనే నినాదంతో రాష్ట్ర అభివృద్ధి ప్రయాణం కొనసాగుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# మంత్రి కోమటిరెడ్డి పరిస్థితి చూస్తే జాలేస్తోంది

తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పరిస్థితి చూస్తుంటే జాలేస్తోందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా, ఉంటే ఎవరి నియంత్రణలో ఉందనే అనుమానాలు కలుగుతున్నాయని ఆయన అన్నారు. ఒక శాఖకు మంత్రిగా ఉన్న వ్యక్తికి తెలియకుండానే ఆ శాఖలో కీలక నిర్ణయాలు జరిగిపోవడం, జీవోలు విడుదల కావడం దారుణమని విమర్శించారు. సినిమా టికెట్ల రేట్ల పెంపు జీవో బయటకు వస్తే, ఆ శాఖ మంత్రి అయిన కోమటిరెడ్డి 'నాకు తెలియదు, నా దగ్గరికి ఫైల్ రాలేదు' అని నిస్సహాయత వ్యక్తం చేయడం ప్రభుత్వంలో పాలన ఏ స్థాయిలో ఉందో చెబుతోందన్నారు. "శాఖ ఒకరిది, పెత్తనం మరొకరిది అన్నట్లుగా ఉంది. పలు శాఖలకు తానే మంత్రినని చెప్పుకొనే కోమటిరెడ్డి, ఇప్పుడు తన శాఖలో ఏం జరుగుతుందో తనకు సంబంధం లేదనడం విడ్డూరం. టికెట్ల రేట్ల పెంపు సీఎం నిర్ణయమేనని ఆయన చెప్పకనే చెబుతున్నారు. అంటే, సినిమా శాఖకు మంత్రి ఉన్నట్టా లేనట్టా?" అని హరీశ్ రావు ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై హరీశ్ రావు తీవ్రంగా ధ్వజమెత్తారు. "రేవంత్ రెడ్డి గారు, మీరు నడుపుతోంది సర్కారా లేక సర్కస్ కంపెనీనా?" అని నిలదీశారు. అసెంబ్లీ సాక్షిగా తాను సీఎంగా ఉన్నంతకాలం టికెట్ రేట్ల పెంపు, బెనిఫిట్ షోలు ఉండవని ప్రగల్భాలు పలికిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు రాత్రికి రాత్రే జీవోలు ఎలా ఇస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికే మూడు సినిమాలకు అడ్డగోలుగా రేట్లు పెంచుతూ జీవోలు ఇచ్చారని, మరో సినిమాకు కూడా సిద్ధమవుతున్నారని ఆరోపించారు. సభను, ప్రజలను ఇంత నిస్సిగ్గుగా తప్పుదోవ పట్టించడం తగదన్నారు. హైకోర్టు మొట్టికాయలు వేసినా ప్రభుత్వ తీరు మారకపోవడం శోచనీయమని వ్యాఖ్యానించారు.

ప్రభుత్వం సినీ పరిశ్రమపై రాజకీయ కక్ష సాధిస్తోందని హరీశ్ రావు ఆరోపించారు. "పాలకుడు పాలసీతో ఉండాలి కానీ, పగతో ఉండకూడదు. వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే అన్నందుకు ఒక హీరో సినిమాపై కక్షగడతారు. మీ పేరు మరిచినందుకు మరో హీరోను జైలుకు పంపుతారు. ఇప్పుడు మీకు నచ్చిన వారికి రూ. 600 టికెట్ రేటుకు అనుమతి ఇస్తారా?" అని ప్రశ్నించారు.

"గత పదేళ్లు కేసీఆర్ గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సినిమా పరిశ్రమను కంటికి రెప్పలా కాపాడుకున్నాం. ఎక్కడా వివక్ష చూపలేదు. అందుకే ఇవాళ తెలుగు సినిమా ఆస్కార్ స్థాయికి ఎదిగింది. ప్రపంచం గర్వించేలా మన సినిమాలు తయారవుతున్నాయి. 50, 60 ఏళ్లుగా ఎంతోమంది కష్టపడి నిర్మించుకున్న ఈ పరిశ్రమ వాతావరణాన్ని.. మీ అహంకారంతో, మీ పిచ్చి చేష్టలతో, మీ పగ ప్రతీకారాలతో, మీ చిల్లర రాజకీయాలతో నాశనం చేస్తున్నారు. ప్రభుత్వమంటే అందరినీ సమానంగా చూడాలి. ఒకరికి చుట్టం .. మరొకరికి శత్రుత్వం ఉండకూడదు. సినిమా వాళ్లను కూడా మీ రాజకీయాలకు వాడుకోవడం సిగ్గుచేటు. ఇది ప్రజా పాలన కాదు.. ఇది మీ పాపిష్టి పాలన కు పరాకాష్ఠ. మొన్న ఎన్నికల్లో ఓడిపోయి.. నేడు రాజ్యాంగేతర శక్తిగా ఎదిగి సినిమా టికెట్ల రేట్లను శాసిస్తున్న ఆ కనిపించని శక్తి ఎవరో? ఒక్కో సినిమాకు కమీషన్ల రూపంలో ఎన్ని కోట్లు వసూలు చేస్తున్నారో?.. ఆ వివరాలన్నీ త్వరలోనే బయటపెడతాం" అని అన్నారు.

సినిమా టికెట్ల రేట్ల కమీషన్ల దందాపై గవర్నర్ తక్షణమే దృష్టి సారించి, సమగ్ర విచారణకు ఆదేశించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు హరీశ్ రావు స్పష్టం చేశారు.

# ట్రాన్స్ జెండర్స్‌కు ఇందిరమ్మ ఇళ్లు

- మొదటి పేజి తరువాయి

అధ్యక్షతన జరిగిన ఇందిరమ్మ ఇండ్ల స్థలాల పట్టాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్ల పత్రాల పంపిణీ ప్రజాసభలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి అడ్రస్ లేకుండా ప్రతి ఎన్నికల్లో ఓడిస్తూనే ఉన్నారని, అయినా మీ ఇంట్లో రగులుతున్న కుటుంబ చిచ్చును ఆర్పుకోలేని నువ్వు తెలంగాణ ప్రజలకు ఏం చేస్తావని కేటీఆర్‌ను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. సొంత ఇంటి ఆడబిడ్డకు న్యాయం చేయలేని నాయకుడు తెలంగాణ మహిళలకు ఎలా న్యాయం చేస్తారో సమాధానం చెప్పాలన్నారు? ఇంకా పగటి కలలు కంటూ దొరగారి దర్పణాన్ని ప్రదర్శిస్తూ అవాకులు చవాకులు పేలుతున్నారని. పదేండ్లలో ప్రజల కష్టనష్టాలను పట్టించుకోని నేతలు ప్రజా పాలనను విమర్శించడం హాస్యాస్పదమన్నారు. ఇప్పటికైనా గుండె మీద చెయ్యి వేసుకుని ఆత్మ పరిశీలన చేసుకోవాలని సూచించారు.

### అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలను అందజేస్తాం

రెండేండ్ల క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పడిన ప్రజాప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన అందిస్తూ ముందుకు పోతుందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా అన్ని రంగాల్లో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి అమలు చేసుకుంటూ ప్రగతిని సమపాళ్లలో తీసుకెళ్తున్నామని తెలిపారు. సింగరేణి పరివాహక ప్రాంతంలో 76 జీవో వల్ల నెలకొన్న సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సహచర మంత్రులతో చర్చించి అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలను అందజేస్తామన్నారు.

ఎక్కడైతే పట్టణాల్లో అధికారుల కొరత ఉందో తప్పకుండా ఆయాచోట్ల ఎమ్మార్వోలను నియమిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 586 మంది నిరుపేదలకు ఇండ్ల స్థలాల పట్టాలు, 494 మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో పాటు రాష్ట్రంలో మొదటిసారిగా 50 మంది ట్రాన్స్ జెండర్స్‌కు ఇళ్ల పత్రాలను అందించారు. అవినీతి ప్రభుత్వాన్ని పాతరేసి ప్రజాప్రభుత్వాన్ని తెచ్చుకున్న ప్రజలు ఇప్పటివరకు జరిగే అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి ఇందిరమ్మ ప్రభుత్వానికి అండగా నిలిచారని. రాబోయే రోజుల్లో ఏ ఎన్నికలు వచ్చినా ప్రజలు మద్దతు పలికి మనస్ఫూర్తిగా ఇందిరమ్మ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు.

# ఔరా సైబర్ నేరగాళ్లు..! సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ భార్యకే కుచ్చుటోపీ!

- మొదటి పేజి తరువాయి

బాధితురాలు ఆయన భార్య ఊర్మిళ అని తెలియడంతో ఈ ఘటన అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడుల పేరుతో ఆమె నుంచి సైబర్ కేటుగాళ్లు ఏకంగా రూ.2.58 కోట్లు కాజేశారు. వివరాల్లోకి వెళితే.. ఊర్మిళ వాట్సప్‌కు సైబర్ నేరగాళ్ల నుంచి ఓ మెసేజ్ వచ్చింది. తాము సూచించిన విధంగా స్టాక్స్‌లో పెట్టుబడి పెడితే అతి తక్కువ సమయంలోనే అత్యధిక లాభాలు వస్తాయని నమ్మబలికారు. అనంతరం ఆమెను 'స్టాక్ మార్కెట్ ప్రాఫిట్ గైడ్ ఎక్స్ఛేంజ్ 20' అనే వాట్సాప్ గ్రూపులో చేర్చారు. ఈ గ్రూప్‌లో దినేష్ సింగ్ అనే వ్యక్తి, తాను చెప్పినట్లు చేస్తే 500 శాతం లాభాలు ఖాయమని, కొన్ని స్క్రీన్‌షాట్లు పంపి నమ్మించాడు. అతనికి సహకరిస్తూ, అదే ముఠాకు చెందిన ప్రియసఖి అనే మహిళ తనకు కూడా లాభాలు వచ్చాయంటూ గ్రూప్‌లో పోస్టులు పెట్టింది. వీరి మాయ మాటలు నమ్మిన ఊర్మిళ, యాపిల్ యాప్ స్టోర్ నుంచి 'వీజఖ×జ్ జవీ' అనే నకిలీ అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. అనంతరం డిసెంబర్ 24 నుంచి జనవరి 5 మధ్య కాలంలో పలు దఫాలుగా రూ.2.58 కోట్లను నేరగాళ్లు చెప్పిన ఖాతాలకు బదిలీ చేశారు. ఇందుకోసం తన వద్ద ఉన్న బంగారంతో పాటు, భర్త లక్ష్మీనారాయణకు చెందిన బంగారాన్ని కూడా ఆమె తాకట్టు పెట్టడం గమనార్హం. యాప్‌లో లాభాలు కనిపిస్తున్నా, డబ్బును వెనక్కి తీసుకునే (విత్‌డ్రా) ఆప్షన్ లేకపోవడంతో తాను మోసపోయానని ఆమె గ్రహించారు.

వెంటనే బాధితురాలు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు, ఊర్మిళ పంపిన డబ్బును సైబర్ నేరగాళ్లు మ్యూల్ ఖాతాలకు మళ్లించినట్లు గుర్తించారు. ప్రస్తుతం ఆ ఖాతాలను గుర్తించి, నిందితులను పట్టుకునే పనిలో ఉన్నామని పోలీసులు తెలిపారు.

# వీబీజీ రామ్‌జీ పథకానికి రాష్ట్రాలు నిధులిస్తే తప్పేంటి?

- మొదటి పేజి తరువాయి

మంచి పేరు వస్తుందన్న ఉద్దేశంతోనే ఈ చట్టాన్ని కాంగ్రెస్ వ్యతిరేకిస్తుంది. గ్రామ గ్రామాన తిరిగి కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి"అని పార్టీ శ్రేణులకు రామ్‌చందర్‌రావు పిలుపునిచ్చారు.

# ఇండియాలో భారీ దాడులకు కుట్ర..?

- మొదటి పేజి తరువాయి

తన గ్రూపులోని సూసైడ్ బాంబర్ల సంఖ్యను బహిర్గతం చేస్తే ప్రపంచం షాక్‌కు గురి అవుతుందన్నాడు. ఈ వ్యక్తులు దాడులు చేసి వారి లక్ష్యాన్ని సాధించడానికి చాలా ప్రేరేపించబడ్డారనిపేర్కొన్నాడు. అయితే, ఈ ఆడియో రికార్డింగ్ ఎప్పుడు..? ఎక్కడ..? రికార్డ్ చేశారనే దానిపై క్లారిటీ లేదు. ఈ ఆడియో రికార్డ్ వైరల్ కావడంతో భారత నిఘా వర్గాలు అలర్ట్ అయ్యాయి. ఆ ఆడియో క్లిప్‌పై ఆరా తీస్తున్నాయి. మరోవైపు సరిహద్దుల్లో భద్రతను కట్టదిట్టం చేశారు. 2001 భారత పార్లమెంటుపై దాడి, 2008 ముంబై దాడులు, 2016 పఠాన్‌కోట్ వైమానిక స్థావరంపై ఎటాక్, 2019 పుల్వామా ఆత్మాహుతి బాంబు దాడి వంటి అనేక ప్రధాన దాడుల మాస్టర్ మైండ్ మసూద్ అజార్. ఇప్పటికే భారత్ అతడిని మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టుగా ప్రకటించింది. 2019లో ఐక్యరాజ్యసమితి కూడా అజార్‌ను గ్లోబల్ టెర్రరిస్ట్‌గా గుర్తించింది. భారత సైన్యం మసూద్‌ను అరెస్ట్ చేయగా..1999లో ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం ఐసీ-814 హైజాక్ చేసి ఉగ్రవాదులు అతడిని విడిపించారు. ఆ తర్వాత జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థ స్థాపించి భారత్‌లో ఎన్నో దాడులకు కుట్రలు చేశాడు అజార్.

# సాధికారత అంటూనే ఒవైసీ మహిళలపై ఆంక్షలు విధిస్తున్నారు

భవిష్యత్తులో హిజాబ్ ధరించిన మహిళ భారత ప్రధాని అవుతారంటూ ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఘాటుగా స్పందించారు. హిజాబ్ ధరించిన మహిళ ప్రధాని కావడం గురించి కలలు కనే ముందు, బురఖా ధరించిన మహిళను మీ పార్టీకి అధ్యక్షురాలిగా నియమించే ధైర్యం చూపాలని ఆయన ఒవైసీకి సవాల్ విసిరారు. ఆదివారం నాడు 'ఎక్స్' వేదికగా బండి సంజయ్ ఈ మేరకు స్పందించారు. "ఎంఐఎం పార్టీ ఇప్పటివరకు ఎంతమంది ముస్లిం మహిళలకు ఎమ్మెల్యే లేదా ఎంపీ టికెట్లు ఇచ్చింది? పార్టీలో కీలక నిర్ణయాలు తీసుకునే పదవుల్లో ఎంతమంది మహిళలు ఉన్నారు?" అని ఆయన ప్రశ్నించారు. కేవలం నినాదాలతో మహిళలకు ప్రాతినిధ్యం కల్పించినట్టు కాదని విమర్శించారు. 2018 ఎన్నికల్లో పాతబస్తీలో అక్బరుద్దీన్ ఒవైసీపై బీజేపీ తరఫున షాజాదీ సయ్యద్‌ను నిలబెట్టామని, అప్పుడు ఆమెను బెదిరించి ఓడించారని ఆరోపించారు. ప్రస్తుతం ఆమె జాతీయ మైనారిటీ కమిషన్‌లో సేవలందిస్తున్నారని గుర్తుచేశారు. సాధికారత గురించి మాట్లాడే ఒవైసీ, పార్టీలోనూ, ఇంట్లోనూ మహిళలపై ఆంక్షలు విధిస్తారని సంజయ్ విమర్శించారు.

ట్రిపుల్ తలాక్ రద్దు, మహిళల పేరిట సంక్షేమ పథకాలు, గ్యాస్ కనెక్షన్లు, గృహాలు వంటి సంస్కరణలతో ముస్లిం మహిళలకు నిజమైన సాధికారతను అందించింది బీజేపీ ప్రభుత్వమేనని బండి సంజయ్ పేర్కొన్నారు. చాలామంది ముస్లిం మహిళలు ప్రధాని మోదీని తమ సోదరుడిగా భావిస్తున్నారని తెలిపారు.

భారత రాజ్యాంగం అన్ని వర్గాల వారికి సమాన హోదా కల్పించిందని, అందుకే పాకిస్థాన్‌లా కాకుండా ఇక్కడ హిజాబ్ ధరించిన మహిళ కూడా ప్రధాని కాగలరని అసదుద్దీన్ ఒవైసీ ఇటీవల వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.



యాదాద్రిలో భక్తుల రద్దీ

**హైదరాబాద్ పెన్ పవర్:** సంక్రాంతి సెలవుల నేపథ్యంలో యాదగిరి గుట్ట పుణ్యక్షేత్రానికి భక్తులు పోటెత్తారు. రాష్ట్రంలోని పలు జిల్లాలు, ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో యాద్రాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో రద్దీ నెలకొంది. ఈ సందర్భంగా భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ప్రసాదాల కౌనుగోలు క్యూలైన్ల వద్ద భక్తులు బారులు తీరారు. కల్యాణ కట్ట, పుష్కరిణి, ఆలయ పరిసరాలు, యాత్రికుల వాహనాలతో పార్కింగ్ స్థలాలు కిక్కిరిసిపోయాయి.

పెన్ పవర్
తెలంగాణ రౌండప్

# 16 నుంచి సీఎం మున్సిపల్ ప్రచారం

## ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి శ్రీకారం

## అదేరోజు సదర్‌మాట్ బ్యారేజీ ప్రారంభం

## ఉమ్మడి జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులకే సభల బాధ్యతలు!

**హైదరాబాద్ పెన్ పవర్:** సంక్రాంతి పండగ తరవాత మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టబోతున్నారు. ఈ నెల 16న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో పర్యటన ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా బహిరంగసభలో ప్రసంగిస్తారు. అదేరోజు సదర్‌మాట్ బ్యారేజీ ప్రారంభోత్సవంతో పాటు, చనాఖా–కోర్ట ప్రాజెక్టు సందర్శన, సభ ఉంటుందని కాంగ్రెస్ పార్టీవర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమాలతోనే మున్సిపల్ ఎన్నికల ప్రచారాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. వాస్తవానికి ఫిబ్రవరి 3న జడ్చర్లలో నిర్వహించే బహిరంగ సభతో ప్రచారం ప్రారంభించాలని అనుకున్నా సమయం సరిపోదని.. అంతకన్నా ముందే జరపాలని తాజాగా నిర్ణయించారు.

**శంకుస్థాపనలు.. సభలు..**

ఈ నెల 17న జడ్చర్లలో ట్రిపుల్ ఐటీ నిర్మాణానికి, మహబూబ్‌నగర్‌లో అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం శంకుస్థాపన చేసి, ఇదే పట్టణంలో ఏర్పాటుచేసే బహిరంగసభలో ప్రసంగించనున్నారు.

18న పాలేరులో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనల అనంతరం ఖమ్మం పట్టణంలో నిర్వహించే ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తారు. అనంతరం అక్కడే సీపీఐ వందేళ్ల సభలో పాల్గొంటారు. అదేరోజు సాయంత్రం ములుగు జిల్లా మేడారం చేరుకుని, అక్కడ రాత్రి బస చేస్తారు.

19న ఉదయం 6.30 గంటలకు కొత్తగా నిర్మించిన సమ్మక్క–సారలమ్మ గద్దెలను సీఎం ప్రారంభించి మొక్కులు తీర్చుకుని హైదరాబాద్ చేరుకుంటారు. అదేరోజు సాయంత్రం దావోస్‌కు బయలుదేరి వెళతారు. అక్కడినుంచి 25న అమెరికా వెళతారని తెలుస్తోంది. ఫిబ్రవరి ఒకటో తేదీన రేవంత్ తిరిగి హైదరాబాద్‌కు వస్తారని పార్టీవర్గాలు చెబుతున్నాయి. ఈ కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా ధ్రువీకరించలేదు.

**ఒక్కోచోట లక్ష మందితో సభ:** ఫిబ్రవరి 3 నుంచి మళ్లీ ఉమ్మడి జిల్లాల్లో వరసగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సభలు ఏర్పాటు చేయనున్నారు.



-4 లో

# మేడారం మహాజాతర తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక



**హైదరాబాద్ పెన్ పవర్:** మేడారం మహా జాతర తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం (జనవరి 11) మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సీతక్కతో కలిసి మేడారం జాతర అభివృద్ధి పనులను భట్టి పరిశీలించారు. అనంతరం మేడారం జాతర అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. మరో రెండు రోజుల్లో మేడారం జాతర అభివృద్ధి పనులన్నీ పూర్తి అవుతాయని తెలిపారు. రూ.251 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నామని.. శాశ్వత నిర్మాణాలు చేపట్టామని తెలిపారు. మేడారం జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. కాగా,

దక్షిణ కుంభమేళాగా పేరొందిన మేడారం మహా జాతర 2026, జనవరి 28 నుంచి మొదలు కానున్న విషయం తెలిసిందే. మొత్తం నాలుగు రోజుల పాటు జాతర జరగనుంది. సీఎం రేవంత్ రెడ్డి 2026, జనవరి 20వ తేదీన మేడారం వెళ్లి వనదేవతలను దర్శించుకుని జాతర ప్రారంభించనున్నారు.

# రూ.547 కోట్ల లావాదేవీలు.. సత్తుపల్లికి చెందిన సైబర్ క్రైమ్ ముఠా అరెస్ట్



**హైదరాబాద్ పెన్ పవర్:** వివిధ బ్యాంకు ఖాతాల ద్వారా రూ.547 కోట్ల లావాదేవీలు జరిపిన సైబర్ క్రైమ్ ముఠా గుట్టును ఖమ్మం జిల్లా పోలీసులు రట్టు చేశారు. అంతర్జాతీయ సైబర్ క్రైమ్ నేరస్థులతో జతకట్టి విదేశాల్లో కాల్ సెంటర్లు నిర్వహిస్తున్న సత్తుపల్లి ప్రాంతానికి చెందిన ముఠా పట్టుబడినట్లు ఖమ్మం సీపీ సునీల్ దత్ తెలిపారు. వీఎం బంజరు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలను సీపీ వెల్లడించారు. మ్యాట్రిమోనీ, రివార్డ్ పాయింట్లు, గేమింగ్, బెట్టింగ్, షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు, క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్ పేరుతో నిందితులు మోసగించినట్టు పోలీసులు గుర్తించారు. సత్తుపల్లి ప్రాంతానికి చెందిన పోట్రు మనోజ్ కల్యాణ్, ఉడతలేని వికాస్ చౌదరి, పోట్రు ప్రవీణ్, మేడ భానుప్రియ, మేడ సతీష్, మోరంపూడి చెన్నకేశవులుతో పాటు మరో 11 మందిని అరెస్టు చేసినట్టు సీపీ తెలిపారు. ఉద్యోగం ఇప్పిస్తానని పోట్రు కల్యాణ్, ప్రవీణ్, ఉడతనేని వికాస్ చౌదరితో పాటు మోరంపూడి చెన్నకేశవులు.. తనను నమ్మించి మోసం చేశారని గతేడాది డిసెంబరు 24న సత్తుపల్లి మండలం తుంబూరు గ్రామానికి చెందిన మోదుగ సాయికిరణ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు బ్యాంకులలో ఖాతా తెరిపించి అకౌంట్లకు సంబంధించిన వివరాలు, ఏటీఎం కార్డు తీసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. తన బ్యాంకు ఖాతాను పరిశీలించగా రూ.కోట్లలో లావాదేవీలు జరిగినట్లు తెలిసిందని పోలీసుల దృష్టికి తెచ్చాడు. నిందితులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా.. వివిధ బ్యాంకు ఖాతాల ద్వారా నిందితులు రూ.547 కోట్ల లావాదేవీలు

-4 లో

# కుల సంఘాలు రాజకీయ పార్టీలకు ఊడిగం చేయొద్దు



**హైదరాబాద్ పెన్ పవర్:** కుల సంఘాలు కుల సంఘంలా ఉండాలి తప్ప రాజకీయ పార్టీలకు ఊడిగం చేయవద్దని, అలా చేస్తే మన హక్కులను ఖతం పట్టించినట్లేనని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కులం ఎంత ఐక్యంగా ఉంటే రాజకీయ నాయకులకు అంత బలం ఉంటుందన్నారు. ఇవాళ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కురుమ యువ చైతన్య సమితి ఆధ్వర్యంలో నూతన సర్పంచ్ మరియు ఉప సర్పంచ్‌లకు సన్మానం, 2026 క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఈటల పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. సంఘాలు చచ్చిపోతే చైతన్యం చచ్చిపోతుందని చైతన్యం చచ్చిపోతే అణగారిన జాతులకు అండ లేకుండా పోతుందన్నారు. అణిచివేతకు గురవుతున్న వారికి, సంఖ్య ఉండి కూడా విద్య ఉద్యోగం రాజకీయం ఆర్థికపరంగా అవకాశాలు రానివారికి సంఘం కావాల్సిందేనన్నారు. కుల సంఘాల నాయకులకు కుటుంబం బాధ్యతతో పాటు సంఘటితశక్తిగా జాతిని నడిపే రెండు బాధ్యతలు ఉంటాయన్నారు.

**ఎంపీ కంటే వార్డు మెంబర్ గెలవడం కష్టం:**

ఎంపీ ఎమ్మెల్యే గెలవడం కంటే వార్డు మెంబర్, సర్పంచ్ గెలవడం కష్టం అని మనం ఒకరిని తిట్టాల్సిన అవసరం లేదు మనకేం కావాలో కొట్లాడి తీసుకోవాలన్నారు. ఐక్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చని చెప్పారు. రాజకీయాలు డబ్బులు మయం అయ్యాయని మహిళ రిజర్వేషన్ ఉన్న దగ్గర ఆడవాళ్లు పోటీ చేయమంటే ఏడ్చారు.

-4 లో

## పండగని పండగలా జరుపుకోండి.

# ప్రాణాలు తీసి కాదు



**హైదరాబాద్ పెన్ పవర్:** చైనా మాంజాను పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. హైదరాబాద్ లో వరుస దాడులు చేస్తూ చైనా మాంజా విక్రయాలపై పంజా వేస్తున్నారు. అయినప్పటికీ అక్రమంగా కొంతమంది మాంజాను అమ్ముతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ సీపీ సజ్జనార్ మరోసారి హెచ్చరికలు జారీ చేశారు. సంక్రాంతి వస్తే పిల్లలు పెద్దలు పతంగ్ లు ఎగరవేస్తారని అన్నారు. ఈ పండుగను చాలా ఎంజాయ్ చేస్తారని వ్యాఖ్యానించారు. కానీ చైనా మాంజా వాడకం పండుగలో విషాదాన్ని మిగిలుస్తుందని హెచ్చరించారు. చైనా మాంజాను గాజులు, నైలాన్, సింథిటిక్ దారంతో తయారు చేస్తారని చెప్పారు. కాబట్టి కరెంట్ తీగలకు తాకినా షాక్ కొట్టే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

-4 లో

# ఎవరి దగ్గర కూడా డబ్బులు లేవు

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో ఈరోజు కేసీఆర్ కనిపిస్తే ధైర్యం వస్తుందని ప్రజలు అనుకుంటున్నారని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ 24 నెలల వైఫల్య పాలనలో గత ప్రభుత్వం కేసీఆర్ ఆధ్వర్యంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గుర్తుకు తెచ్చుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో ఎవరి దగ్గర డబ్బులు లేకుండా పరిస్థితులు దిగజారిపోయాయని, వ్యాపారాలు తగ్గిపోయాయని, ఉపాధి దొరకకుండా పోయిందని అన్నారు. దీనికి రేవంత్ రెడ్డి ప్రభుత్వమే కారణమని తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన నాయకులు, వారి అనుచరులు కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కేటీఆర్ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన తర్వాత అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు కేసీఆర్ అత్యంత నిష్టతో పనిచేశారని అన్నారు. నగరంలో పది సంవత్సరాల్లో మన ప్రభుత్వం చేసిన అభివృద్ధిని గుర్తు తెచ్చుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. పది సంవత్సరాల కింద హైదరాబాద్‌లో ఉన్న కరెంట్ కోతలు, తాగునీటి తిప్పలు, అస్తవ్యస్తపు రోడ్లను

-4 లో

# గొల్లపూడి ప్రగతి పథంలో మరో ముందడుగు

## లినూతన సిమెంట్ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ మేడూరి రామారావు , శంకుస్థాపన







**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో పెన్ పవర్ జనవరి 11**
గ్రామ సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా గొల్లపూడి పంచాయతీ పాలకవర్గం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ఈరోజు గ్రామంలోని ప్రధాన పుర విధుల్లో అంతర్గత రహదారుల ఆధునీకరణకు శ్రీకారం చుట్టారు. లిగ్రామ సర్పంచ్ మేడూరి రామారావు మరియు ఉపసర్పంచ్ ఈలప్రోలు వెంకటప్పయ్య , సంయుక్తంగా కొమరానేని కోటేశ్వరరావు గారి ఇంటి నుంచి బిలివర్ చర్చి వరకు నూతన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేసి, శంకుస్థాపన చేశారు.

**ప్రజల ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం**
చాలా కాలంగా ఈ వీధిలోని రహదారి అస్తవ్యస్తంగా మారి, వర్షాకాలంలో బురదమయంగా తయారవుతుండటంతో స్థానికులు మరియు బిలివర్ చర్చిక్రైస్తవ సోదరులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన సర్పంచ్ ప్రత్యేక నిధులను కేటాయించి నాణ్యమైన సిమెంట్ రోడ్డు నిర్మించాలని నిర్ణయించారు.


**నాణ్యతే ప్రామాణికం – సర్పంచ్ మేడూరి రామారావు**
శంకుస్థాపన అనంతరం సర్పంచ్ మేడూరి రామారావు మాట్లాడుతూ.. "గ్రామ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే మా మొదటి ప్రాధాన్యత. కేవలం రోడ్లు వేయడమే కాకుండా, అవి దశాబ్దాల పాటు మన్నికగా ఉండేలా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించాం. గ్రామస్తులు కూడా పనుల పర్యవేక్షణలో సహకరించాలి" అని కోరారు . ఈ లికార్యక్రమంలో,స్థానిక 6 వార్డ్ మెంబెర్,బత్తిన లక్ష్మయ్య ,మరోవార్డ్ మెంబెర్ బంక బాబు గారు, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు ౯ాఖ. సైదా మిట్టపల్లి సతీష్ ముత్తారపు దేవిడ్ శాఖముడి లోకేశ్వరావు గారు,దండేలా ప్రసాద్ గ్రామ పెద్దలు , గ్రామ నాయకులు, మరియు గ్రామ యువకులు తెరాల రాజేష్ గూడపాటి నవీన్, మద్దిరాల లక్ష్మి నారాయణ, మీడిద్దిడి నవీన్, మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు


# క్రైస్తవుల ఆత్మీయ అభినందన సభ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో పెన్ పవర్ జనవరి 11**
మంచి కార్యక్రమానికి, మీరు కోరిన కోరిక, మన మతానికి, ఆచారాలకు అనుగుణంగా, స్థలాన్ని కోరారుస్థలం కోరడమే కాకుండా దానిని ఫాలో అప్ చేసి స్థలాన్ని సాధించుకున్నారుఇది క్రైస్తవుల చిరకాల కోరిక, ప్రభువు దీవెనలతో ఈ స్థలం మీకు వచ్చిందిమనం ఏది చేసినా ప్రభువు యొక్క ఆశీర్వాదం ఎంతైనా ఉంటుందిమేము అధికారంలో ఉండి పని చేసే అవకాశం మాకు ప్రభువు ఇచ్చాడుజాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఎంత పని ఒత్తిడి ఉన్న ఈ సత్యం గురించి ఎంతో శ్రమించారుఎవరికి ఇబ్బంది లేని స్థలాలను వాళ్ళు అడిగి అడగకపోయినా వాళ్ళకోసం కేటాయిస్తాం
జేసీ కి విజ్ఞప్తి మరో రెండు మూడు స్థలాలు సేకరించి ఇవ్వాలి ఎన్నెస్పీ స్థలంలో ఉన్న చర్చ్ కోసం స్థలం సేకరించాలిచేయను అంటే సరిపోతుంది, చేస్తా అంటే తల తాకట్టు పెట్టీ అయిన పని చేసి పెట్టాలినేను చెప్పినంత మాత్రాన పనులు జరగవు, ఇది ప్రభుత్వం అధికారులు పూనుకుంటే పనులు పూర్తవుతాయి...

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన వైరా ఎమ్మెల్యే రామదాసు నాయక్





**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో పెన్ పవర్ జనవరి 11**
ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ సిఫార్సుతో మంజురైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను వైరా ఎంఎల్ఏ క్యాంప్ కార్యాలయంలో వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ చేతులమీదుగా అందజేసినారు లిలిమల్లుపల్లి గ్రామానికి చెందిన
1. గంజి వేంకటేశ్వర్లు 18000 వేల రూపాయలు రామ నరసయ్య నగర్ గ్రామానికి చెందిన 2.బానోతు మాలతి 60000 వేల రూపాయలు 3. మాలోతు నీహారిక 32000 వేల రూపాయలు 4. యాస చందర్ రావు 25000 వేల రూపాయలు
చెక్కులను పంపిణీ చేయడం జరిగింది లిఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ధర్మసోత్ కోటేష్ సిపిఐ పార్టీ జిల్లా నాయకులు రామనరసయ్య నగర్ మాజీ సర్పంచ్ కంపసాటి వెంకన్న రామనరసయ్య నగర్ సిపిఐ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు మాలోతు శోభన్ మల్లుపల్లి గ్రామ ఈజిఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ గంజి వెంకటేశ్వర్లు యాస చందర్ రావు యాస రఘు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారులిలి

# సాంస్కృతిక పునరుజ్జీవనానికి యువత కట్టుబడి ఉండాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** భారతీయ సంస్కృతి పునరుజ్జీవానికి నేటితరం యువత కట్టుబడి ఉండాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. శంషాబాద్ మండల పరిధిలోని ముచ్చింతల్ లో ఉన్న స్వర్ణభారత్ ట్రస్ట్ (హైదరాబాద్ చాప్టర్)లో ఆదివారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి పునరుజ్జీవనానికి యువతరం కంకణబద్ధులు కావాలన్నారు. సంక్రాంతి సందర్భంగా అందరూ ఈ సంకల్పం తీసుకోవాలని పిలుపునిచ్చారు. పురాతన భారతీయ ధర్మమైన షేర్ అండ్ కేర్ సూత్రాన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలని, మనకున్న దానిని నలుగురితో పంచుకోవడం, నలుగురి సంక్షేమం పట్ల శ్రద్ధ వహించడం మన జీవన విధానంలో భాగం చేసుకోవాలని కోరారు. ఉన్నత స్థాయిలో ఉన్న వారు తమ తమ గ్రామాల్లో ఓ సేవాలయాన్ని ఏర్పాటు చేసేందుకు, ఇతరులు చేస్తున్న సేవా కార్యక్రమాలకు తోడ్పాటు అందించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

**పండుగ అంటే కొత్త బట్టలు కాదు ..**
పండుగ అంటే కొత్త బట్టలు, కొత్త ఆలోచనలే గాక పాత అనుభవాలను జ్ఞప్తికి తెచ్చుకుని భవిష్యత్తును నిర్ణయించుకుని ముందుకు సాగడం అని వెంకయ్య నాయుడు పేర్కొన్నాడు. మన ఆనందాన్ని నలుగురితో పంచుకుంటే అసలైన ఆనందం వస్తుందని, పెద్దలకు గౌరవాన్ని ఇవ్వాలి, కుటుంబ వ్యవస్థను పటిష్టం చేసుకోవాలని తెలిపారు. ప్రకృతిలోని ప్రతి జీవితో మన ఆనందాన్ని పంచుకోవాలని, ప్రకృతిని ప్రేమించాలి – ప్రకృతితో కలిసి జీవించాలని సూచించారు. ప్రకృతి, సంస్కృతులు మేలైన భవిష్యత్తును నిర్మిస్తాయని తెలిపారు. పదిమందికి సాయం చేయాలనే భారతీయ సంస్కృతిని భావితరాలకు తెలియజేసే మార్గాలే మన పండుగలని వెంకయ్యనాయుడు. ముఖ్యంగా సంక్రాంతి అందించే విస్పష్టమైన సందేశమిదేనని స్పష్టం చేశారు.



హైదరాబాద్ చాప్టర్ భవనం ప్రారంభం
ముచ్చింతల్ లోని స్వర్ణ భారత్ ట్రస్ట్ (హైదరాబాద్ చాప్టర్) ప్రాంగణంలో ఆదివారం ముప్పవరపు ఫౌండేషన్ హైదరాబాద్ చాప్టర్ భవనాన్ని వెంకయ్యనాయుడు ప్రారంభించారు. షేర్ అండ్ కేర్ ఈజ్ ద కోర్ అఫ్ ఇండియన్ ఫిలాసఫీ, సేవా మార్గం భారతీయ సనాతన ధర్మంలో ఉత్కృష్టమైనది పేర్కొన్నారు. ఈ ధర్మాన్ని అనుసరిస్తూ తన కుమారుడు, ముప్పవరపు ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ ముప్పవరపు హర్షవర్ధన్ సేవా మార్గాన్ని ఎంచుకోవటాన్ని అభినందిస్తున్నట్లు తెలిపారు. ఆతిధ్యరంగం సహా వివిధ రంగాల్లో నైపుణ్య అభివృద్ధి కోర్సులను యువతరానికి ఉచితంగా ఈ ఫౌండేషన్ ద్వారా అందిస్తున్నట్లు వివరించారు. యువతరం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**పాల్గొన్న ప్రముఖులు**
వేడుకల్లో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, పద్మశ్రీ గరికపాటి నరసింహారావు, సినీ నటుడు డాక్టర్ బ్రహ్మానందం, బిజెపి అధ్యక్షుడు రామ్ చంద్ర రావు, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తో పాటు పలువురు ప్రముఖులు తదితరులు అతిథులుగా హాజరయ్యారు.

## రూ.547 కోట్ల లావాదేవీలు.. సత్తుపల్లికి చెందిన సైబర్ క్రైమ్ ముఠా అరెస్ట్

-3 పేజి తరువాయి
జరిపినట్టు గుర్తించారు. సత్తుపల్లి, వేంసూర్, లింగపాలెం, సదాశివుడు పాలెం, సీతారాంపురం, రామానగరం, తుమ్మూరు గ్రామాలకు చెందిన మరో ఆరుగురు పేరిట ఖాతాలు తెరిచి వారికి రూ.5వేలు, కరెంట్ అకౌంట్ అయితే రూ.10వేలు ఇచ్చి ఏజెంట్ల ద్వారా బ్యాంకు ఖాతాలు తెరిపించారు. అనంతరం ఆ ఖాతాలను సైబర్ నేరాలకు వినియోగించుకొన్నారని సీపీ వివరించారు. నేరస్థుల బ్యాంక్ అకౌంట్‌లపై దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలలో వందల సంఖ్యలో సైబర్ క్రైమ్ ఫిర్యాదులు అందాయని తెలిపారు.

## 16 నుంచి సీఎం మున్సిపల్ ప్రచారం

-3 పేజి తరువాయి
మున్సిపల్ ఎన్నికలకు హైదరాబాద్ మినహా మిగిలిన 9 ఉమ్మడి జిల్లాల్లో ఒక్కోచోట లక్ష మందితో భారీ బహిరంగ సభ నిర్వహించాలనేది కాంగ్రెస్ ప్రచార వ్యూహం. ఈ సభలను విజయవంతం చేయడానికి ఒక్కో లోక్‌సభ నియోజకవర్గం లేదా ఒక ఉమ్మడి జిల్లా పర్యవేక్షణ బాధ్యతలను ఒక్కో మంత్రికి అప్పగించాలని సీఎం ఇప్పటికే సూచించారు. ఈ మేరకు ఏ జిల్లాకు ఏ మంత్రి అనేది పార్టీ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. లోక్‌సభ నియోజకవర్గాలకు కాకుండా.. ఉమ్మడి జిల్లాలకు ప్రస్తుతం ఇన్‌ఛార్జి మంత్రులుగా ఉన్నవారికే సభల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలనే యోచనలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) ఉన్నట్లు సమాచారం. పీసీసీ రూపొందించిన ప్రతిపాదనలపై ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించిన తరవాత మంత్రుల జాబితాను విడుదల చేస్తామని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ 'ఈనాడు'కు చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతం వార్డులు, ఛైర్మన్ పదవులు గెలవాలనే లక్ష్యంతో సభలు, ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## కుల సంఘాలు రాజకీయ పార్టీలకు ఊడిగం చేయొద్దు

-3 పేజి తరువాయి
ఈ పైసల ఉచ్చు నుండి బయట పడాలంటే చైతన్యం ఐక్యతప్ప మరో మార్గం లేదున్నారు. దీనిని ధ్వంసం చేయగలిగిన శక్తి యువతకు, సంఘాలకు మాత్రమే ఉంటుందని. మీరు అనుకున్న గోల్ ఎంతో దూరంలో లేదని సందర్భం వస్తుంది కొట్టుడు కొడదామన్నారు. దేశం యువశక్తి చేతుల్లో ఉందని మన ప్రధాని నరేంద్ర మోడీ పదే పదే చెబుతున్నారు. యువతకు రాజీ పడే అలవాటు ఉండదన్నారు. మన చరిత్ర మనం చెప్పుకోకుండా, రాసుకోకుండా ఉంటే మనం చిన్న వాళ్ళం అయిపోతామన్నారు.

## ఎవరి దగ్గర కూడా డబ్బులు లేవు

-3 పేజి తరువాయి
హైదరాబాద్ నగర ప్రజలు చూసినారని అన్నారు. రాష్ట్రంలో మిషన్ భగీరథతో పాటు హైదరాబాద్ మరియు ఇతర పట్టణాల్లో విస్తృతమైన తాగునీటి ప్రాజెక్టుల ద్వారా తాగునీటి సమస్యలు 90 శాతం పైగా పరిష్కరించామని తెలిపారు. కరోనా సమయంలో కూడా హైదరాబాద్ అభివృద్ధి కోసం, తెలంగాణ అభివృద్ధి కోసం పనిచేశామని పేర్కొన్నారు.పార్టీ మారి కాంగ్రెస్‌లో చేరిన ఫిరాయింపు ఎమ్మెల్యేల పరిస్థితి చాలా దయనీయంగా ఉందని, నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మని చెప్పుకుంటూ, స్పీకర్ దగ్గర మాత్రం బీఆర్ఎస్ పార్టీ అంటున్నారని కేటీఆర్ అన్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ఏమి అభివృద్ధి చూసి కాంగ్రెస్‌లో చేరిండో నియోజకవర్గ ప్రజలకు చెప్పాలని అన్నారు. రాజేంద్రనగర్‌కు వచ్చే ఏర్పాటు చేసిన మెట్రో ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేసినందుకు సీఎంతో కలిసి పోయిండా అనే విషయం చెప్పాలని కేటీఆర్ అన్నారు.

### పండగని పండగలా జరుపుకోండి.

## ప్రాణాలు తీసి కాదు

-3 పేజి తరువాయి
దీని వల్ల వచ్చే ఆనందం కంటే విషాదమే ఎక్కువ అన్నారు. పిల్లలు చైనా వాడకుండా పెద్దలు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలంతా నూలు దారాన్ని వాడాలని సూచించారు. గాలిపటం ఎగరాల్సింది ఆకాశంలో.. అమాయక ప్రాణాల్లో కాదని అన్నారు. చైనీస్ మాంజా దారం తెగదు కానీ మనుషుల మెడలు, పక్షుల రెక్కలు కోస్తుందని అన్నారు. మీ క్షణికానందం.. మరొకరి ఇంట తీరని విషాదం కాకూడదన్నారు. నిషేధిత చైనా మాంజా అమ్మినా, వాడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పండగని పండగలా జరుపుకోవాలని.. ప్రాణాలు తీసి కాదన్నారు.

## రంగారెడ్డి జిల్లా'ను గ్రేటర్‌గా మార్చాలి

ప్రత్యేక మహానగర పాలక సంస్థగా ఏర్పాటుకు కాంగ్రెస్ నాయకుల డిమాండ్
ఓ వ్యవసాయ క్షేత్రంలో సమావేశం.. సీఎంకు విన్నవించాలని నిర్ణయం



**హైదరాబాద్ పెన్ పవర్:** రంగారెడ్డి జిల్లాని హైదరాబాద్ కార్పొరేషన్‌లో కలపకుండా ప్రత్యేక మహానగర కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు కోరుతున్నారు. దీనిపై త్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి తమ అసంతృప్తి, వాదన వినిపించేందుకు నిర్ణయించారు. శనివారం రాత్రి జిల్లాలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి నేతృత్వంలో నాయకులు సమావేశమయ్యారు. ఫ్యూచర్ సిటీలో కొంత భాగం, జీహెచ్ఎంసీలో మరికొంత భాగం కలవడంతో రంగారెడ్డి జిల్లా రెండు ముక్కలై ఉనికి కోల్పోనుందని పలువురు నేతలు ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇలా అశాస్త్రీయంగా విభజించడంతో రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పెద్ద నష్టం జరిగే అవకాశం ఉందని వారు నిర్ణయానికి వచ్చారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి రంగారెడ్డి జిల్లాను హైదరాబాద్ కార్పొరేషన్‌లో కలపకుండా చూడాలని, ప్రత్యేకించి రంగారెడ్డి జిల్లా మహానగర పాలక సంస్థను ఏర్పాటు చేయాలని కోరనున్నారు. సమావేశంలో ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, రాజేంద్రనగర్, చేవెళ్ల ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, ప్రకాష్‌గౌడ్, కాలే యాదయ్య.. నేతలు మధుయాస్కీగౌడ్, కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్, మల్‌రెడ్డి రాంరెడ్డి, తీగల అనితారెడ్డి, తీగల కృష్ణారెడ్డి, భీమ్‌భరత్, గౌరీ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతికి ఆంధ్రాకు వెళ్లి.. జనవరి 18, 19 తేదీల్లో.. హైదరాబాద్‌కు తిరిగి వస్తున్నారా..?



**హైదరాబాద్ పెన్ పవర్:** సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే . హైదరాబాద్, అనకాపల్లి మధ్య మరో మూడు ప్రత్యేక రైళ్లను ప్రకటించింది. ఈ రైళ్లు చర్లపల్లి రైల్వే స్టేషన్ నుంచి బయల్దేరి అనకాపల్లి వెళతాయని.. అనకాపల్లి నుంచి చర్లపల్లికి చేరుకుంటాయని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ట్రైన్ నెంబర్ 07479 అనకాపల్లి-చర్లపల్లి.. జనవరి 18న రాత్రి 10.30 గంటలకు అనకాపల్లి నుంచి బయలుదేరి మరుసటి రోజు (జనవరి 19న) ఉదయం 11.30 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. ట్రైన్ నెంబర్ 07477 చర్లపల్లి-అనకాపల్లి.. జనవరి 19న 12.40 ఖఎకు చర్లపల్లి నుంచి బయలుదేరి అదే రోజు (జనవరి 19న) రాత్రి 9 గంటలకు అనకాపల్లికి చేరుకుంటుంది.ఇక మూడో రైలు.. ట్రైన్ నెంబర్ 07478 జనవరి 19న రాత్రి 10.30 గంటలకు అనకాపల్లి నుంచి బయలుదేరి మరుసటి రోజు (జనవరి 20) ఉదయం 11.30 గంటలకు చర్లపల్లి చేరుకుంటుందని దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది.

ఇవి మాత్రమే కాదు.. సంక్రాంతి పండుగకు ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే అదనంగా మరో పది ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ట్రైన్ నెంబర్.07475 రైలు హైదరాబాద్ నుంచి విజయవాడకు 11, 12, 13, 18, 19 తేదీల్లో వెళుతుంది.ట్రైన్ నెంబర్.07476 రైలు.. విజయవాడ నుంచి హైదరాబాద్?కు 10,11,12,17,19 తేదీల్లో వెళుతుందని.. ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని దక్షిణ మధ్య రైల్వే సూచించింది. అంతేకాదు.. 11, 12 తేదీల్లో హైదరాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్ నగర్?కు (ట్రైన్ నెంబర్.07473), 10, 11 తేదీల్లో సిర్పూర్ కాగజ్ నగర్ నుంచి హైదరాబాద్?కు ((ట్రైన్ నెంబర్.07474) రెండు రైళ్లు రాకపోకలు సాగిస్తాయని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది.

హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లే స్పెషల్ ట్రైన్ సికింద్రాబాద్, చర్లపల్లి, భువనగిరి, జనగామ, ఘన్ పూర్, కాజీపేట్, వరంగల్, నెక్కొండ, కేసముద్రం, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర రైల్వే స్టేషన్లలో ఆగుతుంది. విజయవాడ నుంచి హైదరాబాద్ వచ్చే స్పెషల్ ట్రైన్ కూడా ఇవే రైల్వే స్టేషన్లలో ఆగుతుంది.

## తన సమాధి తానే కట్టించుకున్నాడు.. ఆరేళ్లకే భార్య చనిపోయింది.. పాపం ఇప్పుడు ఏమైందంటే..



**జగిత్యాల: పెన్ పవర్:** జగిత్యాల జిల్లాలో 12 సంవత్సరాల క్రితమే తన సమాధిని తానే నిర్మించుకున్న ఇంద్రయ్య చనిపోయాడు. జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఇంద్రయ్య అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. తన కోసం నిర్మించుకున్న సమాధిలోనే చివరి కర్మలు నిర్వహించేందుకు బంధువులు ఏర్పాట్లు చేస్తున్నారు.

తను సమాధిని నిర్మించుకున్న ఆరు సంవత్సరాల తర్వాత తన భార్య చనిపోగా ఆ పక్కనే తన భార్య సమాధిని ఇంద్రయ్య నిర్మించుకున్నాడు. ఇంద్రయ్యకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. గ్రామంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే వ్యక్తిగా ఇంద్రయ్యకు మంచి పేరు ఉంది.

ఇంద్రయ్య మృతి గ్రామస్తుల్లో తీవ్ర విషాదం నింపింది. అవసరమైన వారికి సహాయం చేస్తూ, గ్రామ అభివృద్ధిలో ఇంద్రయ్య తన వంతు పాత్ర పోషించాడు. ఆయన జ్ఞాపకాలు మాత్రం లక్ష్మీపూర్ గ్రామంలో చిరస్థాయిగా నిలిచిపోతాయని గ్రామస్తులు ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు.తండ్రి చివరి కోరికను మన్నించి ఆయన 12 ఏళ్ల క్రితం కట్టుకున్న ఆ రాతి సమాధి దగ్గర కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ముందే కట్టుకున్న సమాధిలో ఇంద్రయ్య అంత్యక్రియల కోసం ఏర్పాట్లు చేశారు. వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఇంద్రయ్య కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి చనిపోయాడు.

## కృష్ణా, గోదావరి నదీ జలాల వివాదంపై రేణుకా చౌదరి కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్ పెన్ పవర్:** కృష్ణా, గోదావరి నదీ జలాల వివాదంపై రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి కీలక వ్యాఖ్యలు చేశారు. నీటి వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవా లని అన్నారు. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు మంచి సంబంధాలు ఉన్నాయని ఇద్దరూ ఒకచోట కూర్చుని సమస్యను పరిష్కరించుకోవాలని అన్నారు. వైసీపీ వాళ్లు ఏమైనా చెబుతారని మొరిగే కుక్కలకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని అన్నారు.ఇదిలా ఉంటే తాను కోరడం వల్లనే చంద్రబాబు రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను ఆపేశాడని రేవంత్ రెడ్డి మాట్లాడటంతో నీటి వివాదం మరోసారి హాట్ టాపిక్ గా మారింది. రేవంత్ రెడ్డి చెప్పడం వల్ల రాయసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ఆగిపోలేదని ఏపీ ప్రభుత్వం ప్రకటించింది. ఈ క్రమంలో ఏపీలో వైసీపీ, తెలంగాణలో బీఆర్ఎస్ ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలపై విమర్శల వర్షం కురిపిస్తున్నాయి. దీంతో నీళ్ల పంపకాలపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ప్రశ్నగా మారింది.

## కనీసం నంది అవార్డులను ఇవ్వలేని మీరా మాగురించి మాట్లాడేది?: ఆది శ్రీనివాస్


**హైదరాబాద్ పెన్ పవర్:** పదేళ్లు అధికారంలో ఉండి సినీ పరిశ్రమను పట్టించుకోని బీఆర్ఎస్ ఇవాళ సినిమా పరిశ్రమనంతటిని ఉద్ధరించినట్లుగా మాట్లాడుతోందని ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ మండిపడ్డారు. థియేటర్ల కంటే తెలంగాణ సచివాలయంలోనే పెద్ద సస్పెన్స్ త్రిల్లర్ సినిమా నడుస్తోందని, సినిమాటోగ్రఫీ మంత్రికి తెలియకుండానే సినిమా టికెట్ ధరలు పెంచుతూ జీవోలు వస్తున్నాయని మాజీ మంత్రి హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలకు ఆదిశ్రీనివాస్ తాజాగా కౌంటర్ ఇచ్చారు. ఈ మేరకు ఓ వీడియోను రిలీజ్ చేసిన ఆయన.. సినీ పరిశ్రమ విషయంలో హరీశ్ రావు చిలక పలుకులు పలుకుతున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలో కనీసం నంది అవార్డులు కూడాఇవ్వలేదని మీ హాయంలో సినీ నిర్మాతకలు హీరోలకు లబ్ధి చేకూర్చేందుకు టికెట్ ధరలు పెంచేందుకు అనుమతి ఇచ్చారని ధ్వజమెత్తారు. కానీ సీఎం రేవంత్ రెడ్డి మాత్రం సినీ కార్మికుల సంక్షేమం కోసం ప్రి రిలీజ్ షోలకు వచ్చే ఆదాయంలో 20 శాతం వాటా ఇచ్చేలా జీవో తీసుకువచ్చారన్నారు. ఈ ప్రభుత్వం సినీ కార్మికులకు ప్రత్యేక విద్య, వైద్యం ఏర్పాట్లు చేశారన్నారు.

# టికెట్ లేకుండా రైళ్లలో.. ఇంత మంది జర్నీ చేస్తున్నారా..? ఒక్క జనవరి 10నే ఎంత ఫైన్ వసూలైందంటే..



**హైదరాబాద్ పెన్ పవర్:** దక్షిణ మధ్య రైల్వే టికెట్ చెకింగ్ రెవెన్యూపై కీలక ప్రకటన చేసింది. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో.. ఒక్క జనవరి 10వ తేదీనే కోటీ 22 లక్షల రూపాయలు.. టికెట్ లేని ప్రయాణికుల నుంచి జరిమానా రూపంలో ఆదాయం వచ్చిందని రైల్వే ప్రకటించింది. గత నవంబర్ నుంచి.. టికెట్ లెస్ ప్యాసింజర్ల నుంచి జరిమానాల రూపంలో ఒక్కరోజే కోటి రూపాయలకు పైగా ఆదాయం దక్కడం ఇది పదో సారి అని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది.దక్షిణ మధ్య రైల్వే 153 స్పెషల్ ట్రైన్లు నడుపుతున్నది. నెల రోజుల ముందే ఈ ట్రైన్లను ప్రకటించిన రైల్వే శాఖ.. టికెట్ల బుకింగ్ కూడా ప్రారంభించింది. ఇప్పటికే చాలా రైళ్లలో రిజర్వేషన్లు ఫుల్ అయిపోయాయి.ద సికింద్రాబాద్ నుంచి రోజుకు సగటున 2.20 లక్షల మంది, లింగంపల్లి నుంచి 50 వేల మంది, చర్లపల్లి నుంచి 35 వేల మంది జర్నీ చేస్తున్నారు. టికెట్ల కొనుగోలు, రైలు ఎక్కేటప్పుడు తొక్కిసలాట జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని రైల్వే సీఆర్ వో శ్రీధర్ తెలిపారు.సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో 17 బుకింగ్ కౌంటర్లు, 20 ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మెషిన్లు ఏర్పాటు చేశామన్నారు. రైల్ వన్ మొబైల్ యాప్ తో అన్ రిజర్వ్ డ్ టికెట్ బుక్ చేసుకుంటే 3% తగ్గింపు ఉందని తెలిపారు. ఇది 14 జనవరి నుంచి 18 వరకు అమల్లో ఉంటుందని చెప్పారు.

# తిరుమల వైకుంఠ ద్వార దర్శనం పేరుతో.... హైదరాబాద్‌లో ఈ మహిళ ఎలా మోసం చేసిందో చూడండి




**హైదరాబాద్ పెన్ పవర్:** సంక్రాంతి సెలవులు కావడంతో తిరుమల దేవస్థానానికి భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. దర్శనం కోసం కాస్త కష్టపడాల్సిన పరిస్థితి. ఈ సిచువేషన్ ను దృష్టిలో ఉంచుకుని క్యాష్ చేసుకోవాలనుకుంది ఓ మహిళ. హైదరాబాద్ లో వైకుంఠ ద్వార దర్శనం సేవా టికెట్లు ఇప్పిస్తానని చెప్పి భక్తుల నుంచి లక్షల్లో వసూలు చేసింది. బాధితుల ఫిర్యాదుతో కేసు వెలుగులోకి వచ్చింది.

సికింద్రాబాద్ పరిధిలో జరిగింది ఈ ఘటన. తిరుమల వైకుంఠ ద్వార దర్శనం సేవా టికెట్లు చేయిస్తానని మోసం చేసిన మహిళను మమతగా గుర్తించారు. సుమారు 100 నుంచి 150 మంది భక్తుల దగ్గర డబ్బులు వసులు చేసినట్లు పోలీసులు తెలిపారు. బాధితులు ఫిర్యాదు మేరకు మమతపై కేసు నమోదు చేశారు సికింద్రాబాద్ మహంకాళి స్టేషన్ పోలీసులు. టికెట్ల పేరున భక్తుల నుంచి 15 వందల నుంచి 3 వేల రూపాయలు వరకు వసూలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసులో దర్యాప్తు ప్రారంభించారు పోలీసులు. టికెట్ల విషయంలో మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని ఈ సందర్భంగా భక్తులను హెచ్చరించారు పోలీసులు.

# సంక్రాంతి పెద్దల పండుగ.. పితృ దేవతలు తృప్తి కోసం తర్పణాలు వదలాల్సిన రోజు ఇదే..




**హైదరాబాద్ పెన్ పవర్:** మకర సంక్రాంతి హిందువులకు పెద్ద పండుగ. ఈ రోజు ( 2026 జనవరి 15) పితృ దేవతలను పూజించాలని పండితులు చెబుతున్నారు. సూర్యుడు వెలుగులో పితృదేవతలు వారి వారసులు ఉండే ప్రదేశానికివస్తారని.. వారు ఇచ్చే ఆహారం కోసం ఎదురు చూస్తారని పురాణాల ద్వారా తెలుస్తుంది. అందుకే ఆ రోజు కచ్చితంగా పితృ దేవతలకు తర్పణాలు వదిలి.. పేదలకు అన్నదానం చేయాలి. అలాగే స్వయం పాకం ఇవ్వాలని చెబుతున్నారు. పురాణాల ప్రకారం మకర సంక్రాంతి రోజున ఏ దైవాన్ని పూజించినా, యజ్ఞం చేసినా విశేష ఫలితం ఉంటుందని నమ్ముతారు. సంక్రాంతి రోజున పితృదేవతల ప్రీతి కోసం తర్పణాలు వదులుతారు.సంక్రాంతి రోజు సూర్యుడు మకరరాశిలోకి అడుగుపెడతాడు. మకర రాశికి శని అధిష్టాన దేవత. వరుసల ప్రకారం సూర్యుడు, శని తండ్రీకొడుకులు. అయితే వాళ్లిద్దరికి అసలు పడదు. కానీ ఈ పండుగరోజు కలుస్తారు. సూర్యుడు ధనుస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించే రోజు మకర సంక్రాంతి. ఈ రోజును పవిత్ర పుణ్య దినంగా భావిస్తారు. ఈ పుణ్య ఘడియలు ఆషాఢశుద్ధ ఏకాదశి వరకు ఉంటాయి. అంటే అప్పటి వరకు ఉత్తరాయణ పుణ్యకాలం కొనసాగుతుంది.సంక్రాంతిలో సం... అంటే... చేరుకోవడం... క్రాంతి అంటే ...వెలుగు, అభివృద్ధి అని రెండు అర్థాలు ఉన్నాయి.మకర సంక్రాంతిని పంటకోతల పండుగ.... కుప్ప నూర్పిడుల పండుగ అని కూడా పిలుస్తారు. పంట ఇంటికి వచ్చిన తర్వాత, మళ్లీ కొత్త పంట వేయడానికి కావాల్సిన వాటిని సిద్ధం చేసుకోవాలన్న సోయి కూడా ఈ పండుగలో ఉందని . . సంక్రాంతి పండుగ అంటే వెలుగును ఆహ్వానించడమేనని పెద్దలు చెబుతున్నారు ఈ పండుగకు సూర్యుడికి సంబంధం ఉంది. పురాణాల ప్రకారం సూర్యుడు ఇంద్ర, వరుణ, వాయుదేవతల సాయంతో వర్షాలు కురిపిస్తాడు. అందుకే ఈ రోజు పొంగలిని సూర్యుడికి నై వేద్యంగా పెడతారు. నీళ్లను సూర్యుడికి నివేదన కూడా ఇస్తారు. సంక్రాంతి రోజు కొత్త కుండలో పాలు పొంగించి, కొత్త బియ్యం, కొత్త బెల్లంతో పొంగలి వండుతారు. మకరరాశికి అధిపతి శని. అందుకే ఈ రోజు శనికి ప్రీతికరమైన నల్లనువ్వులు, బెల్లంతో చేసిన లడ్డూలు, గుమ్మడికాయలు దానం చేస్తారు. ఇలా చేస్తే ఆరోగ్యం, సిరిసంపదలు వృద్ధి చెందుతాయని విశ్వాసం. నువ్వులు, బెల్లం తినడం వల్ల వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది. అందుకే ఈ రెండు పదార్థాతో చేసిన అరిసెలు ఓ నెల రోజుల వరకు ఉంటాయి.

సంక్రాంతి రోజు కొత్త కుండలో పాలు పొంగించి, కొత్త బియ్యం, కొత్త బెల్లంతో పొంగలి వండుతారు. మకరరాశికి అధిపతి శని. అందుకే ఈ రోజు శనికి ప్రీతికరమైన నల్లనువ్వులు, బెల్లంతో చేసిన లడ్డూలు, గుమ్మడికాయలు దానం చేస్తారు. ఇలా చేస్తే ఆరోగ్యం, సిరిసంపదలు వృద్ధి చెందుతాయని విశ్వాసం. నువ్వులు, బెల్లం తినడం వల్ల వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది. అందుకే ఈ రెండు పదార్థాతో చేసిన అరిసెలు ఓ నెల రోజుల వరకు ఉంటాయి.

మకర సంక్రాంతిని పంటకోతల పండుగ.... కుప్ప నూర్పిడుల పండుగ అని కూడా పిలుస్తారు. పంట ఇంటికి వచ్చిన తర్వాత, మళ్లీ కొత్త పంట వేయడానికి కావాల్సిన వాటిని సిద్ధం చేసుకోవాలన్న సోయి కూడా ఈ పండుగలో ఉందని పెద్దలు చెబుతున్నారు.

# కరీంనగర్ జిల్లాలో ఎంత పెద్ద కంటైనర్ బోల్తా పడిందో చూడండి !



**కరీంనగర్: పెన్ పవర్:** కరీంనగర్ జిల్లాలో పెద్ద కంటైనర్ బోల్తా పడింది. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం తాడికల్ శివారులో కంటైనర్ బోల్తా పడి రానావేణి హన్మయ్య అనే వ్యక్తి మృతి చెందిన ఘటన విషాదం నింపింది. ఇక.. కామారెడ్డి జిల్లాలో జరిగిన మరో ప్రమాదంలో కంటైనర్ లారీ కారును వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ఘటనలో అదృష్టవశాత్తూ.. కారులో ఉన్న భార్యాభర్త ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం సిద్ధ రామేశ్వర్ నగర్ గ్రామం దగ్గర 44వ హైవేపై ఆదివారం జరిగింది.సృజన్ మోహన్ రెడ్డి-పద్మ దంపతులు నిజామాబాద్ టౌన్?లో ఉంటున్నారు. నిజామాబాద్ నుంచి కారులో హైదరాబాద్?కు ఆదివారం ఉదయం బయలుదేరారు. అయితే.. వీళ్లు ప్రయాణిస్తున్న కారును అదుపు తప్పి మితిమీరిన వేగంతో వస్తున్న కంటైనర్ లారీ వెనుక నుంచి ఢీ కొట్టింది. కంటైనర్ డ్రైవర్ కారును కొద్ది దూరం ఈడ్చుకెళ్లి ఆగింది.

కారులో ఉన్న భార్యాభర్త ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ఎట్టకేలకు కారులో నుంచి బయటపడ్డారు. స్థానికులు కారులో ఉన్న ఇద్దరినీ జాగ్రత్తగా బయటకు తీయడంతో మోహన్ రెడ్డి, పద్మ షాక్ నుంచి కొంతసేపటికి తేరుకుని ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు స్పాట్?కు చేరుకుని ప్రమాదానికి గురైన కారును స్టేషన్?కు తరలించారు. కంటైనర్ డ్రైవర్?ను అదుపులోకి తీసుకున్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో క్వాంటం విప్లవం.. బాబు అడుగుజాడల్లో రేవంత్ రెడ్డి?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఒకప్పుడు సాఫ్ట్‌వేర్ రంగంలో విప్లవం సృష్టించిన తెలుగు నేల, ఇప్పుడు ప్రపంచాన్ని శాసించబోతున్న 'రెండో ఐటీ విప్లవం' వైపు వడివడిగా అడుగులు వేస్తోంది. వేగంలో వెలుగుతో పోటీపడే క్వాంటం కంప్యూటింగ్, అసాధ్యాన్ని సుసాధ్యం చేసే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్.. ఈ రెండు అస్త్రాలను చేతబూని జంట తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు భవిష్యత్తుపై గురిపెట్టారు. చంద్రబాబు నాయుడు 'క్వాంటం వ్యాలీ'తో పారిశ్రామిక సామ్రాజ్యాన్ని నిర్మిస్తుంటే, రేవంత్ రెడ్డి అదే సాంకేతికతను ప్రాణాలను కాపాడే వైద్య విజ్ఞానంతో ముడిపెడుతున్నారు. రాజకీయ వైరుధ్యాలు ఎలా ఉన్నా, ఆధునిక సాంకేతికత విషయంలో ఈ ఇద్దరు నేతల ఆలోచనలు కలవడం తెలుగు రాష్ట్రాల ప్రగతికి సరికొత్త దిక్సూచిగా మారుతోంది.

భారతదేశ సాంకేతిక పటంలో తెలుగు రాష్ట్రాలది ఎప్పుడూ ప్రత్యేక స్థానమే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలోనే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ( కి పునాదులు వేసిన దార్శనికత, ఇప్పుడు రెండు రాష్ట్రాల్లోనూ కొత్త పుంతలు తొక్కుతోంది. ముఖ్యంగా భవిష్యత్ సాంకేతికతగా పిలవబడే క్వాంటం కంప్యూటింగ్, కృత్రిమ మేధస్సు విషయంలో అటు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఇటు తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చూపుతున్న ఆసక్తి రెండు రాష్ట్రాల అభివృద్ధికి శుభసూచకంగా కనిపిస్తోంది.

**ఆంధ్రప్రదేశ్: క్వాంటం వ్యాలీ దిశగా అడుగులు**

ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో చంద్రబాబు నాయుడు శైలే వేరు. డేటా ప్రాసెసింగ్ వేగాన్ని ఊహించని రీతిలో పెంచే 'క్వాంటం కంప్యూటింగ్' భవిష్యత్తును మార్చబోతుందని ఆయన ముందుగానే గుర్తించారు. ఇందులో భాగంగానే, ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అతిపెద్ద క్వాంటం హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఐబీఎం (IBM), }‹dుmdt (TCS), ాా&ు వంటి అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్‌లో భారతదేశపు మొట్టమొదటి 'క్వాంటం వ్యాలీ టెక్ పార్క్' ఏర్పాటు కాబోతోంది. ఇది కేవలం ఒక కార్యాలయం కాదు.. హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, లోతైన పరిశోధనల సమాహారం. ఈ వ్యాలీ ద్వారా అత్యాధునిక సాంకేతిక ఆవిష్కరణలకు ఏపీ కేంద్ర బిందువు కానుంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని కేవలం వినియోగించుకోవడమే కాకుండా, దానిని సృష్టించే స్థాయికి రాష్ట్రాన్ని తీసుకెళ్లాలన్నది నాయుడు దృక్పథం.

**తెలంగాణ: సాంకేతికతతో కూడిన మానవీయ వైద్యం**

మరోవైపు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సైతం సాంకేతికత ప్రాముఖ్యతను గుర్తించడంలో వెనకడుగు వేయడం లేదు. ఇటీవల జరిగిన హెల్త్‌కేర్ కాన్క్లేవ్‌లో ఆయన చేసిన ప్రసంగం దీనికి నిదర్శనం. చంద్రబాబు నాయుడు టెక్నాలజీని పారిశ్రామిక వృద్ధికి సాధనంగా చూస్తే, రేవంత్ రెడ్డి దానిని సామాజిక ఆరోగ్య పరిరక్షణకు అనుసంధానం చేస్తున్నారు. క్వాంటం కంప్యూటింగ్, ాా× ప్రభావం ఆరోగ్య సంరక్షణ రంగంపై విపరీతంగా ఉండబోతోందని రేవంత్ స్పష్టం చేశారు. వైద్యులు కేవలం పాత పద్ధతులకే పరిమితం కాకుండా, మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అయితే, యంత్రాల యుగంలో 'మానవీయ స్పర్శ' (Human Touch) కోల్పోకూడదని ఆయన చేసిన సూచన ఆలోచించదగ్గది. టెక్నాలజీ ఎంత పెరిగినా రోగికి వైద్యునిపై ఉండే నమ్మకమే ప్రధానమని ఆయన నొక్కి చెప్పారు.

**ఆరోగ్య సంరక్షణలో విప్లవాత్మక మార్పులు**

గుండె జబ్బుల మరణాలపై రేవంత్ రెడ్డి వ్యక్తం చేసిన ఆందోళన సమంజసమే. సాంకేతికత సాయంతో వ్యాధులను ముందే గుర్తించడం ఒక ఎత్తయితే, ప్రాథమిక వైద్య సాయం అందించడం మరొక ఎత్తు. పాఠశాల విద్యార్థులకు CPR (Cardiopulmonary Resuscitation) శిక్షణ ఇవ్వాలని, అందులో వైద్యులు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని ఆయన కోరడం ఒక గొప్ప సామాజిక బాధ్యత. సాంకేతికతను నైపుణ్యంతోనూ, ప్రాణాలను కాపాడే సంకల్పంతోనూ ముడిపెట్టడం రేవంత్ రెడ్డి దార్శనికతకు అద్దం పడుతోంది.సాంకేతిక పరిజ్ఞానం విషయంలో రేవంత్ రెడ్డి తన పొరుగు రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడు నుంచి ప్రేరణ పొందడం లేదంటే ఆయన అడుగుజాడల్లో నడవడం అనేది రాజకీయాలకు అతీతంగా చూడాల్సిన అంశం. అభివృద్ధి విషయంలో ఒకరినొకరు పోటీ పడటం.., ఒకరిలోని మంచిని మరొకరు స్వీకరించడం వల్ల అంతిమంగా తెలుగు ప్రజలకే మేలు జరుగుతుంది. క్వాంటం కంప్యూటింగ్ అనేది కేవలం గణిత శాస్త్రం కాదు; అది రేపటి ప్రపంచపు ఆర్థిక, సామాజిక ఇంజిన్. ఆంధ్రప్రదేశ్ తన 'క్వాంటం వ్యాలీ' ద్వారా హార్డ్‌వేర్ రంగంలో, తెలంగాణ తన 'టెక్-హెల్త్' విజన్ ద్వారా సేవా రంగంలో దూసుకుపోతే, భారతదేశంలోనే తెలుగు రాష్ట్రాలు సరికొత్త అధ్యాయాన్ని లిఖించడం ఖాయం. భవిష్యత్తు క్వాంటం మయం, ఆ భవిష్యత్తుకు తెలుగు నేల వేదిక కాబోతోంది.

# హైదరాబాద్ - విజయవాడ హైవే పై ఎన్ని వాహనాలున్నాయో తెలుసా?




**హైదరాబాద్ పెన్ పవర్:** సంక్రాంతి పండగకు ఆంధ్రప్రదేశ్ కు వెళ్లే వారితో హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారి ఈరోజు కూడా రద్దీగా మారింది. సంక్రాంతికి వెళ్లే వాహనాలతో రద్దీ ఎక్కువయింది. కొన్ని చోట్ల బంపర్ టు బంపర్ ట్రాఫిక్ ఏర్పడుతుంది. వాహనాలు అతి నెమ్మదిగా సాగుతున్నాయి. ఈరోజు ఉదయం నుంచి మొదలయిన రద్దీతో జాతీయ రహదారిపై వాహనాలు చాలా నెమ్మదిగా అనేక చోట్ల సాగుతున్నాయి. ప్రధానంగా టోల్ ప్లాజాల వద్ద కొంత సమయం ఆగాల్సి రావడంతో అక్కడ ట్రాఫిక్ లో పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోతున్నాయి.

**టోల్ ప్లాజాల వద్ద..**

పంతంగి టోల్ ప్లాజా నుంచి కీసర టోల్ ప్లాజా వద్ద వాహనాల రద్దీ ఎక్కువగా ఉందని నిర్వాహకులు తెలిపారు. పోలీసులు అక్కడ విధులను నిర్వహిస్తూ ట్రాఫిక్ ను క్రమబద్ధీకరిస్తున్నప్పటికీ వాహనాలు మాత్రం వేగంగా వెళ్లాలని ముందుకు రావడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. టోల్ ప్లాజా వద్ద ట్రాఫిక్ ను వేగంగా పంపేందుకు విజయవాడ వైపు వెళ్లే టోల్ బూత్ లను ఎక్కువ సంఖ్యలో తెరిచారు. హైదరాబాద్ కు వచ్చే టోల్ బూత్ లను తగ్గించి అటు వైపు వెళ్లే బూత్ ల సంఖ్య పెంచారు.

**నిన్న ఒక్కరోజే...**

నిన్న దాదాపు విజయవాడ వైపు 70 వేల కుపైగా వాహనాలు వెళ్లాయని టోల్ నిర్వాహకులు చెబుతున్నారు. నేడు ఆదివారం కావడంతో రద్దీ మరింత ఎక్కువగా ఉంటుందన్న అభిప్రాయంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ ను ఎప్పటికప్పుడు క్లియర్ చేయడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారు. మరొకవైపు ఆర్టీసీ, ప్రయివేటు బస్సులు, రైళ్లు సంక్రాంతికి వెళ్లే ప్రయాణికులతో రద్దీగా మారిపోవడం, టిక్కెట్లు దొరకకపోవడంతో ఎక్కువ మంది సొంత వాహనాలతో బయలుదేరారు. ఈసారి ఆదివారం నుంచి ఆదివారం వరకూ సంక్రాంతి సెలవులు రావడంతో ఎక్కువ మంది సొంతూళ్లకు బయలుదేరి వెళుతున్నారు.

# ఈ జిల్లాల్లో నేడు వానలు.... ఎప్పుడూ లేని విధంగా వాతావరణంలో ఈ మార్పులెందుకంటే?

**హైదరాబాద్ పెన్ పవర్:** నైరుతి బంగాళాఖాతంలోని తీవ్రవాయుగుండం కేంద్రీకృతమై ఉందని దీని ప్రభావంతో నేడు నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అలాగే బాపట్ల, పల్నాడు, ప్రకాశం, రాయలసీమ జిల్లాల్లో తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది. శ్రీలంక తీరానికి సమీపంలో ఉన్న వాయుగుండం కారణంగా తమిళనాడు తీరం వెంబడి బలమైన గాలులతో కూడిన వాతావరణం నెలకొంది. మరొకవైపు చలిగాలుల తీవ్రత కూడా ఎక్కువయింది. పొగమంచు కూడా పెరిగిపోవడంతో సంక్రాంతికి సొంత వాహనాల్లో వెళ్లే వారు ఉదయం, రాత్రి వేళ ఇబ్బందులు పడుతున్నారు.

**చలి తీవ్రత ఎక్కువగా...**

దక్షిణ కోస్తా ఆంధ్ర ముఖ్యంగా తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో ఈ రోజంతా చల్లటి గాలులు వీస్తూ, ఆకాశం మేఘావృతమై ఉండటంతో పాటు అక్కడక్కడ తేలికపాటి తుంపర్లు పడే అవకాశం మాత్రమే ఉంది. శ్రీహరికోట నుండి ఇచ్ఛాపురం వరకు ఉన్న తీరప్రాంతం అంతా ఈ రోజంతా మేఘావృతమై ఉంటుంది. దక్షిణ కోస్తా ఆంధ్రాలో జనవరి 11 వ తేదీ నుంచి 13 తేదీల మధ్య వర్షాలు కురుస్తాయని అంచనా ఉన్నందున, వర్షం తీవ్రత పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులుతెలిపారు. తీవ్ర వాయుగుండం ఈరోజు మధ్యాహ్నం సమయంలో ఉత్తర శ్రీలంక ట్రింకోమలీ – జాఫ్నా మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందని వెల్లడించింది.




**గత నాలుగు రోజుల నుంచి...**

తెలంగాణలోనూ చలితీవ్రత ఎక్కువగా ఉంది. గత నాలుగు రోజుల నుంచి చలితీవ్రత పెరిగింది. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో తెలంగాణలో వానలు పడకపోయినప్పటికీ చలిగాలుల తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుందని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. చలి తీవ్రత మరో రెండు మూడు రోజులు ఎక్కువగా ఉంటుందని అధికారులు వెల్లడించారు. పొగమంచు కూడా అధికంగానే ఉంటుందని, సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ వెల్లడించింది. అదే సమయంలో చలిగాలుల నుంచి ప్రజలు తమను తాము రక్షించుకుంటేనే వ్యాధులు రావని వైద్యులు కూడా హెచ్చరిస్తున్నారు.

# కత్తి కూడా ఇంతలా కోయదేమో..

## హైదరాబాద్‌లో చైనా మాంజా చుట్టుకుని హాస్పిటల్ పాలైన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి



**హైదరాబాద్ పెన్ పవర్:** చైనా మాంజాపై పోలీసులు ఎన్ని నిర్బంధాలు విధించినా.. వినియోగం మాత్రం ఆగడం లేదు. వ్యాపారులు రహస్యంగా అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటుంటే.. సామాన్యులు అది చేసే గాయాలకు ఆస్పత్రుల పాలవుతూనే ఉన్నారు. ఆదివారం (జనవరి 11) హైదరాబాద్ లో చైనా మాంజా చుట్టుకుని ఓ సాఫ్ట్ వేర్ ఉద్యోగి తీవ్ర గాయాలతో హాస్పిటల్ లో చేరాడు.

గచ్చిబౌలి పోలిస్ స్టేషన్ పరిధిలో చైతన్య (27) అనే సాఫ్ట్ వేర్ ఉద్యోగి తీవ్రంగా గాయపడ్డాడు. గచ్చిబౌలి నుంచి హాఫీజ్‌పేట్ వైపు బైకుపై వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. బోటానికల్ గార్డెన్ ఫ్లైఓవర్ పైకి రాగానే చైతన్య చేయికి తెగిన గాలి పటం మాంజా చుట్టుకుంది. చెయ్యి కోసుకుపోవడంతో తీవ్రంగా రక్తస్రావం జరిగింది.గాయాలతో విలవిలలాడుతున్న చైతన్యను స్థానికులు హస్పటల్ కు తరలించారు. ప్రస్తుతం ఉద్యోగి మాదాపూర్ లోని ప్రైవేట్ హస్పటల్ లో చికిత్స పొందుతున్నాడు. చైనా మాంజా వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని.. గాలిపటం ఎగరేస్తున్న పిల్లల ద్వారా మాంజా అమ్ముతున్న వ్యాపారులను పట్టుకుంటే నిషేధించడం సులువని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

# సంక్రాంతికి వెళ్లే ప్రయాణికులకు పండగ బస్సుల్లోనే కనపడుతుందిగా?

**హైదరాబాద్ పెన్ పవర్:** సంక్రాంతి పండగకు సొంతూళ్లకు వెళ్లే వారి నుంచి ప్రయివేటు ట్రావెల్స్ దోచుకుంటున్నాయి.సంక్రాంతి పండుగ జరుపుకునేందుకు దూర ప్రాంతాల నుంచి సొంత ప్రాంతాలకు అధిక సంఖ్యలో ప్రజలు ప్రయాణించడం వలన ఏర్పడే అధిక డిమాండ్ నేపథ్యంలోప్రైవేట్ బస్సు యజమానులు అధిక ధరలకు టికెట్లను విక్రయిస్తున్నారు. ముందుగానే టిక్కెట్లు రిజర్వు చేసుకున్న వారి నుంచి కూడా అధిక శాతం సొమ్ములు వసూలు చేస్తున్నారు. ప్రయివేటు ట్రావెల్స్ దోపిడీని అరికట్టాల్సిన రెండు రాష్ట్రాల రవాణా శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. మామూళ్ల మత్తులో తేలుతూ ట్రావెల్స్ యజమానులకు సహకరిస్తున్నారు.

**ఆర్టీసీ పెంచిందని...**

ఆర్టీసీ నిర్దేశించిన ధరల కంటే 50శాతం మాత్రమే గరిష్ట ధరగా నిర్ణయించింది. అంత కంటే ఎక్కువ ధరలకు టికెట్స్ అమ్మే ప్రైవేట్ బస్సు యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ నిర్ణయించింది. అయితే ఆచరణలో అది సాధ్యం కావడం లేదు. హైదరాబాద్ నుంచి విజయవాడకు మూడు వేల రూపాయలు వసూలు చేస్తున్నారు. విశాఖపట్నానికి నేడు ఆరు వేల రూపాయలు వసూలు చేస్తున్నారు. అయినా రవాణా శాఖ అధికారులు మాత్రం ట్రావెల్స్ యాజమాన్యంపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

**హెల్ప్ లైన్ నెంబరు....**

ప్రతి ప్రైవేట్ బస్సు లోనూ రవాణా శాఖ హెల్ప్ లైన్ నెంబర్




92816 07001 ను డిస్ప్లే చేయాలని బస్ యజమానులను రవాణాశాఖ ఆదేశించింది. ఈ రోజు నుండి జనవరి 18వరకు అన్ని జిల్లాలో గల రవాణా అధికారులు ప్రైవేట్ బస్సులపై తనిఖీలు చేస్తామని ప్రకటించినప్పటికీ ట్రావెల్స్ బస్సుల యాజమాన్యం దోపిడీకి మాత్రం తెరపడలేదు. పేద, మధ్యతరగతి ప్రయాణికులకు సంక్రాంతి పండగ వేళ ప్రయాణం జేబుకు చిల్లు పడేలా ఉంది. అయితే ఇంత ధరలను పెట్టి కొనుగోలు చేయలేని వారు ఆర్టీసీ, రైళ్లను ఆశ్రయిస్తుండటంతో అవి కిటకిటలాడుతున్నాయి. దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను ప్రవేశపెట్టినప్పటికీ రద్దీ నేడు కూడా కొనసాగే అవకాశముంది.

# ఈ సంక్రాంతికి హైదరాబాద్ జేబీఎస్ నుంచి సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులకు ముఖ్య గమనిక




**హైదరాబాద్ పెన్ పవర్:** సంక్రాంతి పండుగకు సొంతూర్లకు వెళ్లే ప్రజలతో బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు కిటకిటలాడుతున్నాయి. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని జేబీఎస్ బస్టాండ్ నుంచి 550 ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు TGSRTC తెలిపింది. సంక్రాంతి పండుగకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్ వెళ్లే ప్రజల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. తెలంగాణ ఆర్టీసీ సంక్రాంతి పండుగ దృష్ట్యా 6 వేల 431 ప్రత్యేక స్పెషల్ బస్సులను నడుపుతుండటం గమనార్హం.ఈసారి సంక్రాంతికి పండుగ సెలవులు ఎక్కువ రోజులు రావడంతో పట్నం వీడి ప్రజలు పల్లెల బాట పట్టారు. ప్రయాణికుల రద్దీని ముందుగానే అంచనా వేసిన ఆర్టీసీ అధికారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. హైదరాబాద్?లోని జేబీఎస్, ఎంజీబీఎస్, ఉప్పల్, ఎల్బీనగర్, తార్నాక, కూకట్ పల్లి బస్టాండ్?ల నుంచి ప్రత్యేక బస్సులను ఆర్టీసీ నడుపుతోంది. బస్సు ఎక్కేందుకు వచ్చిన ప్రయాణికుల కోసం షెల్టర్ల దగ్గర ప్రత్యేక సౌకర్యాలను ఆర్టీసీ కల్పించింది.

# భర్త పంచె కట్టు నచ్చట్లేదని విడాకులు... బిగ్ ట్విస్ట్ ఏమిటంటే..!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇటీవల కాలంలో విడాకులు తీసుకోవడం చాలా చిన్న విషయంగా మారిపోయిందనే చర్చ నడుస్తున్న సంగతి తెలిసిందే. భార్యాభర్తల మధ్య వచ్చే ప్రతీ చిన్న సమస్యకు విడాకులే పరిష్కారం అనుకునే జనాల సంఖ్య రోజు రోజుకీ పెరిగిపోతుంది! దీనికి కారణం దాంపత్య జీవితం విలువ తెలియకపోవడమా.. లేక, ఆప్షన్స్ ఎక్కువగా ఉండటమా.. అదీగాక, సమస్య నిజంగానే తీవ్రమైనదిగా ఉండటమా అనేది సదరు వ్యక్తికే తెలియాలని అంటుంటారు! పైగా ఇటీవల పలు కేసులో విడాకులకు పలువురు చెబుతున్న కారణాలు.. నవ్వాలో, ఏడవాలో తెలియని స్థితిని కల్పిస్తున్నాయనే కామెంట్లనూ సొంతం చేసుకుంటున్న పరిస్థితి! ఈ సమయంలో తనను చదివించి ఎస్సై ని చేసి, తన లక్ష్యాన్ని సాధించడంలో అన్ని విధాలా సహకరించిన భర్త నుంచి విడాకులు కోరుతోంది భార్య. ఇంతకూ అందుకు ఆమె చెప్పిన కారణం.. భర్త పంచె కట్టుకుంటున్నాడని, తల వెనుక పిలక ఉంచుకున్నాడనట! అవును... భోపాల్ కు చెందిన ఓ యువతి వివాహ సమయంలో తనకు సబ్-ఇనిస్పెక్టర్ కావాలని ఉందని తనకు కాబోయే భర్తకు చెప్పిందంట. దీంతో.. తన కోరిక ఒకటి, భార్య కోరిక మరొకటా అని భావించాడో ఏమో కానీ.. భార్య కోరిక తీర్చాలని కంకణం కట్టుకున్న భర్త ఆమె, తన లక్ష్యాన్ని చేరుకోవడానికి అన్ని విధాలా సహకరించాడు. ఫలితంగా.. ఆమె ఎస్సై అయిపోయింది. కట్ చేస్తే... ఇప్పుడు విడాకులు కావాలని కోర్టు మెట్లెక్కింది! ఈ సందర్భంగా దాఖలు చేసిన పిటిషన్ లో... తన భర్త ధోతీ-కుర్తా ధరిస్తాడని.. అది తనకు ఇష్టం ఉండదని.. అతను పిలక కూడా ఉంచుకుంటాడని.. అది తనకు అస్సలు ఇష్టం ఉండదని.. ఈ విషయాన్ని తాను పదే పదే చెప్పినప్పటికీ అతను ఏమాత్రం వినిపించుకోవడం లేదని.. ఇదే క్రమంలో తన పూజారి విధులను వదులుకోవడానికి నిరాకరిస్తూనే ఉన్నాడని.. ఇది తన హోదాకు అవమానంగా ఉందని.. అందుకే తనకు విడాకులు కావాలని ఆమె పేర్కొంది. ఈ సందర్భంగా స్పందించిన ఫ్యామిలీ కోర్టు న్యాయవాది అయిన పరిహార్.. భార్యాభర్తల మధ్య ఇటువంటి విడాకుల కేసులు తరచుగా వస్తుంటాయని.. కేసు కోర్టుకు వచ్చిన తర్వాత కౌన్సెలింగ్ కూడా అందిస్తుందని.. ఈ క్రమంలో కొన్నిసార్లు దంపతులు అంగీకరించి, అండర్ స్టాండింగ్ కి వస్తారని.. మరికొన్ని సందర్భాల్లో విభేదిస్తారని.. ఈ విషయాన్ని పరిశీలించి న్యాయమూర్తి విడాకుల నిర్ణయం తీసుకుంటారని తెలిపారు! దీనిపైనా భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగా... తన లక్ష్యాన్ని నెరవేర్చుకోవడం కోసం అతను కష్టపడినప్పుడు, సహకరించినప్పుడు ఆ పౌరోహిత్యం, ఆ పంచె, పిలక అడ్డు రాలేదు కానీ.. ఇప్పుడు ఏరు దాటిన తర్వాత తెప్ప తేలేసినట్లు ప్రవర్తించడం సరైంది కాదు అని ఒకరంటే... తన భార్య లక్ష్యాన్ని సాధించడానికి సహకరించిన వ్యక్తి.. మారిన కాలానికి అనుగుణంగా కోరిన ఆమె విన్నపాన్ని మాత్రం ఎందుకు మన్నించకూడదు అని మరికొందరు అభిప్రాయపడుతున్నారు!!

# మదురో కిడ్నాప్ తర్వాత ట్రంప్ మరో దేశానికి వార్నింగ్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్ లో నిరసనలు హోరెత్తుతున్నాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు రోడ్ల మీదకు వస్తున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం వారిని అణచివేసే ప్రయత్నం చేస్తోంది. దీంతో ప్రజల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురవుతోంది. ఇప్పుడు సోషల్ మీడియాలో ఒక వీడియో వైరల్ అవుతోంది. -- మమ్మల్ని చంపడం మీకు ఒక ఆటలా ఉంది. మీరు వేటగాళ్లమని, మేము జంతువులమని అనుకుంటున్నారు. మాకు భయం లేదు. మా గుండెల్లో 47 ఏళ్ల భరించలేని నొప్పి దాగి ఉంది. ఇన్నాళ్లూ మీ క్రూరత్వంతో, అధికార బలంతో మా బాధను అణచివేశారు. ఇక ఇది ఆగదు-- ఓ యువకుడు మాట్లాడిని వీడియో వైరల్ గా మారింది.

**నిరసనలు ఎందుకు ?**

ఇరాన్ కరెన్సీ రియాల్ విలువ భారీగా పడిపోయింది. దీంతో ధరలు విపరీతంగా పెరిగాయి. సామాన్యులు కొని తినలేని స్థితి. ప్రభుత్వం ధరలను అదుపులోకి తీసుకురాలేకపోయింది. దీంతో మొదట వ్యాపారుల్లో మొదలైన ఆందోళనలు దేశవ్యాప్తంగా సామాన్య ప్రజల వరకూ పాకాయి. ఉధృతంగా సాగుతున్నాయి. రియాల్ విలువ పడిపోవడానికి అమెరికా ప్రధాన కారణం. ఇరాన్ పై ఆర్థిక ఆంక్షలు విధించింది. దీంతో పాటు చమురు అమ్మకాలు తగ్గాయి. ఫలితంగా ధరలు అమాంతం పెరిగాయి. సామాన్యులకు తీవ్ర భారంగా మారింది. న్యూక్లియర్ డీల్ లో అమెరికాతో విబేధాలు మొదలైనప్పటి నుంచి రియాల్ విలువ పడిపోవడం మొదలైంది. ఇప్పటికీ కొనసాగుతోంది. వార్షిక ద్రవ్యోల్బణం దాదాపు 40 శాతం ఉంది.

**అమెరికాతో విబేధాలు**

దశాబ్దాల క్రితం అమెరికాకు ఇరాన్ కీలక మిత్రుడు. అమెరికా నుంచి ఆయుధాలు కొనుగోలు చేసేవారు. అదే సమయంలో సోవియట్ యూనియన్ కదలికలు పసిగట్టేందకు ఇరాన్ అమెరికా సీఐఏను అనుమతించేది. కానీ 1979లో షా మహ్మద్ రెజా పాల్వి నాయకత్వానికి వ్యతిరేకంగా భారీ ఆందోళనలు జరిగాయి. దీంతో ఆయన దేశం విడిచాడు. ఆ తర్వాత ఇస్లాం మతగురువు ఆయతుల్లా కేమేని నాయకుడయ్యారు. ఆ తర్వాత యూఎస్ తో సంబంధాలు అంతంతమాత్రమే ఉన్నాయి. న్యూక్లియర్ ప్రోగ్రామ్ విషయంలో ఇరాన్, అమెరికా మధ్య విబేధాలు పెరిగాయి. అప్పటి నుంచి యూఎస్ ఇరాన్ పై ఆంక్షలు విధించింది. ఫలితంగా ఇరాన్ ఆర్థికంగా నష్టపోతూ వచ్చింది.

**నిరసనల వెనుక అమెరికా**

ఇరాన్ నిరసనల వెనుక అమెరికా ఉందన్న వాదన ఉంది. నిరసనకారులపై ఇరాన్ ప్రభుత్వం బలప్రయోగం చేస్తే రంగంలోకి దిగుతామని హెచ్చరించింది. తాము చాలా స్పష్టంగా గమనిస్తున్నామని ట్రంప్ ప్రకటించారు. గతంలోలాగా నిరసనకారులను చంపితే అమెరికా నుంచి గట్టి దెబ్బ ఎదుర్కొంటుందని ఇరాన్ ను హెచ్చరించారు. ఇరాన్ దాడి కొనసాగితే నిరసనకారులను రక్షించేందుకు అమెరికా వస్తుందంటూ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. మదురో నిర్బంధం తర్వాత చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా చర్చనీయాంశమయ్యాయి. మరోవైపు అమెరికా రంగంలోకి దిగితే ఆయతుల్లా ఖేమాని దేశం విడిచి వెళ్లడానికి ఏర్పాట్లు చేసుకున్నారని ప్రచారం జరుగుతోంది.

# టీ రూ.10... విమానాశ్రయానికి వచ్చేసింది.. మల్టీప్లెక్స్ మిగిలుంది!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఒకప్పుడు ఎగువ మధ్యతరగతి ప్రజలు, ధనవంతులు మాత్రమే విమాన ప్రయాణాలు చేసేవారు! దీంతో.. వారిని దృష్టిలో పెట్టుకునో, లేక.. వారు ఈ విషయాన్ని పెద్దగా పరిగణలోకి తీసుకోరనో.. కారణం ఏదైనా, మరేదైనా.. విమానాశ్రయాలంటే ఒకప్పుడు విలాసవంతమైనవిగా పరిగణించబడేవి. అయితే మారుతున్న జీవనశైలి, కాలానికి అనుగుణంగా సామాన్యులు సైతం విమానంలో ప్రయాణించాలని కోరుకుంటున్నారు. ప్రతీదీ సామాన్యుడికి సైతం అందుబాటులోకి వచ్చినప్పుడే అభివృద్ధి వికేంద్రీకరణ జరిగినట్లు అని అంటుంటారు! ఈ క్రమంలో ఎయిర్ పోర్టులోని ఆహార, ఇతర సేవలు సైతం భయాందోళనలు కలిగించకుండా.. భారంగా కాకుండా ఉండేలా తాజాగా హైదరాబాద్ విమానాశ్రయం విషయంలో సైతం ఓ ఆసక్తికర విషయం తెరపైకి వచ్చింది. ఇందులో భాగంగా... ఇకపై రూ.10 కే టీ, రూ.20 కే కాఫీ, అందుబాటు ధరల్లో స్నాక్స్ ఆస్వాదించవచ్చు. అవును...

ఇప్పటికే కోల్ కతా, చెన్నై, అహ్మదాబాద్, ముంబై, పూణె విమానాశ్రయాల్లో అందుబాటులోకి వచ్చిన 'ఉడాన్ యాత్రి కేఫ్ల.. ఎయిర్ పోర్ట్స్ అథరిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) చొరవతో ఇప్పుడు హైదరాబాద్ లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికీ అందుబాటులోకి వచ్చింది. దీంతో.. ప్రయాణికులు ఇకపై రూ.10కి టీ తీసుకోవచ్చు.. వడ పావ్, కాఫీ, సమోసాలు, స్వీట్లు రూ.20కి తినవచ్చు! దీంతో.. ఇది సూపర్ గుడ్ న్యూస్ అంటున్నారు ప్రయాణికులు!

ఈ సందర్భంగా స్పందించిన అధికారులు.. ఇది అన్ని ప్రయాణీకులకు విమాన ప్రయాణాన్ని సరసమైనదిగా, మరింత సౌకర్యవంతంగా చేయడానికి రూపొందించబడిందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో స్పందిస్తున్న నెటిజన్లు... ఈ తరహా కేఫ్ లు నగరంలోని మల్టీ ఫ్లెక్స్ థియేటర్స్ లోనూ రావాలని.. అక్కడ కూడా రూ.10 కి టీ, రూ.20 కి కాఫీ.. రూ.25 కే సమోసా, పాప్ కార్న్, కూల్ డ్రింక్స్ లభించాలని.. ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు!

# సంక్రాంతి పందెం కోడి కి కళ్ళెం...మ్యాటర్ వెరీ సీరియస్



**హైదరాబాద్ పెన్ పవర్:** పందెం కోడి ఎపుడూ దూకుడుగా ఉంటుంది. దానిని ఆపడం ఎవరి తరమూ కాదు, నిజానికి చూస్తే నిబంధనల ప్రకారం పందేలు వేయకూడదు, జూదాలు ఆడరాదు, కానీ పెద్ద పండుగ తెలుగు వారి లోగిలిలో సంక్రాంతి పండుగ అంటేనే కోడి పందేలు చాలా సాధారణం అని చెబుతూ ఉంటారు. అలా చట్టం ఒక వైపు ఉంటే ఉత్సాహం సంప్రదాయం మరో వైపు ఉన్నాయి. దీంతో ప్రతీ ఏటా పండుగ వేళ జూదాలు పందాలు వద్దు అని చట్ట ప్రకారం చెబుతూ వస్తున్నారు. ఆచరణలో ఏ మేరకు అవి అమలు అవుతున్నాయన్నది పెద్ద ప్రశ్నగా ఉంది.

**హైకోర్టు ఉత్తర్వులు :**

ఏపీలో సంక్రాంతి పండుగ వేళ కోడి పందేలు నిర్వహించడం మీద ఏపీ హైకోర్టు తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. పేకాటను కానీ కోడి పందేలను కానీ పూర్తిగా అడ్డుకోవాలని కోరింది. ఎక్కడా వాటి నిర్వహణ అన్నాది ఉండరాదని కూడా పేర్కొంది. ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా గుంటూరు జిల్లాల కలెక్టర్లకు ఈ మేరకు హై కోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ఆదేశిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు..

**పిటిషన్ల మీద విచారణ :**

పండుగ అన్నది ఉత్సాహంగా జరుపుకోవాలని అయితే సంక్రాంతి వేళ కోడి కాళ్ళకు కత్తులు కడుతూ పందేలు నిర్వహించడం ద్వారా జంతు హింస జీవ హింసకు పాల్పడుతున్నారని కొంతమంది హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ రకమైన విధానాన్ని నియంత్రించాలని కోర్తుతూ ఏకంగా 14 పిటిషన్లు కోర్టు ముందుకు వచ్చాయి. వాటిని విచారించే క్రమంలో ధర్మాసనం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. చట్టాలను కఠినంగా అమలు చేయాలని హైకోర్టు జిల్లాల కలెక్టర్లు ఎస్పీలను ఆదేశించింది. అంతే కాదు గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు వాటికి అనుగుణంగా కూడా చర్యలు తీసుకోవాలని కోరింది.

**ప్రజలకు అవగాహన :**

కోడి పందేలు చట్ట విరుద్ధమని జనాలకు అవగాహన కల్పించాలని కూడా హైకోర్టు సూచించింది. గ్రామాలలో ఈ మేరకు ప్రచారం చేయాలని సభలు నిర్వహించి చట్టాల గురించి వారికి వివరించాలని పేర్కొన్నది. గ్రామ సభలు కూడా జరపాలని ఆదేశించింది. ఇక కోడి పందేల కోసం పెద్ద బరులు నిర్వహించి ఆటకు అంతా సిద్ధం చేస్తున్నట్లుగా తెలుస్తున్న క్రమంలో అక్కడ కోడి కత్తులను ఇతరత్రా ఉన్న పందేం సామగ్రిని కూడా స్వాధీనం చేసుకోవాలని అంతే కాదు ఎక్కడైతే కోడి పందేలు ఎక్కువగా జరుగుతాయో అక్కడ అవసరమైన పక్షంలో 144 సెక్షన్ ని విధించాలని కూడా జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది.

**అధికారులదే బాధ్యత :**

ఇక కోడి పందాలు జరిగినా చట్టాలను పరిధి దాటి ఎవరైనా వ్యవహరించినా దానికి అధికారులే బాధ్యత వహించాలని కూడా హైకోర్టు హెచ్చరించడం విశేషం. ఇలా చట్టాలు ఉన్నా వాటిని సక్రమంగా అమలు చేయడంలో తాశీల్దరులు కానీ పోలీసు అధికారులు కానీ వైఫల్యం చెందినట్లు అయితే వారి మీద క్రమశిక్షణ చర్యలు కూడా తీసుకోవచ్చు అని హైకోర్టు పేర్కొనడం విశేషం. ముందుగా గ్రామాలలో అధికారులు పోలీసులు తనిఖీలు చేపట్టాలని ఎక్కడైతే కోడి పందేల కోసం బరులు ఏర్పాట్లు చేస్తున్నారో ఆయా గ్రామాలలో పర్యటించాలని కూడా సూచించింది. ఈ తనిఖీ చేసే బృందాలలో తాశీల్దారు, ఎస్సై ర్యాంక్ కి తగ్గని పోలీసు అధికారి, జంతు సంక్షేమ బోర్డుకి చెందిన ప్రతినిధి తప్పనిసరిగా ఉండాలని పేర్కొంది.

**వెరీ సీరియస్ :**

మొత్తం మీద చూస్తే కోర్టు ఈసారి చాలా సీరియస్ గానే ఉంది అని అంటున్నారు. కోడి పందేలని నియంత్రించాలని కూడా గట్టి పట్టుదలతో అధికారులు పనిచేయలాని కోరుతోంది. మరి ఆ దిశగా అధికారులు సక్సెస్ అవుతారా లేదా అన్నది కొద్ది రోజులలో తెలుస్తుంది. ఏది ఏమైనా కోడి పందేలు అన్నవి సంప్రదాయం అని ఒక వైపు వాదనలు ఉంటే జంతు హింస చట్ట విరుద్ధం అని మరో వైపు అంటున్నారు చట్ట ప్రకారం యాక్షన్ తీసుకోవాలని హైకోర్టు కోరుతున్న క్రమంలో ఏమి జరుగుతుందో చూడాల్సి ఉంది.

# మున్సిపోల్ పై జనసేన చూపు.. ఆ పార్టీల గతేంటి?

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాజకీయ క్షేత్రం ఇప్పుడు ఒక ఆసక్తికరమైన మలుపు తిరగబోతోంది. ఇప్పటి వరకు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల మధ్యే ప్రధాన పోరు ఉంటుందని భావించిన రాజకీయ విశ్లేషకులకు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఊహించని షాక్ ఇచ్చారు. ఏపీలో సృష్టించిన ప్రభంజనాన్ని తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లోనూ పునరావృతం చేసేందుకు 'సేన' సిద్ధమైంది. కేవలం పొత్తులకే పరిమితం కాకుండా, ఒంటరి పోరుకు సై అనడం ద్వారా పవన్ కళ్యాణ్ తెలంగాణ కోటలో తనదైన ముద్ర వేసేందుకు సిద్ధమవ్వడం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది.

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నగారా కొన్ని రోజుల్లో మోగబోతోంది. ఇప్పటికే రాజకీయ వేడి పీక్ స్టేజ్కు చేరుకుంది. ఫిబ్రవరి, మార్చిలో జరగనున్న ఈ ఎన్నికలు ప్రధాన పార్టీలకు జీవన్మరణ సమస్యగా మారిన తరుణంలో, జనసేనాని పవన్ కళ్యాణ్ తీసుకున్న నిర్ణయం అన్ని పార్టీల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. ఆంధ్రప్రదేశ్లో తిరుగులేని విజయం సాధించి, పాలనలో తనదైన శైలిని చూపిస్తున్న పవన్, ఇప్పుడు తన దృష్టిని తెలంగాణ వైపు మళ్లించారు.

**సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా**

గతంలో బీజేపీతో పొత్తులో భాగంగా కొన్ని స్థానాలకే పరిమితమైన జనసేన, ఈసారి రూట్ మార్చింది. క్షేత్రస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా 'ఒంటరి పోరు'కు సిద్ధమైంది. ఇప్పటికే జనవరి 10న వెలువడిన అధికారిక ప్రకటనతో జనసైనికుల్లో కొత్త ఉత్సాహం నిండింది. బూత్ స్థాయి కమిటీల ఏర్పాటు, గ్రామ స్థాయి వరకు పార్టీ జెండాను తీసుకెళ్లడం ద్వారా తెలంగాణలో మూడో ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు పవన్ వ్యూహరచన చేస్తున్నారు.

**టెన్షన్లో ప్రధాన పార్టీలు..**

జనసేన ఎంట్రీ ఇప్పుడు తెలంగాణలోని త్రిముఖ పోరును చతుర్ముఖ పోరుగా మార్చివేయబోతోంది. అయితే, ఈ చీలిక ఓట్లు ఏ పార్టీని దెబ్బతీస్తాయనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. కాంగ్రెస్, బీఆర్ఎస్ లను పరిశీలిస్తే పట్టణ ప్రాంతాల్లో యువత, నిరుద్యోగుల మద్దతు జనసేన వైపు మళ్లితే, ఈ రెండు పార్టీల ఓటు బ్యాంకుకు గండి పడే అవకాశం ఉంది. బీజేపీ నుంచి చూసుకుంటే గతంలో మిత్రపక్షంగా ఉన్న జనసేన ఇప్పుడు విడిగా పోటీ చేయడం వల్ల, ఉమ్మడి ఓట్లు చీలి బీజేపీకి ఇబ్బందికరంగా మారే ప్రమాదం ఉంది.

**రాజకీయ సమీకరణాల మార్పు..**

మున్సిపల్ ఎన్నికలు పార్టీ గుర్తుపై జరుగుతాయి కాబట్టి, ఇది జనసేనకు తన బలాన్ని నిరూపించుకోవడానికి ఒక అద్భుతమైన అవకాశం. పవన్ కళ్యాణ్ కేవలం ఒక గ్లామర్ స్టార్గానే కాకుండా, బాధ్యతాయుతమైన నాయకుడిగా ఏపీలో సంపాదించుకున్న గుర్తింపు తెలంగాణ ఓటర్లపై, ముఖ్యంగా సెటిలర్స్, యువతపై భారీ ప్రభావం చూపే అవకాశం ఉంది.

పవన్ కళ్యాణ్ వేస్తున్న ఈ అడుగు కేవలం మున్సిపల్ ఎన్నికలకే పరిమితం కాదు.., ఇది భవిష్యత్తు తెలంగాణ రాజకీయాల్లో జనసేన స్థానాన్ని సుస్థిరం చేసే దీర్ఘకాలిక వ్యూహం. ప్రధాన పార్టీల వ్యూహాలను చిత్తు చేస్తూ, పవన్ కళ్యాణ్ సృష్టించబోయే ఈ 'ఇంపాక్ట' తెలంగాణ రాజకీయ ముఖచిత్రాన్ని ఏ విధంగా మారుస్తుందో వేచి చూడాలి.

# నదుల పక్కన ఉన్న నగరాల్లో భూమి కుంగుతోంది !

**హైదరాబాద్ పెన్ పవర్:** భూమి కుంగిపోతోంది. భవిష్యత్ ప్రమాదంలోకి నెట్టబడుతోంది. ప్రపంచ వ్యాప్తంగా ఈ పరిస్థితి కనిపిస్తోంది. అందుకు భారతదేశం మినహాయింపు కాదు. మన దేశంలోనూ చెన్నై, కోల్ కత, అహ్మదాబాద్ నగరాల్లో భూమి రానురాను కుంగుతోంది. ఫలితంగా వరద ముంపునకు గురయ్యే ప్రమాద తీవ్రత పెరుగుతోంది. అది కూడా నదులు, సముద్రం పక్కనే ఉన్న నగరాల్లో ఈ తీవ్రత ఎక్కువగా ఉంది. దీనికి కారణాలు ఒక్కో దేశంలో ఒక్కోలా ఉన్నప్పటికీ ... దాని దుష్ప్రభావం మాత్రం ఒక విధంగా ఉంది. భవిష్యత్ తరాలకు పెను సవాల్ విసురుతోంది. ఇప్పుడు మేల్కొకపోతే ప్రమాదం తప్పదని హెచ్చరిస్తోంది.



దేశంలో నగర జనాభా పెరిగింది. భూగర్భజలాల వాడకం పెరిగింది. అదే సమయంలో వర్షం సరిగా కురవడం లేదు. ఫలితంగా భూమిలోపలి నీరు మొత్తం తోడేస్తున్నాం. ఆ నీరు మొత్తం తోడేయడంతో భూమి మధ్య పొరల్లో ఖాళీ ఏర్పడుతుంది. అదే సమయంలో భారీస్థాయి నిర్మాణాలతో భూమిపై ఒత్తిడి పెంచుతున్నాం. ఆ ఒత్తిడి కారణంగా భూమిలోని ఖాళీ పొరలు కుచించుకపోతున్నాయి. సముద్ర మట్టానికి కంటే ఎత్తులో ఉండాల్సిన నగరాలు.. కిందకు వెళ్తున్నాయి. వర్షాలు కురిస్తే ఆ వర్షం మొత్తం నగరాల్లోకి వస్తోంది. వరదలను నియంత్రించలేకపోతున్నాం.

### ప్రమాదం అంచున నగరాలు

కోల్ కతాలో ప్రతి ఏటా 2.8 సెంటీమీటర్ల భూమి కుంగుతోంది. ఇది రానురాను మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని నిపుణలు హెచ్చరిస్తున్నారు. దీనికి కారణంగా భారీగా భూగర్బజలాలు తోడటం, అదే సమయంలో పెద్ద ఎత్తున నగరీకరణ జరగడం. వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు తరుచూ వరద ప్రభావానికి గురవుతున్నాయి.

చెన్నై నగరంలో కూడా ప్రతి ఏటా భూమి కుంగిపోతోంది. ఇది చిన్నగా కనిపించినప్పటికీ రానురాను మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. కోల్ కతా కంటే వేగంగా ఇక్కడ భూమి కుంగుతోందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అహ్మదాబాద్ లో ఇది మరింత ఎక్కువగా ఉంది. ప్రతి ఏటా నాలుగు సెంటీమీటర్ల భూమి కుంగుతోంది. ఇది అహ్మదాబాద్ ను భవిష్యత్తులో మరింత ప్రమాదంలోకి నెట్టేస్తోంది. సమర్థవంతమైన నీటి వనరుల నిర్వహణ లేకుంగా వేగంగా నగరం అభివృద్ధి చెందడం ప్రధాన కారణంగా నిలుస్తోంది.

### నదులున్న .. రాష్ట్రంలోనే ఎందుకు ?

కోల్ కతా, అహ్మదాబాద్, చైన్నై.. ఇవి ఆయా రాష్ట్రాలకు రాజధానులు. వీటి పక్కనో, మధ్యలోనే నదులు, సుముద్రాలు ఉన్నాయి. అయినా భూగర్భజలాలు రీచార్జ్ అవ్వలేదు. ఇదొక ఆశ్చర్యం. మరోవైపు భూమి కుంగితే నదీ మట్టమో.. సముద్ర మట్టమో పైకి వెళ్తుంది. వరదలు రావడానికి ఎక్కువ అవకాశం ఉంటుంది. వరదలు తరుచూ వస్తే నియంత్రణ కష్టం అవుతుంది. అలాగే పాత భవనాలు డ్యామేజీ అవుతాయి. వాటిని రిపేర్ చేయించాలంటే మరింత భారం అవుతుంది. భవిష్యత్తే ప్రమాదంలో పడుతుంది.

### ఏం చేయాలి ?

భూమి కుంగడం కొనసాగితే రోజువారీ జీవితాలు ప్రమాదంలో పడతాయి. దీర్ఘకాలంలో ప్రజల జీవనంపైన తీవ్ర ప్రభావం చూపుతుంది. భద్రత లేకుండా పోతుంది. వరదలను నియంత్రిచలేము. కాబట్టి నదీ పరివాహక ప్రాంతాల్లో నిర్మాణాలు జరగకుండా చూడాలి. నదీ పరివాహక ప్రాంతాలు, సముద్ర తీరాలను రక్షించాలి. చెట్ల పెంపకంపైన అవగాహన తీసుకురావాలి. సమర్థవంతమైన నీటి నిర్వహణ పద్దతులు ఉండాలి. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నగర నిర్మాణాలు ఉండాలి.

# ప్రపంచంలోనే క్రూరుడు నెతన్యాహు..
# అరెస్టుకు పాక్ డిమాండ్




**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్థాన్ రక్షణ శాఖా మంత్రి ఖ్వాజా అసిఫ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అమెరికా మదురోను కిడ్నాప్ చేసినట్టే.. ఇజ్రాయిల్ అధ్యక్షుడు బెంజిమిన్ నెతన్యాహును కిడ్నాప్ చేయాలని కోరారు. చరిత్రలో గాజాలో పాలస్తీనా ప్రజలపై జరిగినన్ని దురాగతాలు ఎక్కడా జరగలేదని వ్యాఖ్యానించారు. 4 వేల- 5వేల సంవత్సర కాలంలో ఏ సమాజమూ ఇజ్రాయిల్ చేసినన్ని దురాగతాలు చేయలేదన్నారు. ప్రపంచంలో ఇంత కంటే పెద్ద నేరస్థున్ని చూడలేదని ఖ్వాజా ఆసిఫ్ వ్యాఖ్యానించారు. మానవత్వానికి నెతన్యాహు ఓ పెద్ద నేరస్థుడని అభివర్ణించారు. కానీ ప్రపంచం మాత్రం నెతన్యాహును నేరస్థుడిగా చూడటంలేదన్నారు. టర్కీ కూడా నెతన్యాహును కిడ్నాప్ చేయాలని పాకిస్థాన్ పౌరులు ప్రార్థిస్తున్నట్టు ఖ్వాజా ఆసిఫ్ పేర్కొన్నారు.

### నెతన్యాహుపై కోపం ఎందుకు ?

పాకిస్థాన్ మొదటి నుంచి పాలస్తీనా వైపు నిలబడుతోంది. గాజాలో ఇజ్రాయిల్ దురాగతాలకు వ్యతిరేకంగా నిలబడింది. ఇజ్రాయిల్ కు వ్యతిరేకంగా ఉన్న దేశాలతో సత్సంబంధాలు కొనసాగిస్తోంది. పాలస్తీనకు మద్దతుగా నిలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఖ్వాజా ఆసిఫ్ ఈ వ్యాఖ్యలు చేసి ఉంటారు. ఈ వ్యాఖ్యలు ప్రపంచ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారాయి.

### ట్రంప్ ను కోరడమంటే ?

మదురోలాగా నెతన్యాహును కిడ్నాప్ చేయమని కోరడమంటే.. పాకిస్థాన్ వెనుజులా అధ్యక్షుడి కిడ్నాప్ ను సమర్థించినట్టే. పాకిస్థాన్ వైఖరి అమెరికాకు అనుకూలంగా ఉన్నట్టే. అదే సమయంలో నెతన్యాహుకు అండదండగా ఉన్న ట్రంప్ ను ఇలాంటి కోరిక కోరడం.. పాకిస్థాన్ అమాయకత్వానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఎందుకంటే ఇజ్రాయిల్ వెనుక ఉన్నది అమెరికానే. అమెరికా అండ లేకుండా పాలస్థీనాపై ఇన్ని దాడులు చేస్తుందా ?. ఇన్నేళ్లుగా యుద్ధాన్ని కొనసాగిస్తుందా ? అన్నది అసలు ప్రశ్న. ఇదంతా తెలియనట్టు పాకిస్థాన్ రక్షణ మంత్రి మాట్లాడటం హాస్యాస్పదం. పాక్ మంత్రి వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో ట్రోలింగ్ జరుగుతోంది. ఖ్వాజా ఆసిఫ్ ప్రకటన అమాయకత్వంగా ఉందని ఓ నెటిజన్ కామెంట్ చేశారు. ఇదే ప్రభుత్వం ట్రంప్ ను నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ చేసిందని, ఇప్పుడు మానవత్వాన్ని నిలబెట్టే స్వతంత్ర జడ్జిగా అమెరికాను ఉండమని కోరుతూ, నెతన్యాహును కిడ్నాప్ చేయమని కోరుతోందంటూ ట్వీట్ చేశారు.

### అమెరికాకు పాపం అంటదా ?

ఇజ్రాయిల్ పాలస్తీనా ప్రజలపై దారుణాలు చేసిందని చెబుతున్న పాకిస్థాన్.. ఆ పాపం అమెరికా అండ లేకుండా చేసిందా అన్న ప్రశ్న వేసుకోవాలి. ఆ పాపంలో అమెరికాకు భాగస్వామ్యం లేదా ?. ఇది పాకిస్థాన్ కు తెలియదా ?. ఇది ద్వంద్వ దౌత్యనీతి కాదా ?. ఇజ్రాయిల్ ప్రతి పాపంలోనూ అమెరికాదే శీఘ్ర భాగం. పాలస్తీనా, గాజా సమస్య ఇంత కాలం ఉందంటే అది అమెరికా మద్దతుతోనే. అమెరికా తోలుబొమ్మే నెతన్యాహు. తోలుబొమ్మను కిడ్నాప్ చేయమని ఆడించే వాడిని కోరడమంటే ఇంతకంటే దౌర్భాగ్యం ఇంకొకటి ఉంటుదా ?.

# నోబెల్ కావాలా ట్రంపు నాయనా....

**హైదరాబాద్ పెన్ పవర్:** చదివేదేమో రామాయణము...సంసారంలో రావణయుద్ధం.. .అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మనస్థితికి ఈ వాక్యాలు సరిగ్గా సరిపోతాయి. తనకు నోబెల్ పురస్కారం ఆరునూరైనా కావల్సిందే...అదీ శాంతిదూతగా పురస్కారం అందుకోవాలని అతగాడి ఆకాంక్ష. అందుకు ట్రంప్ చెప్పే లెక్కలు చాలానే ఉన్నాయి. తాను కనీసం అరడజను పైగా యుద్ధాలను ఆపించానని, లేకుంటే ప్రపంచం దద్దరిల్లిపోయేదని వాదిస్తాడు. ఇండియా పాకిస్తాన్ యుద్ధం ఆగిందంటే అది కేవలం తన పుణ్యమే అని ప్రకటిస్తాడు. చూస్తుండండి రష్యా ఉక్రెయిన్ యుద్ధం కూడా ముగిసిపోయేలా చేస్తానని అంటాడు. అంతవరకు బాగానే ఉంది. కానీ నిజంగా అమెరికా అధ్యక్షుల వారికి యుద్ధాల వద్దనే ఉందా? ఇపుడు ఇదో మిలియన్ డాలర్ల ప్రశ్న. కారణం వెరీ సింపుల్ ఓ వైపు వెనిజులా అధ్యక్షుణ్ని అమానవీయంగా నిర్బంధించి బేడీలు వేయించి మరీ తరలిస్తాడు...డెన్మార్క్ పై గురిపెట్టి గ్రీన్ ల్యాండ్ ఇస్తావా చస్తావా అని హూంకరిస్తాడు. కేవలం రష్యాతో చమురు కొంటోందని ఇండియాపై ఇష్టారీతిగా ప్రతీకార సుంకాలు విధిస్తాడు. మరి ఈ ధోరణిని ఏమనాలి అని పలువురు ప్రశ్నిస్తున్నారు.



ఎవరు ఎన్నివిధాలుగా విమర్శించినా...ట్రంప్ మహాశయుడి మనసులో మాత్రం నోబెల్ అదీ శాంతిదూతగా తనకు దక్కాలని ప్రగాఢంగా ఆకాంక్షిస్తున్నాడు. పాకిస్తాన్ ఎలాగూ బేషరతుగా తన మద్దతు ప్రకటిస్తోంది. మరి దానికి మరో దారి లేదు...ఆ విషయం కూడా మనం గమనించుకోవాలి. మరి ట్రంప్ మనస్థితి ఎలా ఉంటోంది? నోబెల్ తనకు దక్కేలా ఏం చేస్తే బాగుంటుంది? పలు పలు సందేహాలు, ప్రశ్నలు మనసులో కందిరీగల్లా ముసురుతునే ఉంటాయి. పైగా మన ట్రంపు చాలా గ్రేటు ఏదీ మనసులో దాచుకోడు. అది సంతోషమైనా సరే..కష్టమైనా సరే. అందుకే పలు సందర్భాల్లో తనకు నోబెల్ పురస్కారం ఇవ్వడం ఆ కమిటీ చేసుకున్న పూర్వజన్మ పుణ్యమే. మరి కమిటీ సభ్యులు ఎందుకు మీనమేషాలు లెక్కెడెతున్నారో నాకర్థం కావడం లేదని మీడియా ముఖంగా కస్సు బుస్సు అంటున్నాడు.తాజాగా వెనిజులాను గుప్పెట్లో పెట్టుకోడానికి విశ్వప్రయత్నాలు చేస్తూ...అక్కడ నిక్షేపంలా ఉన్న చమురు నిక్షేపాలపై కన్నువేసినా...పైకి మాత్రం అధ్యక్షుడు నికొలస్ మధురో మాదకద్రవ్యాలను యూఎస్ కు తరలించే మాఫియాతో చేతులు కలపినందుకే అతగాడిని నిర్బంధించినట్లు ఉదారంగా ప్రకటించాడు. అయితే కామెడీ ఏంటంటే..ట్రంప్ ఏ నోబెల్ శాంతి పురస్కారం నాక్కాకపోతే ఇంకెరికి వస్తుందని పురస్కార ప్రకటన ముందు దర్పాన్ని ప్రదర్శించాడో ...సరిగ్గా ఆ పురస్కారం వెనిజులా ప్రతిపక్షనేత మచాడో కు దక్కింది. మరి రక్తం మరిగిపోదాండీ....అందుకే ఏకంగా నోబెల్ పురస్కార కమిటీ తీరుతెన్నులపైనే వైరాగ్యం...నైరాశ్యం...అక్కసు కలబోసిన కామెంట్లు చేసి ఇక చేసేదేమీ లేక గమ్మునుండిపోయాడు.

ట్రంప్ నోబెల్ పురస్కారం గురించి ఇంతగా కలవరించడానికి, పలవరించడానికి అతని అనుచరగణాల పాత్ర కూడా చాలానే ఉంది. అనునిత్యం అతని పక్కన భజనబృందంలా డోలు, చిటికెలు వాయిస్తూ తవరు గొప్పవారు...తమంతటి వారికి ఆ పురస్కారం ఇవ్వడమంటే వారే దాని గౌరవాన్ని పెంచినట్లు. తమరు బేపికరుగా ఉండండి పురస్కారం పరిగెత్తుకుంటూ వచ్చి మీ ముందు నిలుచుని సలాం కొడుతుంది అని ఊబ్బించేసుంటారు కామోసు. అందుకే ఆరునూరైనా నూరు ఆరైనా సరే తనకు నోబెల్ రావల్సిందే అని మంకు పట్టు పట్టాడు. మరి ఆ పురస్కారం దక్కలేదు సరికదా దరిదాపుల్లో కూడా అవకాశాలు లేకుండా పోయాయి. ఈ సమయంలోనే చాలా మంది సంధిస్తున్న ప్రశ్నలు చాలానే ఉన్నాయి...అసలు ట్రంప్ కు నోబెల్ ఎందుకివ్వాలి? వెనిజులా అధ్యక్షుణ్ని నిర్బంధించినందుకా? ఇండియా తదితర దేశాలపై ఇష్టారీతిగా ప్రతీకార సుంకాలను విధించినందుకా? హెచ్1బీ వీసాలను కుప్పుస్వామి మేడ్ డిఫికల్ట్ లా మార్చేసి అగ్ర రాజ్యానికి మేధా వలస జరగకుండా అడ్డుగోడగా నిలిచినందుకా? అరాచకంగా డాలర్లు గుప్పించయినా సరే గ్రీన్ ల్యాండ్ ను సొంతం చేసుకుంటానని డెన్మార్క్ తో తొడగొట్టినందుకా? ఎందుకివ్వాలి అంటున్నారు.ఇదంతా ఓ పక్క కలకలం రేపుతుంటే మరో పక్క పుండుమీద కారం చెల్లినట్లు వెనిజులా ప్రతిపక్షనేత మచాడో తనకు దక్కిన నోబెల్ పురస్కారాన్ని కావాలంటే ట్రంప్ కు ఇచ్చేస్తానని అంటుండటం. అసలు ఏంటీ మచాడో అరాచకం. వేళాకోళానికైనా వేళాపాళా ఉండొద్దా? చెట్టంత మనిషి ట్రంప్ పాపం శాంతి నోబెల్ రాలేదే అని మదనపడుతుంటే... వెక్కిరించినట్లు నాకిచ్చారుగా నీకిచ్చేయినా అనడం ఎంతవరకు సబబు? ట్రంప్ మనోభావాలు ఘోరంగా దెబ్బతినవా ఏంటి? ఏది ఏమైనా వచ్చేసారి అయినా మన శాంతి దూత ట్రంపన్నయ్యకు నోబెల్ పురస్కారం ఇవ్వాల్సిందే... అప్పుడు కూడా తప్పించారో...మీ శిరసు వేయి ప్రక్కలవుగాక....అంటున్నారు అభిమానులు.

# రాజకీయ వారసత్వం మీద వెంకయ్య సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్ పెన్ పవర్:** ముప్పవరపు వెంకయ్యానాయుడు పూర్వ ఉప రాష్ట్రపతి, దాని కంటే ముందు దేశంలో కేంద్ర మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వహించారు. బీజేపీకి జాతీయ అధ్యక్షుడిగా చేశారు. ఉమ్మడి ఏపీకి కూడా రాష్ట్ర అధ్యక్షుడిగా చేశారు. ఎంపీగా అనేక సార్లు తెలిచారు. నెల్లూరు జిల్లా ఉదయగిరి నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఉమ్మడి ఏపీ అసెంబ్లీలో కీలక ప్రతిపక్ష నాయకుడిగా పాత్ర పోషించారు. మరి సుదీర్ఘమైన రాజకీయ ప్రస్థానం కలిగిన వెంకయ్యానాయుడు తన రాజకీయ వారసులను ఎందుకు ఈ రంగంలోకి తీసుకుని రాలేదు అన్న సందేహాలు అయిా అందరిలోనూ ఎపుడూ ఉన్నాయి. కానీ దానికి జవాబు అయితే స్పష్టంగా వారి కుటుంబం నుంచి రాలేదు.

### ఇష్టం లేనందువల్లనే :

దానికి సరైన సమాధానాన్ని వెంకయ్యానాయుడు చెప్పి క్లారిటీ ఇచ్చారు. రాజకీయాల్లో వారసత్వాన్ని ప్రోత్సహించడం తనకు ఇష్టం లేదని ఆయన చెప్పారు. హైదరాబాద్ లోని ముచ్చింతల్ లో స్వర్ణ భారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న వెంకయ్య నాయుడు తన కుమారుడు, కుమార్తెని రాజకీయాలలోకి తీసుకుని రావడం పట్ల తనకు ఆసక్తి లేదని అన్నారు. వారసులకు ఇవ్వాల్సింది సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలన్న బాధ్యత మాత్రమే అని ఆయన గుర్తు చేశారు. అదే అసలైన సంపద అని అన్నారు. తన పిల్లలకు వారసత్వంగా స్వర్ణ భారత్ ట్రస్ట్ ని మాత్రమే ఇచ్చాను అని ఆయన వెల్లడించడం విశేషం.

### సేవను కొనసాగించాలని :

ఇక స్వర్ణ భారత్ ట్రస్ట్ ద్వారా సేవను కొనసాగించాలని తన కుమార్తెకు చెప్పానని వెంకయ్యానాయుడు తెలిపారు. సేవ ద్వారానే ఎవరైనా మంచి పేరు తెచ్చుకుంటారని అందుకే ఆ రంగంలోనే తన వారసులు కొనసాగుతున్నారని వెంకయ్యానాయుడు చెప్పడం గమనార్హం. ఇక మన పండుగలు మన విశిష్టత భావి తరాలకు తెలియచేయాలని వెంకయ్యానాయుడు కోరారు.

### ఎన్ని మారినా మూలాలు ఒక్కటే :

గతంతో పోలిస్తే వాతావరణంలో మార్పులు పెద్ద ఎత్తున వస్తున్నాయని వెంకయ్యానాయుడు అన్నారు. రుతువులు కూడా మారుతున్నాయని అన్నారు. అయితే ఎన్ని మారినా భారతీయ మూలాలు గుర్తు చేసుకుంటూనే ఉండాలని ఆయన హితవు పలికారు. మనదైన సంప్రదాయాలను ఎవరూ మరచిపోకూడదని ఆయన అన్నారు.

### ఏపీకి మరో హైదరాబాద్ :

హైదరాబాద్ బ్రహ్మాండమైన నగరం అని వెంకయ్యానాయుడు అన్నారు. అలాంటి నగరం ఏపీకి కూడా చాలా అవసరం అని ఆయన చెప్పారు. అయితే అమరావతిని కూడా ఆ దిశగా కేంద్రం సహకారంతో ఏపీ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందన్న నమ్మకం అయితే తనకు ఉందని వెంకయ్యానాయుడు అన్నారు. ఏపీ సైతం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు.

# గంటకు 5,800 పై చిలుకు వాహనాలు.. భాగ్యనగరం ఖాళీ అవుతోందా..!



**హైదరాబాద్ పెన్ పవర్:** సంక్రాంతి పండుగ వచ్చిందంటే.. భాగ్యనగరం బోసిపోతుందనే సంగతి తెలిసిందే. రోడ్లన్నీ గంటల వ్యవధిలో ఖాళీ అయిపోతాయి. వాహనాలన్నీ ఆంధ్రా వైపు పరుగులు తీస్తుంటాయి. ఎంత తొందరగా ఊరు చేరిపోదామా.. మరెంత తొందరగా సంబరాల్లో మునిగిపోదామా అనే ఆతృతలోనే అందరి మనసులూ ఉంటాయి. ఈ క్రమంలో హైదరాబాద్ టు విజయవాడం హైవే వాహనాలతో కిక్కిరిసిపోతుంది. ఈ నేపథ్యంలో తాజాగా సరికొత్త స్థాయిలో రికార్డ్ నమోదైందని చెబుతున్నారు.అవును... సంక్రాంతి పండగ వచ్చిందంటే హైదరాబాద్ నగరవాసులు అంతా సొంతూళ్ల బాట పడతారన్న సంగతి తెలిసిందే. దీంతో.. హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై కనిపిస్తున్న కార్లు, ద్విచక్రవాహనాలు, బస్సులను చూస్తుంటే.. భాగ్యనగరం ఖాళీ అవుతోందా అన్నట్టుగా ఉందని చెప్పినా అతిశయోక్తి కాదేమో. ఈ క్రమంలో.. శుక్రవారం సాయంత్రం నుంచి గంట గంటకూ వేల సంఖ్యలో వాహనాలు హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై కదులుతున్నాయి.ఈ క్రమంలో.. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పరిధిలోని పంతంగి టోల్ ప్లాజా వద్ద వాహనాల రద్దీ భారీగా కనిపించింది. ఇందులో భాగంగా.. శుక్రవారం రాత్రి 12 గంటల నుంచి శనివారం ఉదయం 8 గంటల వరకు సుమారు 21,000 వాహనాలు ప్రయాణించగా... శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆ సంఖ్య 22,000 కు చేరుకుందని పంతంగి టోల్ ప్లాజా సిబ్బంది చెప్పిన పరిస్థితి. ఈ నెంబర్ శనివారం సాయంత్రం టు ఆదివారం ఉదయానికి పీక్స్ కి చేరిందని అంటున్నారు.ఇందులో భాగంగా.. పంతంగి టోల్ ప్లాజా వద్ద శనివారం సాయంత్రం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు.. అంటే 12 గంటల వ్యవధిలో దాదాపు 70,000 వాహనాలు ఆంధ్ర ఏపీ వైపు వెళ్లినట్లు టోల్ సిబ్బంది వెల్లడించారు! అంటే.. గంటకు దాదాపు 5,800 పై చిలుకు వాహనాలు అన్నమాట! ఈ రేంజ్ తాకిడిని తట్టుకునేందుకు అదనపు టోల్ బూత్ లను అందుబాటులోకి తెచ్చి, ఫాస్టాగ్ స్కాన్ వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు.ఈ నేపథ్యంలోనే.. రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ స్టేట్ ఆర్టీసీ దాదాపు 6,431 ప్రత్యేక బస్సులను నడుపుతుండగా.. ఏపీ స్టేట్ ఆర్టీసీ కూడా 600 కు పైగా బస్సులను అందుబాటులోకి తెచ్చింది. మరోవైపు టూవీలర్ అయినా, ఫోర్ వీలర్ అయినా.. అతివేగంగా ప్రయాణించవద్దని.. కాస్త సమయమనంతో వాహనాలు నడపాలని.. పండుగను ఆనందంగా జరుపుకోవాలని సూచిస్తున్నారు!

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# సజ్జలతో బూరెలు.. లడ్డూలు.. జస్ట్ 20 నిమిషాల్లో రడీ.. తయారీ విధానం ఇదే..!




**హైదరాబాద్ పెన్ పవర్:** సంక్రాంతి పండుగంటే చాలు ప్రపంచంలో ఎక్కడ ఉన్నా... కుటుంబసభ్యులు .. దగ్గరి బంధువులందరూ కలిసి ఒక్కచోట చేరి సంబరాలు చేసుకుంటారు. ఇలా అందరూ ఒకే చోట చేరినప్పుడు ఇంట్లో అమ్మమ్మలు.. బామ్మలు వెరైటీ వంటకాలు ట్రై చేస్తారు. హెల్దీగా రుచిగా ఉండే సజ్జలతో బూరెలు.. లడ్డూలను ఎలా తయారు చేయాలో ఈ స్టోరీలో తెలుసుకుందాం. . .!

**సజ్జల బూరెలు తయారీకి కావలసినవి**

**సజ్జలు – ఒక కిలో**

**బెల్లం తురుము – అరకిలో**

నువ్వులు– పావు కప్పు
ఇలాచీ పొడి– అర టీ స్పూన్
ఎండు కొబ్బరి పొడి– పావు కప్పు
సాబుదానా (సగ్గుబియ్యం) –ఒక టేబుల్ స్పూన్
ఉప్పు– తగినంత
నెయ్యి లేదా నూనె – సరిపడా

**సజ్జల బూరెలు తయారీ విధానం**

సజ్జలు, సాబుదానా కలిపి మెత్తగా పిండి పట్టాలి. బెల్లం తురుమును నీళ్లలో కొద్ది సేపు నానబెట్టాలి తర్వాత సజ్జ పిండిలో ఈ బెల్లం నీళ్లు పోసి ఉండలు కట్టకుండా కలపాలి. తరువాత దాంట్లో ఎండు కొబ్బరిపొడి, దోరగా వేయించిన నువ్వులు ఇలాచీ పొడి వేసి బాగా కలపాలి. ఆపైన పిండిని చిన్నచిన్న ఉండలుగా చేయాలి. వాటిని చేతుల్లోకి తీసుకుని బూరెలుగా వత్తాలి తర్వాత స్టవ్వైన్లో నెయ్యి వేసి లేదా నూనె వేడి చేయాలి.

ఒకేసారి రెండు, మూడు బూరెలను డీప్ ఫ్రై చేసుకుంటే సరి పండుగ పూట సజ్జ బూరెలు తింటే స్పెషల్ గా ఉంటుంది

**సజ్జ లడ్డూ తయారీకి కావలసినవి**

సజ్జపిండి– రెండు కప్పులు
బెల్లం తురుము– ఒకటిన్నర కప్పు
ఎండు కొబ్బరి తురుము – అర కప్పు
ఇలాచీ పొడి – అర టీస్పూన్
నెయ్యి సరిపడా

**సజ్జ లడ్డూ తయారీ విధానం**

సజ్జ పిండిని నెయ్యిలో దోరగా వేగించాలి. ఒక పెద్ద గిన్నెలో పిండి, బెల్లం తురుము, ఎండు కొబ్బర్ తురుము, ఇలాచీ పొడి వేసి బాగా కలపాలి.

తర్వాత వేడిగా ఉన్న నెయ్యిని పిండిలో వేసి బాగా కలపాలి. కావాలంటే కొన్ని గోరువెచ్చని పాలు కూడా పోసుకోవచ్చు.

చివరగా పిండి ముద్దని చేతుల్లోకి తీసుకుని లడ్డూలు కట్టాలి. వీటిని నాలుగు గంటలు అరబెట్టి, తర్వాత గాలి దూరని డబ్బాలో నిల్వ చేసుకుంటే తాజాగా ఉంటాయి.. ఇవండీ సంక్రాంతి స్పెషల్స్?

# సంక్రాంతి పండుగ.. గంగిరెద్దుల విన్యాసాలు.. హరిదాసుల రూపంలో విష్ణుమూర్తి ఆశీర్వాదాలు..



**హైదరాబాద్ పెన్ పవర్:** కొత్త సంవత్సరంలో హిందువులు జరుపుకొనే ఫస్ట్ పండుగ.. పెద్ద పండుగ.. సంక్రాంతి పండుగ. ఇది జానపదుల పండుగ, కష్టపడి పండించిన పంటలు ఇళ్లకు చేరే సమయంలో చేసుకునే సంబురం. అన్నింటికి మించి పర్యావరణాన్ని పూజించుకునే వేడుక. గంగిరెద్దుల ఆటలతో, హరిదాసుల సంకీర్తనలతో, అమ్మాయిల గొబ్బి పాటలతో, కొత్త అల్లుళ్ళ రాకతో ఊరంతా సందడిగా మారే రోజు సంక్రాంతి.

**సంక్రాంతి పండుగ గంగిరెద్దుల హడావిడి**

సంక్రాంతి పండుగలో చెప్పుకోవాల్సిన ప్రత్యేకత గంగిరెద్దుల హడావిడి. వాటిని ఆడించేవాళ్లు ... గంగిరెద్దులతో వీధుల్లో తిరుగుతూ, డోలు, సన్నాయి వాయిస్తారు. అందుకు అనుకూలంగా గంగిరెద్దులతో ఆటలు ఆడిస్తారు. మోకాళ్ల మీద వంగి, వాళ్ల గుండెలపై కాళ్లు పెట్టి గంగిరెద్దులు ఆడుతుంటే చూడముచ్చటగా ఉంటుంది. 'అయ్యగారికి దండం పెట్టు, అమ్మగారికి దండం పెట్టు' అని వాళ్లు చెప్తుంటే ఎద్దులు చేసే విన్యాసాలు ఆకట్టుకుంటాయి. ఎద్దుల మోపురాన్ని శివలింగంలా భావిస్తారు. దానిని రంగురంగుల దుస్తులతో అలంకరిస్తారు. కాళ్లకు గజ్జెలు కడతారు. ఈ పండుగరోజు గంగిరెద్దులు ఇంటి ముందు వచ్చి నిలబడటాన్ని జానపదులు శుభంగా భావిస్తారు. వ్యవసాయానికి ఆధారమైన ఎద్దుకు సంతోషంగా కానుకలు ఇచ్చి పంపిస్తారు. కానీ, ప్రస్తుతం సిటీల్లోనే కాదు గ్రామాల్లోనూ గంగిరెద్దులను ఆడించే వాళ్లు తగ్గిపోతున్నారు. ఒకప్పుడు జనవరి మొత్తం కనిపించే వాళ్లు, ఇప్పుడు పండుగ మూడు రోజుల్లో కూడా అక్కడక్కడ కనిపిస్తున్నారు.

హరిదాసులుముఖం మీద తిరునామాలు. కాళ్లకు గజ్జెలు. చేతిలో చిడతలు, నెత్తిమీద రాగితో చేసిన పాత్ర పెట్టుకొని సంక్రాం తికి హరిదాసులు తిరుగుతుంటారు. చిడతలు వాయిస్తూ, కీర్తనలు పాడుతూ. వాటికి అనుకూలంగా అడుగులు వేస్తూ ప్రతి వాకిలికి వెళ్తారు. అందరూ తమ స్థాయిని బట్టి హరిదాసుకు బియ్యం. కూరగాయలు, డబ్బుల రూపంలో దానం చేస్తారు. హరిదాసును విష్ణు మూర్తికి సంకేతంగా భావిస్తారు. తల మీద ఉండే గిన్నెను భూమికి ప్రతీక అని చెప్తారు. లోకంలో ఉండే సుఖాలకు లొంగిపోయి దేవుడిని మర్చిపోవద్దని హరిదాసు కీర్తనలు పాడతాడు. అలాగే ఎక్కువ. తక్కువ అనే తేడా లేకుండా అందరూ సమానమని చాటిచెప్పే హరిదాసు కీర్తనల్లో, రూపంలో ఉంటుంది.

# సంక్రాంతి పెద్ద పండుగ .. ఇండియాలో ఎక్కడ ఎలా జరుపుకుంటారు..! ప్రాధాన్యత.. విశిష్టత ఇదే..!

**సంక్రాంతి పండగను దేశ వ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటారు. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు.. దేశమంతటా ఈ పండుగను జరుపుకుంటారు. అయితే వివిధ రాష్ట్రాల్లో వివిధ పేర్లతో .. వివిధ ఆచారాలు..పద్ధతులతో అక్కడి ప్రజలు సంక్రాంతి పండగను సెలబ్రేట్ చేసుకుంటారు. ఏ రాష్ట్రంలో ఎలా సంబరాలు చేసుకుంటారు. సంక్రాంతి పండుగను ఏ పేరుతో పిలుస్తారో తెలుసుకుందాం. . .!**



**హైదరాబాద్ పెన్ పవర్:** సంక్రాంతి పండుగలకు పెద్ద పండుగ.. అందరూ సంబరాలు చేసుకుంటారు. సంక్రాంతి అంటే పంటల పండుగ... పెద్దల పండుగ... పశువుల పండుగ. బీడు నేలను పంటల సిరిగా మార్చిన అన్నదాతలకు తొలి పండుగ.

**తెలుగు రాష్ట్రాల్లో....**

తెలుగు వారికి పెద్ద పండగ సంక్రాంతి పండగ. పర్వదినంగా గుర్తింపు పొందిన సంక్రాంతి రోజున ప్రతి లోగిలి మెరిసిపోతుంది.రంగు రంగుల ముగ్గులు, వాటిపై గొబ్బెమ్మలతో ఆహ్లాదకరంగా కనిపిస్తుంది. హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు ఆధ్యాత్మికతను వెదజల్లుతాయి. దీనికి తోడు నోరూరించే పిండివంటల ఘుమఘుమలు... తెలంగాణలో సకినాలు, మురుకులు వంటి పిండి వంటలు చేస్తారు. గాలి పటాలు ఎగురవేస్తూ కేరింతలు కొడతారు. ఆంధ్రాలో సున్నుండలు, జంతికలు, గారెలు, కజ్జికాయలు వంటి రక రకాల పిండి వంటలు తయారు చేస్తారు. ఆంధ్రాలో .. కోడిపందాలతో ఫుల్? ఎంజాయి చేస్తారు. ఉన్నత స్థాయి వ్యక్తులు కూడా ఈ పందాల్లో పాల్గొంటారు.

తమిళనాడులో.. సంక్రాంతి పండుగను నాలుగు రోజులు జరుపుకుంటారు. ఇక్కడ సంక్రాంతిని పొంగల్ అని అంటారు. రెండో రోజున థై పొంగల్‌ను ఘనంగా నిర్వహిస్తారు. సంక్రాంతి రోజున కొత్త పాత్రలో పాత బియ్యం, బెల్లం, పాలు కలిపి పొయ్యిమీద పొంగించి, ఆ తర్వాత నైవేద్యం చేసి, సూర్యుడికి సమర్పిస్తారు. అ తర్వాత రోజున పశువులను పూజిస్తారు. పొంగల్ రోజున చెక్కర పొంగల్ వంటకాన్ని తయారు చేస్తారు. బియ్యము, బెల్లము, పాలు, సగ్గుబియ్యము మొదలగు వాటి కలయికతో చేయబడు ఒక వంటకం. తమిళంలో 'పొంగ్ణ అనే పదానికి ప్రవహించడం అని అర్థం. అందుకని ఈ పొంగల్ ఉడికి, కాస్త పొంగి పొర్లడం ఆనవాయితీ. కేరళలో.. సంక్రాంతి రోజున మకర విళక్కును ఘనంగా నిర్వహిస్తారు. శబరిమలలో అయ్యప్పస్వామిని దర్శించుకునేందుకు దూరప్రాంతాల నుంచి ఎంతో మంది భక్తులు వస్తారు. ఈ సందర్భంగా కొబ్బరితోటల్లో పూజలు చేస్తారు. అనంతరం మిఠాయిలు పంచి పెడతారు. కేరళలో సంక్రాంతి సందర్భంగా అవియల్ కూర ఫేమస్.

మధ్యప్రదేశ్‌లో ... సంక్రాంతి పండగను సుఖరాత్‌గా పిలుస్తారు. తెల్లవారుజామునే స్నానం ఆచరించి గోవులను పూజిస్తారు. కొత్తపంటల్ని ఇంటికి తీసుకొచ్చి పిండి వంటలు చేసి దేవునికి నైవేద్యంగా సమర్పిస్తారు. రకరకాల మిఠాయిలను పంచుకోవడం సుఖరాత్ ప్రత్యేకత.

మహారాష్ట్రలో.. సంక్రాంతి పేరుతోనే వేడుకలు నిర్వహిస్తారు. తిల్‌గుల్ పేరిట నువ్వులతో చేసిన రంగురంగుల హల్వాను పంచుకుంటారు. . కొత్తగా పెళ్లయిన వాళ్లు పసుపు కుంకుమలతో పాటు తాంబూలాలతో బహుమతులు అందిస్తారు. ఈ సంప్రదాయాన్ని హల్దీకుంకుమ్ అంటారు. సంక్రాంతి రోజున మహారాష్ట్రలో పూరన్ పోలీలు అనే వంటకాన్ని తయారు చేస్తారు. ఇవి భక్ష్యాల వలే ఉంటాయి. బెల్లంతో శెనగపప్పు వేసిన పుర్ణాన్ని రుబ్బుకుని మైదాలోపల స్టఫ్ చేసి చపాతీలా వత్తి చేసే పూరన్ పోలీలను మహారాష్ట్రలో సంక్రాంతికి వండుకుంటారు.

ఉత్తరప్రదేశ్‌లో.. కిచెరీ పేరుతో సంక్రాంతి పండుగ జరుపుకుంటారు. గంగ, యమున, సరస్వతి నదీ సంగమమైన అలహాబాద్‌కు వేల సంఖ్యలో ప్రజలు వచ్చి నదీస్నానాలు ఆచరిస్తారు. పిండి వంటలు, మిఠాయిలను బంధువర్గాలకు పంచి పెట్టి పండుగ చేసుకుంటారు.

పశ్చిమ బెంగాల్?లో.. సంక్రాంతిని పోష్ సంక్రాంతిగా చేసుకుంటారు. ఇక్కడ సంక్రాంతి రోజున సంప్రదాయ వంటకమైన పతిషప్తాను వండుకుంటారు. పతిషప్తా రెండు రకాల్లో నోరూరిస్తుంది. క్రిస్పీ క్రేప్ గా తయారు చేసేందుకు ఆల్ పర్పస్ ఫ్లోర్, స్వీట్, బెల్లం, కొబ్బెర లేదా ఖోయాతో నింపి చేస్తారు. దీన్ని మళ్లీ కండెన్స్ మిల్క్ లో ముంచుతారు.

పంజాబ్, కశ్మీర్‌లో.. సంక్రాంతి పండగను లోహ్రి పండుగగా జరుపుతారు. పంజాబ్‌లో భోగి రోజున మంటల్లో చెరకు గడలు, మిఠాయిలు, బియ్యం వేస్తారు. ఆ మంటల చుట్టూ భాంగ్రా డ్యాన్స్ చేస్తారు. అలాగే సంక్రాంతి రోజున నదీ స్నానం ఆచరించి.. నువ్వుల నూనెతో దీపాలు వెలిగిస్తారు. ఖీర్, పాప్‌కార్న్‌ను సూర్యభగవానుడికి నైవేద్యంగా సమర్పిస్తారు. కశ్మీర్‌లో పవన్ యజ్ఞాస్ పేరుతో భోగి మంటలు వేస్తారు. సంక్రాంతి రోజున నువ్వులు, పల్లీలు, బెల్లం కలిపి చేసే పదార్థాల్ని నైవేద్యంగా సమర్పిస్తారు.

**పలు రకాల పేర్లు..వంటకాలు..**

కర్ణాటకలో సుగ్గీ, ఒడిశాలో మకర చౌలా, అసోంలో మాఘ్‌బిహూ, మహర్‌దొమిహి పేర్లతోనూఢిల్లీ, జార?ండ్, హర్యానా, బిహార్‌లలో సక్రాత్, గోవాలో సంక్రాంత్, గుజరాత్‌లో ఉత్తరాయణ్ సంక్రాంతి, హిమాచల్ ప్రదేశ్‌లో మఘసాజీ అని... ఇలా పలు ప్రాంతాల్లో పలు పేర్లతో పర్వదినాన్ని చేసుకుంటారు. మూడునాలుగు రోజులు అంతా ఆనందంగా గడుపుతారు. హర్యానా, ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల్లో సంక్రాంతికి విధిగా చిక్కీలు చేసి తింటారు. డార్జిలింగ్ లోని హిమాలయ ప్రాంతాలలో ఈ పండుగను మాగీ సక్రతి అని పిలుస్తారు

# సంక్రాంతి పండుగ.. అనుబంధాల పండుగ..! పొంగల్ ఫెస్టివల్ సందేశం ఇదే..!




**హైదరాబాద్ పెన్ పవర్:** సంక్రాంతి సంబరాల్లో నిండు తెలుగుతనం..సంక్రాంతి అంటేనే ఉత్సాహం, ఆనందం, ఐక్యత. అలాంటి పండుగను ముందుగానే గ్రామ స్థాయిలో జరుపుకోవడం ప్రత్యేకతగా నిలిచింది. మకర సంక్రాంతిని తెలుగునాటనే కాకుండా, దేశవ్యాప్తంగా జరుపుకొంటారు.

సంక్రాంతి వేడుకలు జరుపుకోవడంలో ఒక్కో ప్రాంతానిది ఒక్కో పద్ధతి. సంక్రాంతికి ముందురోజున భోగి మంటలు వేయడం, సంక్రాంతి రోజుల్లో ముంగిళ్లలో ముగ్గులు వేయడం దేశవ్యాప్తంగా కనిపిస్తుంది. ఇంతటి విశిష్టత కలిగిన సంక్రాంతి పండుగ సందేశాన్ని ఈ స్టోరీలో తెలుసుకుందాం. . .!

**పండగ సందేశం**

మనకు ఎన్ని పండుగలు ఉన్నా, సంక్రాంతి పండుగ ప్రత్యేకమైనది. సంక్రాంతి అంటేనే సందడి అనేంతగా తెలుగునాట సంక్రాంతి సంబరాలు ప్రసిద్ధి పొందాయి. సంక్రాంతి పండుగ అనుబంధాలను పెంచుతుంది. ఈ పండుగ అనేక సందేశాలను ఇస్తుందని పెద్దలు చెబుతారు. సంక్రాంతి శంకర అనే పదం నుంచి వచ్చిందని అంటారు. శంకర.... అంటే కదలిక అనే అర్థం. ప్రాణం ఉంటేనే కదలిక ఉంటుంది. గ్రహాల కదలిక వల్లే సృష్టి నడుస్తుంది. భూమి కూడా తన చుట్టూ తాను తిరుగుతూ, సూర్యుడి చుట్టూ తిరుగుతుంది. మకర సంక్రాంతిలో ...మకరం....అంటే ....మొసలి.... అని అర్థం. నీళ్లలో మొసలి పట్టుకుంటే వదలదు. సుఖాలకు అలవాటుపడిన మనిషి... మొసలి నోటిలో చిక్కుకున్న వాడితో సమానం. దాని తాలూకు బాధలనుంచి తప్పించుకోలేడు.. మనిషి కూడా ఎప్పుడూ కదలిక లేకుండా నిశ్చలంగా ఉండిపోకూడదు. జీవి కదలిక ఉత్సవం లాంటిదనే చెప్పడమే ఈ సంక్రాంతి పండుగ చెప్పే రహస్యం. ప్రస్తుతం మనుషుల జీవితాల్లో ఏదో ఒక ఆందోళన సాధారణం అయిపోయింది. జీవితంలో చెడు కానీ, మంచి కానీ చిన్న మార్పు వచ్చినా తట్టుకునే శక్తి ఉండటం లేదు. శారీరక, మానసిక రోగాల బారిన పడుతున్నారు. మనసు, శరీరాల్లో కదలిక లేకుండా ఉండే కన్నా. ఎప్పటికప్పుడు మార్పును తీసుకోగలగాలని ఈ పండుగ మనకు సందేశమిస్తుంది.

సంక్రాంతి రోజు గుడికి వెళ్లి శివుడికి అభిషేకం చేస్తారు. కొందరు నదుల్లో స్నానం చేసి, ఉపవాసం ఉంటారు. అందుకే సంక్రాంతి పండుగని శత్రువులు... మిత్రులు అనే తేడా లేకుండా అందరూ కలిసి జరుపుకోవాలని పెద్దలు చెప్తారు

**అనుబంధాల కాంతి**

తాతయ్యలు, బామ్మలు 'పొద్దెక్కుతోంది.. ఇక లేవండిరా... రండి ఫ్రెష్? గా స్నానం చేయండి.. కొత్త బట్టలు వేసుకోండి .. అని పూర్వకాలంలో సంక్రాంతి పండుగ హడావిడి అంతా ఇంతా కాదు. అమ్మా.. నాన్నలు.. అక్కాబావలు, బాబాయి పిన్ని... అందరూ ఒకదగ్గర చేరి.. ముచ్చట్లు పెడుతుంటారు. ఒకరిపై మరొకరు సెటైర్లు వేసుకుంటారు. వాళ్ల జీవితాల్లో చిన్నప్పుడు జరిగిన సంఘటనల గురించి బోలెడు కబుర్లు చెప్పుకుంటుంటారు.

చిన్న పిల్లలంతా కొత్త బట్టలు వేసుకుని అల్లరి చేస్తుంటారు. వంటింట్లో అత్తలు.. పిన్నిలు.. అక్కలు.. బంధువులు ముచ్చట్లలో మునిగి.. నోరూరించే వంటలు చేస్తుంటారు. అందరూ కలవడం అనేదే గొప్ప ఆలోచన. ఇక అందరూ కలిసి సంతోషంగా గడిపితే.. అదే పండగ! అనుబంధాలకు సంక్రాంతి స్వచ్ఛమైన సంబురం.

**సంక్రాంతి వంటలు**

సంక్రాంతి రోజు పాలు పొంగిస్తారు. వాటితో పొంగలి చేస్తారు. పరమాన్నం, పులిహోర, గారెలు... వంటలు చేసుకుం టారు. పిండివంటల విషయానికి వస్తే అరిసెలు, బూరెలు, జంతికలు, సకినాలు చేసుకుంటారు. అలాగే లడ్డూలు, బూంది, మురుకులు, సేమియా పాయసం కూడా వండుకుంటారు. మన సంప్రదాయాలకు ప్రతీకలైన పండుగల్లో సంక్రాంతి ముఖ్యమైనది.

భోగభాగ్యాల తో, సిరిసంపదలను కురిపిస్తూ, కొత్తకాం తులను విరజిమ్ముతూ, కొత్తధాన్యాలతో సంక్రాంతి లక్ష్మీ అందరికీ సంతోషం పంచాలన్నదే పొంగల్? ఫెస్టివల్? ఇచ్చే మెసేజ్..

# సంక్రాంతి పండుగ రోజు ఆ ఊళ్లో స్నానం చేయరు.. దీపాలు వెలిగించరు.. సంబరాలకు దూరంగా ఉంటారు.. ఎందుకంటే..!

**సంక్రాంతి వచ్చిందంటే అంటే నెల రోజుల ముందు నుంచే సిటీ జనాలు సొంతూరు వెళ్లి సంబరాలు చేసుకొనేందుకు ముందే టికెట్? బుక్? చేసుకుంటారు. ఇంటిల్లపాది పట్నం దాటి పల్లెకు వెళ్లాల్సిందే. దేశమంతా సెలబ్రేషన్స్? మోడ్? లో ఉన్నా తెలుగు రాష్ట్రాల్లోని ఓ గ్రామం మాత్రం సంక్రాంతి సంబరాలకు దూరంగా ఉంటుంది. అంతే కాదు.. కనీసం స్నానం చేయరు.. దీపాలు వెలిగించరు.. ఇంతకూ ఆగ్రామం ఎక్కడ ఉంది. ఎందుకు ఆ గ్రామంలో జనాలు సంక్రాంతి సంబరాలకు దూరంగా ఉంటారో ఈ స్టోరీలో తెలుసుకుందాం. . .!**




**హైదరాబాద్ పెన్ పవర్:** సంక్రాంతి వచ్చిందంటే చాలు జనాలు సంబరాల్లో మునిగి తేలుతారు. తెలుగురాష్ట్రాల్లో అతి పెద్ద పండుగల్లో సంక్రాంతి ఒకటి. ఈ పండుగకు వృత్తి, వ్యాపార రీత్యా ఇతర దేశాలు... రాష్ట్రాల్లో స్థిరపడిన వారు సొంతూరుకు వచ్చి సంబరాలు చేసుకుంటారు. కాని ఆంధ్రప్రదేశ్? లోని అనంతపురం జిల్లాలో పి. కొత్తపల్లి గ్రామంలో మాత్రం సంక్రాంతి సంబరాలు చేసుకోరు. కనీసం ఆ రోజు ఇల్లు ఊడవరు.. స్నానం చేయరు. అసలు ఆ గ్రామంలో మాత్రం అసలు పండగ వాతావరణమే కనిపించదు. దేశమంగా సంక్రాంతి సంబరాల్లో మునిగిపోతుండగా.. పి.కొత్తపల్లి వాసులు మాత్రం మామూలు రోజుకంటే సాధారణంగా ఉంటారు.

ఎక్కడ ఉందంటే.. ఆత్మకూరు నుంచి కల్యాణదుర్గం వెళ్లే మార్గంలో పి.కొత్తపల్లి గ్రామం ఉంది. 300 కుటుంబాలున్న ఈ గ్రామంలో ఎన్నో సంవత్సరాలుగా సంక్రాంతి పండుగను జరుపుకోవడం లేదు. సంక్రాంతిని ఎందుకు జరుపుకోవడం లేదంటే.. ఆ పి.కొత్తపల్లి గ్రామస్తులు తమ పూర్వీకులు చెప్పిన ఒక కథను ఒకదానిని చెబుతుంటారు.

**వెళ్లిన వాళ్లు.. వెళ్లినట్లే..**

చాలా సంవత్సరాల క్రితం పి.కొత్తపల్లి గ్రామంలో కూడా అందరిలాగానే సంక్రాంతి పండగను జరుపుకునే వారని.. అయితే అలా ఒకసారి సంక్రాంతి పండగ కోసం సరుకులు కొనుగోలు చేయడానికి వెళ్లిన ఓ వ్యక్తి ఆత్మకూరు సంతకు వెళ్లగా...అక్కడ ఉన్నట్టుండి ఆ వ్యక్తి అక్కడే కుప్పకూలి ప్రాణాలు విడిచాడు. ఈ ఘటనను అందరూ సాధారణ ఘటనగానే భావించారు. కానీ ఆ తర్వాతి రోజు అలాగే సంతకు వెళ్లిన మరో ముగ్గురు కూడా అలానే మరణించారు. దీంతో ఆ గ్రామస్థుల్లో భయం మొదలైంది. ఆ తర్వాత వరుసగా పండగకు సంతకు వెళ్లిన వాళ్లు.. వెళ్లినట్లే ప్రాణాలతో తిరిగి రాకపోవడంతో వారికి సంక్రాంతి అంటే భయం మొదలైంది. అప్పటి నుంచి సంక్రాంతి పండుగ చేసుకుంటే తమ గ్రామస్థులకు ఏదో ఒక అనర్థం జరుగుతుందని గ్రామవాసులు భయపడిపోయారు. అప్పట్నుంచి తమ ఊళ్లో సంక్రాంతి పండగను జరుపుకోవద్దని గ్రామపెద్దలు తీర్మానించుకున్నారు.

తరాలు మారినప్పటికీ.. అప్పుడు తమ గ్రామ పెద్దలు తీసుకున్న నిర్ణయాన్ని పి.కొత్తపల్లి గ్రామస్థులు ఇప్పటికీ పాటిస్తూనే ఉన్నారు. తమ పూర్వీకులు ఇచ్చిన ఆదేశాలను పాటిస్తూ వారు ఇప్పటికీ సంక్రాంతి పండుగ జరిగే మూడు రోజుల పాటు ఇల్లు, వాకిలిని శు భ్రం చేసుకోరు. ఇంటి ముందు ముగ్గులు వేయరు. పిండి వంటలు చేసుకోరు. టీ కొత్తపల్లి గ్రామస్తులు సంక్రాంతి పండుగను జరుపుకోవడమే మానేయడం వినడానికి కాస్త విచిత్రంగానే ఉన్నా.. ఇది నిజం..! అలా సంక్రాంతికి పండుగకు దూరంగా పి. కొత్తపల్లి గ్రామం ఉండడం విశేషం..!

## మోస్ట్ వాంటెడ్ సుజుకి ఫస్ట్ ఎలక్ట్రిక్ స్కూటర్ 'ఇ-యాక్సెస్' విడుదల! కస్టమర్లకు బంపర్ ఆఫర్..



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రజలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న సుజుకి మొదటి ఎలక్ట్రిక్ స్కూటర్ సుజుకి ఇ-యాక్సెస్ (Suzuki e-Access)ను కంపెనీ అధికారికంగా మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ స్కూటర్‌లో 3kWh కెపాసిటీ LFP బ్యాటరీని వాడారు. సాధారణ బ్యాటరీల కంటే ఇవి ఎక్కువ కాలం లైఫ్ ఇస్తాయని కంపెనీ చెబుతోంది. ఒకసారి ఫుల్ ఛార్జ్ చేస్తే 95 కిలోమీటర్ల వరకు ప్రయాణించొచ్చు. ఎండ, వాన, వాతావరణ మార్పులు తట్టుకునేలా ఈ బ్యాటరీని కఠినంగా పరీక్షించారు. ఇందులో ఉన్న 4.1ఎౖ మోటార్ 15చీఎ టార్క్ ఉత్పత్తి ఇస్తుంది. రోడ్డు పరిస్థితిని బట్టి వాడుకోవడానికి ఇందులో ఎకో, రైడ్-A, రైడ్-దీ అనే మూడు మోడ్‌లు ఉన్నాయి. బ్యాటరీ ఛార్జింగ్ తక్కువగా ఉన్నప్పుడు కూడా స్కూటర్ స్పీడ్ తగ్గకుండా వెళ్లేలా దీనిని తయారు చేసారు. వెనక్కి వెళ్లడానికి రివర్స్ అసిస్ట్ కూడా ఉంది.

స్కూటర్ బరువు తక్కువగా, బలంగా ఉండటానికి అల్యూమినియం బాడీని వాడారు. దీని వల్ల నడిపేటప్పుడు స్కూటర్ కంట్రోల్ తప్పకుండా ఉంటుంది. ఇందులో వాడిన బెల్ట్ సిస్టమ్ సుమారు 70వేల కిలోమీటర్ల వరకు లేదా 7 ఏళ్ల వరకు ఎలాంటి రిపేర్లు లేకుండా పనిచేస్తుందని సుజుకి హామీ ఇస్తోంది. దీని ధర ఢిల్లీ ఎక్స్-షోరూమ్ లో రూ.1.88 లక్షలు. ఇప్పటికే బుకింగ్స్ మొదలు కాగా.... మీరు ఫ్లిప్‌కార్ట్ లో కూడా ఈ స్కుటరును బుక్ చేసుకోవచ్చు. ఇంకా 7 ఏళ్లు లేదా 80వేల కిలోమీటర్ల వరకు ఎక్స్టెండెడ్ వారంటీ ఉచితంగా లభిస్తుంది. బై-బ్యాక్ ఆఫర్ కింద కొన్న మూడేళ్ల తర్వాత స్కూటర్ తిరిగి ఇచ్చేయాలనుకుంటే, అసలు ధరలో 60% రిటర్న్ ఇస్తామని కంపెనీ గ్యారెంటీ ఇస్తోంది. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న ఇతర ఎలక్ట్రిక్ స్కూటర్లతో పోలిస్తే సుజుకి ఇ-యాక్సెస్ ధర కొంచెం ఎక్కువగా ఉన్నట్లు అనిపిస్తుంది.

## ఫ్లిప్‌కార్ట్ రిపబ్లిక్ డే సేల్ 2026: ఆఫర్ల జాతర షురూ.. షాపింగ్ ప్రియులకు పండగే..




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రముఖ ఈ-కామర్స్ సైట్ ఫ్లిప్‌కార్ట్ 2026 కొత్త ఏడాదిలో జరిగే అతిపెద్ద ఈవెంట్‌లలో ఒకటైన రిపబ్లిక్ డే సేల్‌కు రెడీ అవుతుంది. ఈసారి సేల్స్ జనవరి 17న ప్రారంభమవుతుండగా... మీరు ఫ్లిప్‌కార్ట్ ప్లస్ లేదా ఫ్లిప్‌కార్ట్ బ్లాక్ సభ్యులైతే జనవరి 16న అంటే ఒక రోజు ముందే యాక్సెస్ లభిస్తుంది. ఎప్పటిలాగే ఈసారి కూడా స్మార్ట్‌ఫోన్స్, ఎలక్ట్రానిక్స్, హోమ్ అప్లియెన్సెస్ పై భారీ డీల్స్ ఆశించొచ్చు.

మీరు కొత్త స్మార్ట్‌ఫోన్ కొనాలని ప్లాన్ చేస్తుంటే, ఈ సేల్ ద్వారా బెస్ట్ ఆఫర్స్, డిస్కౌంట్స్ పొందోచ్చు. గత కొన్నేళ్లు పరిశీలిస్తే, ఈ సేల్ సమయంలో భారీ డిస్కౌంట్లతో పాటు ఐఫోన్ ధర మరింత అవకాశం ఉంది. అంతేకాదు శామ్‌సంగ్, ఐకూ, పోకో, వివో వంటి కంపెనీల స్మార్ట్‌ఫోన్ల ధరలు చాల తగ్గుతాయి. పాత ఫోన్ తో కొత్త ఫోన్ కొనే ఎక్స్ఛేంజ్ ఆఫర్లు కూడా ఉంటాయి.కేవలం స్మార్ట్ ఫోన్స్ మాత్రమే కాదు.. ల్యాప్‌టాప్‌లు, టాబ్లెట్‌లు, బ్లూటూత్ స్పీకర్లు, ఇయర్‌బడ్స్, ఎలక్ట్రానిక్స్ ఢ హోమ్ అప్లయన్సెస్ పై కూడా బంపర్స్ డిస్కౌంట్స్ ఉంటాయి. అలాగే ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు కొనేవారికి కూడా మంచి ఆఫర్లు ఉంటాయి.షాపింగ్‌ను మరింత చౌకగా మార్చడానికి ఫ్లిప్‌కార్ట్ కొన్ని బ్యాంక్ ఆఫర్లను కూడా ఇస్తోంది. వీటిలో ఎణఖీజ బ్యాంక్ క్రెడిట్ కార్డులపై 10% ఇన్స్టంట్ డిస్కౌంట్, ఈజీ జువీ× ఫెసిలిటీ ఉంది. ఇతర కొన్ని బ్యాంక్ కార్డులపై 15% వరకు డిస్కౌంట్ లభించే అవకాశం ఉంది. 'రష్ అవర్ణ, 'జాక్‌పాట్ డీల్ణ పేరుతో తక్కువ సమయంలో ఎక్కువ డిస్కౌంట్ ఇచ్చే స్పెషల్ ఆఫర్స్ కూడా ఉంటాయి.

## PSLV C62 రాకెట్ లాంచ్ కు కౌంట్ డౌన్.. కొత్త ఏడాదిలో ఇస్రో తొలి ప్రయోగం



**హైదరాబాద్ పెన్ పవర్:** PSLV C62 రాకెట్ ప్రయోగానికి సిద్దంగా ఉంది. ఏపీలోని శ్రీహరి కోట అంతరిక్ష కేంద్రం నుంచి సోమవారం (జనవరి 12) ఉదయం10.17 గంటలకు ఇస్రో౼ూూం జ62 రాకెట్ ను ప్రయోగించనున్నారు.రాకెట్ ప్రయోగానికి అన్ని ఏర్పాటు పూర్తి చేశారు సైంటిస్టులు. రాకెట్ ప్రయోగానికి 24 గంటల ముందు ఆదివారం ఉదయం PSLV C62 రాకెట్ ప్రయోగానికి కౌంట్ డౌన్ ప్రారంభమయింది.

**వెహికల్ ఇన్సూరెన్స్**

2026లో చేపడుతున్న తొలి ప్రయోగం అని ఇస్రో చైర్మన్ నారాయణన్ అన్నారు.౼ూూం రాకెట్ ప్రయోగంలో ఇది 64వ ప్రయోగం అన్నారు. ఈ మిషన్ ద్వారా 8 విదేశీ ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపుతున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు 442 విదేశీ ఉపగ్రహాలను అంతరిక్షంలోకి ప్రయోగించినట్లు నారాయణన్ తెలిపారు. ఇందులో రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్డీవో) అభివృద్ధి చేసిన ఈవోఎస్--ఎన్1(అన్వేష్) ప్రధాన పేలోడ్‌అబశ్రీశ్రీ. ఇది మన దేశంలోని వ్యవసాయం, సిటీ మ్యాపింగ్, పర్యావరణ పర్యవేక్షణ, బార్డర్లలో వ్యూహాత్మక నిఘా వంటి రంగాల్లో సామర్థ్యాలను మరింత బలోపేతం చేస్తుంది. దీనికితోడు ఈ మిషన్‌అబ లో భారతీయ స్టార్టప్‌అబ లు, అకాడమిక్ సంస్థలు, అంతర్జాతీయ సంస్థలు అభివృద్ధి చేసిన ఆయుల్ శాట్, ఎంవోఐ-1, కీస్ట్రెల్ ఇనీషియల్ డెమోన్స్ట్రేటర్(కిడ్) వంటి ఆసక్తికరమైన 14 కో-ప్యాసెంజర్ పేలోడ్‌అబ లు కూడా ఉన్నాయి.

## SBI బ్యాంక్ పాత కస్టమర్లకు 2 లక్షలు ఇస్తుంది ! ఎందుకో తెలుసా..




**హైదరాబాద్ పెన్ పవర్:** కొన్నిసార్లు, మీకు అనుకోకుండా డబ్బు అవసరం అయ్యే పరిస్థితి రావచ్చు. అప్పుడు ఎక్కువగా మీరు ఫ్రెండ్స్, బంధువులు లేదా పరిచయస్తులను అడిగి డబ్బును తీసుకునేందుకు ప్రయత్నిస్తారు. కానీ మీకు అవసరమైన మొత్తం ఎక్కువ ఉంటే ఎం చేయాలి..? ఇలాంటి పరిస్థితిలో పర్సనల్ లోన్ ఒక మంచి ఆప్షన్ కావచ్చు. మీకు దేశంలోనే అతిపెద్ద బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా SBI లో అకౌంట్ ఉంటే, మీ డబ్బు సమస్య వెంటనే పరిష్కారం అవుతుంది. మీ ఇన్‌స్టాగ్రామ్ లో SBI బ్యాంక్ కస్టమర్లకు రూ.2 లక్షలు ఇస్తుందనే వీడియోను చూసి ఉండవచ్చు. ఈ వీడియో నిజానికి SBI బ్యాంక్ RTXC (రియల్-టైమ్ ఎక్స్‌ప్రెస్ క్రెడిట్) ఆఫర్ గురించి, అయితే 2 లక్షలు మాత్రమే కాకుండా 35 లక్షల వరకు అందిస్తుంది. SBI ప్రత్యేక కస్టమర్ల కోసం ఈ రియల్-టైమ్ ఎక్స్‌ప్రెస్ క్రెడిట్ (RTXC) ఆఫర్ ప్రవేశపెట్టింది. ఈ ఆఫర్ కింద కస్టమర్లు "యోనో" యాప్ ద్వారా 35 లక్షల వరకు పర్సనల్ లోన్ పొందొచ్చు. ప్రత్యేకత ఏమిటంటే ఈ లోన్ కి ఎటువంటి పేపర్స్ అవసరం లేదు.

**దరఖాస్తు విధానం:** మీరు మీ మొబైల్‌లోని "యోనో" యాప్‌ని ఉపయోగించి ఈ లోన్ కోసం ఈజీగా దరఖాస్తు చేసుకోవచ్చు. తరువాత మీరు మీ ఆధార్ నెంబర్ ఉపయోగించి ఇ-సైన్ చేయవచ్చు.

**వడ్డీ రేటు ఎలా ఉంటుంది:**

వడ్డీ రేట్లు 2 సంవత్సరాల MCLRతో లింక్ై మొత్తం లోన్ కాలానికి నిర్ణయించబడుతుంది.

ఈ ఆఫర్‌ను ఎవరు పొందవచ్చు: ఈ ఆఫర్ SBIలో సాలరీ అకౌంట్ ఉన్న కస్టమర్లకు మాత్రమే లభిస్తుంది. కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వం, డిఫెన్స్, కార్పొరేట్ రంగాలలో పనిచేసే ఉద్యోగులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. బ్యాంక్ ప్రకారం, CIBIL స్కోర్ చెక్ చేయడంతో పాటు, అర్హత, లోన్ ఆమోదంతో సహా అన్ని ప్రక్రియలు డిజిటల్‌గా జరుగుతాయి. అలాగే మీ ప్రతినెల ఆదాయం కనీసం రూ.15వేలు ఉండాలి. మీ జుఠీఔ స్కోర్ 650 లేదా 700 కంటే ఎక్కువగా ఉండాలి.

## బ్రిటిష్ పాలన నుండి హరిత విప్లవం వరకు.. వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులు..



**హైదరాబాద్ పెన్ పవర్:** బ్రిటిష్‌వారి రాక పూర్వం భారతదేశంలో వ్యవసాయం, పరిశ్రమల మధ్య సమతౌల్యం ఉండేది. రెండూ పక్కపక్కనే అభివృద్ధి చెందేవి. బ్రిటిష్‌వారి కాలంలో వారు అవలంబించిన విధానాల వల్ల గ్రామీణ చేతివృత్తులు, కుటీర పరిశ్రమలు క్షీణించాయి. పైగా గ్రామీణ పేదలను పీడించే ఒక జమిందారీ వర్గం అభివృద్ధి చెందింది. రైతు పండించిన పంటలో కొంత భాగాన్ని జమిందారీలు తీసుకుపోగా, వ్యవసాయదారుడికి జీవనాధార ఆదాయమే మిగిలేది. వ్యవసాయదారునికి పెట్టుబడి పెట్టడానికి వనరులు, ప్రోత్సాహకం రెండూ ఉండేవి కావు. ఫలితంగా స్వాతంత్ర్యానికి ముందు వ్యవసాయం జీవనాధార వ్యవసాయంగా ఉండేది. ప్రణాళికలు ముఖ్యంగా హరిత విప్లవం(1966) ప్రారంభమైన తర్వాత కొంతమంది వ్యవసాయదారులు వాణిజ్య ప్రాతిపదికన వ్యవసాయం చేపట్టారు.

**జాతీయాదాయంలో వ్యవసాయం వాటా**

మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో 2/3వ వంతు జాతీయ ఆదాయం వ్యవసాయం నుంచే వచ్చేది. పారిశ్రామికాభివృద్ధి, పరిశ్రమలు, అవస్థాపన సదుపాయాలు అభివృద్ధి కాకపోవడమే ఇందుకు కారణం. ప్రణాళికలు ప్రారంభించిన తర్వాత ద్వితీయ, తృతీయ రంగాలు అభివృద్ధి చెందడం వల్ల వ్యవసాయం వాటా తగ్గుతూ వచ్చింది. 1950--51లో జీడీపీలో వ్యవసాయం రంగం వాటా 53.1 శాతంగా ఉండేది. 1980--81 నాటికి 36 శాతానికి, 1990--91 నాటికి 29.6 శాతానికి తగ్గింది. ప్రస్తుత ధరలలో గత ఆరు సంవత్సరాల్లో జీవీఏలో వ్యవసాయ రంగం వాటా ఇలా ఉంది. ప్రస్తుత ధరల్లో 2022--23లో జీవీఏలో వ్యవసాయం అనుబంధ రంగాల వాటా 21.1 శాతం. జాతీయాదాయంలో వ్యవసాయం వాటా అనేది ఆర్థికాభివృద్ధికి ఒక సూచీగా గుర్తిస్తారు. అభివృద్ధి చెందిన దేశాల్లో వ్యవసాయం నుంచి తక్కువ వాటా వస్తుంది.

**ఉపాధిలో వాటా**

1950--51లో మొత్తం ఉపాధిలో వ్యవసాయంపై ఆధారపడ్డ వారి శాతం 72. అంటే 3/4 వంతు వ్యవసాయంపైనే ఆధారపడ్డారు. 2011 జనాభా లెక్కల నాటికి 54.6 శాతానికి తగ్గింది. ఎన్ఎస్ఎస్ఓ వారి 27వ రౌండ్ (1972--73)లో 73.9 శాతం వ్యవసాయంపై ఆధారపడగా 68వ రౌండ్ (2011--12) నాటికి వ్యవసాయంపై ఆధారపడే వారి శాతం 48.9 శాతానికి తగ్గింది. ఇతర రంగాలు సరిపడినంతగా ఉపాధి కల్పించకపోవడం వల్ల పెరిగే జనాభా వ్యవసాయం పైనే ఆధారపడాల్సి వస్తుంది. ఫలితంగా వీరి ఉపాంత ఉత్పాదకత 0 లేదా సున్నాకి సమీపంగా ఉంటుంది. అందుకే అల్ప ఉద్యోగిత, ప్రచ్ఛన్న నిరుద్యోగిత ఏర్పడుతుంది.

**వృద్ధిరేటు**

ప్రముఖ ఆర్థికవేత్త రంగరాజన్ పేర్కొన్నట్లు వ్యవసాయ రంగంలో ఒక శాతం వృద్ధిని సాధిస్తే అది పారిశ్రామిక ఉత్పత్తిని 0.5 శాతం, జాతీయాదాయ వృద్ధిరేటును 0.7 శాతానికి పెంచుతుంది. అందుకే 12వ ప్రణాళికలో జీడీపీ వృద్ధి 8 శాతం సాధించాలి అంటే వ్యవసాయ రంగం 4 శాతం వృద్ధిని సాధించాలని నిర్దేశించారు. అయితే, సాధించింది 2.86 శాతం. అయితే, 2022--23లో 3.3 శాతం అంచనా వేయడమైంది. ఏ సంవత్సరంలో అయితే వ్యవసాయ రంగంలో మంచి వృద్ధిని సాధించగలమో ఆ సంవత్సర జీడీపీ వృద్ధి కూడా మెరుగ్గా ఉంటుంది.

**గ్రాస్ క్యాపిటల్ ఫార్మేషన్**

ఆర్థికాభివృద్ధికి మూలధన కల్పన అవసరం. మూలధన కల్పన రేటు పెరగకపోతే ఆర్థికాభివృద్ధిని సాధించలేం. భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అతి పెద్ద పరిశ్రమ వ్యవసాయం. మన దేశంలో అతి పెద్ద ప్రైవేట్ రంగం కూడా వ్యవసాయమే. కాబట్టి మూలధన కల్పన రేటు పెంచడంలో వ్యవసాయం ముఖ్యపాత్ర పోషిస్తుంది. వ్యవసాయ రంగంలోని మిగులును పొందడానికి వ్యవసాయం నుంచి వ్యవసాయేతర రంగానికి శ్రమ, మూలధనం తరలించాలి. వర్తక నిబంధనలు వ్యవసాయానికి అనుగుణంగా మార్చడం వల్ల విధానాలు అమలవుతాయి. ప్రస్తుత ధరల్లో జీసీఎఫ్‌లో వ్యవసాయ అనుబంధ రంగాల జీసీఎఫ్ వాటా 2021--22 నాటికి 8 శాతానికి పెరిగింది. స్థూల మూలధన కల్పనలో వ్యవసాయ అనుబంధరంగాల వాటా తగ్గుతూ వస్తున్నది.

**ఆహార ధాన్యాల సరఫరా**

భారత్ వంటి అధిక జనాభా గల దేశాల్లో ఆహార ధాన్యాల డిమాండ్ రోజురోజుకూ పెరుగుతున్నది. ఈ దేశాల్లో ఆదాయం తక్కువగా ఉండటంతో ఆహార వినియోగం తక్కువగా ఉంటుంది. తలసరి ఆదాయం పెరిగే కొద్దీ ఆహారానికి డిమాండ్ అంతకంటే ఎక్కువగా పెరుగుతుంది. అంటే అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఆదాయ డిమాండ్ వ్యాకోచత్వం ఆహారానికి అధికంగా ఉంటుంది. కాబట్టి పెరిగే జనాభాకు అవసరమైన ఆహార ధాన్యాలను సరఫరా చేయాల్సి ఉంది. లేకపోతే భారీ మొత్తంలో ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది.

**పారిశ్రామికాభివృద్ధి**

జాతీయ ప్రాధాన్యత కలిగిన కొన్ని పరిశ్రమలకు వ్యవసాయరంగమే ముడిపదార్థాలను అందిస్తుంది. ఉదా: వస్త్ర, జనపనార, పంచదార పరిశ్రమ, వనస్పతి పరిశ్రమ. వనస్పతి పరిశ్రమ ఎక్కువగా మహారాష్ట్రలోని ముంబయి, పుణెల్లో కేంద్రీకృతమై ఉంది. మొదటి వనస్పతి పరిశ్రమ ముంబయిలోనే ఏర్పడింది. చాలా చిన్న పరిశ్రమలకు వ్యవసాయమే ఆధారం.

ఉదా: చేనేత, రైస్, ఆయిల్ మిల్స్ మొదలైనవి. ఆహార ఉత్పత్తి ప్రక్రియ పరిశ్రమకు వ్యవసాయమే ఆధారం. వ్యవసాయం అభివృద్ధి చెందకపోతే ఈ పరిశ్రమలన్నీ వెనకపడతాయి. అయితే, ఈ మధ్యకాలంలో వ్యవసాయంపై ఆధారపడని పరిశ్రమలు అభివృద్ధి చెందుతూ వస్తున్నాయి. అంటే వ్యవసాయ ప్రాధాన్యత పరిశ్రమల్లో క్షీణత కనిపిస్తున్నది. భారతదేశంలో 2/3వ వంతు ప్రజలు గ్రామాల్లోనే నివసిస్తున్నారు. వీరి కొనుగోలు శక్తి పెరిగితే అది పారిశ్రామికాభివృద్ధికి ఉత్తేజం వస్తుంది.

**అంతర్జాతీయ వ్యాపారం**

చాలా సంవత్సరాలు వస్త్రాలు, జనపనార, తేయాకు మన దేశం నుంచి ఎగుమతి అయ్యే ఎగుమతులు ఆదాయంలో 50 శాతం అందించేవి. వీటితోపాటు జీడిపప్పు, పొగాకు, కాఫీ, వనస్పతి నూనెలు, పంచదార కూడా తర్వాత కాలంలో ఎగుమతి అయ్యాయి. దీనివల్ల ఎగుమతుల్లో కూడా 70 శాతం వరకు వ్యవసాయంపైనే ఆధారపడాల్సి వచ్చేది. ఇది వెనుకబాటుతనాన్ని సూచిస్తోంది. అయితే, ఆర్థికాభివృద్ధి జరిగే కొద్దీ ఉత్పత్తిలో వైవిధ్యం రావడంతో వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు క్రమంగా తగ్గాయి.

# సామాజిక న్యాయం నుండి సహజ న్యాయం వరకు: భారత రాజ్యాంగ విలువల విశ్లేషణ..



**హైదరాబాద్ పెన్ పవర్:** జస్టిస్ అనే పదం రోమన్ పారిభాషికంలోని జాస్టీషియా అనే పదం నుంచి ఉద్భవించింది. జాస్టీషియా అంటే కలపడం, బంధించడం లేదా సమానులను చేయడం అని అర్థంగా పేర్కొంటున్నాయి. సమాజంలోని వివక్షతలను బంధించే అన్నివర్గాలను కలుపుతూ అసమానతలను రూపుమాపడమే న్యాయం పరమార్థం.సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ప్రజలందరికీ న్యాయాన్ని అందించడమే భారత రాజ్యాంగ లక్ష్యం. ఈ అంశాన్ని రాజ్యాంగ నిర్మాతలు రష్యా విప్లవం ఆధారంగా రూపొందిన రష్యా రాజ్యాంగం నుంచి గ్రహించారు. రాజకీయ న్యాయం: రాజకీయ న్యాయాన్ని అందించడం కోసం ఓటు హక్కు పోటీ చేసే హక్కు పదవులను చేపట్టడం, విమర్శ అనే రాజకీయ హక్కులను సమాన ప్రాతిపదికపై ప్రజలందరికీ కల్పించారు. సామాజిక న్యాయం: సామాజిక న్యాయం సాధించడం కోసం ప్రధానంగా రెండు చర్యలను చేపట్టారు. సాంఘిక వివక్షను రూపుమాపడానికి అంటరానితనాన్ని నిషేధించడం, కట్టు బానిసత్వం, వెట్టి చాకిరీ, మనుషుల అక్రమ రవాణా, బాల కార్మిక నిషేధం వంటి చట్టాలను రూపొందించారు. సామాజికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం విద్య, ఉద్యోగాల్లో ప్రత్యేక అవకాశాలను కల్పించారు. ఆర్థిక న్యాయం: ఆర్థిక న్యాయం కోసం ఉత్పత్తిదారులు, వినియోగదారుల సంక్షేమ చర్యలను చేపట్టడంతోపాటు పేదరికం, నిరుద్యోగం నిర్మూలించడానికి అనేక పథకాలను ప్రవేశపెట్టారు.ఎస్.లింగప్ప వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర మధ్య జరిగిన వ్యాజ్యంలో భారత సుప్రీంకోర్టు తీర్పునిస్తూ సామాజిక న్యాయం అనే అంశం సకారాత్మక దృక్పథాన్ని కలిగి ఉంటుంది. భారతదేశంలో సామాజిక న్యాయాన్ని సాధించడానికి ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు రూపొందించి అమలు పరచాలి. అంటే ఈ పదం ప్రభుత్వాలకు మార్గదర్శకాన్ని చూపుతుంది.

**సహజ న్యాయ సిద్ధాంతం**

సహజ న్యాయం అనేది నైతికత, అంగీకారమైనదిగా ఉండాలి. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను అవకాశాలను వినియోగించడానికి తోడ్పడేదిగా ఉండాలి. సహజ న్యాయం వ్యక్తి స్వేచ్ఛను, సమానత్వాన్ని పెంపొందించేదిగా ఉండాలని జస్టిస్ పి.డి. దినకరన్ వర్సెస్ జడ్జెస్ ఎంక్వైరీ కమిటీ మధ్య జరిగిన వ్యాజ్యంలో 2011లో సుప్రీంకోర్టు తన తీర్పులో పేర్కొన్నది. కేసర్ ఎంటర్ ప్రైజెస్ వర్సెస్ ఉత్తరప్రదేశ్ మధ్య జరిగిన వ్యాజ్యంలో సుప్రీంకోర్టు తీర్పునిస్తూ ప్రభుత్వాలు తమ అధికారాన్ని దుర్వినియోగం చేయకుండా నియంతృత్వంతో వ్యవహరించ కుండా ఉండటానికి తోడ్పడేది అని పేర్కొన్నది.

# నువ్వులు మన శరీరానికి చేసే మేలు అంతా ఇంతా కాదు.. రోజూ వాటిని ఇలా తినండి..



భారతీయులు ఎంతో పురాతన కాలం నుంచి తింటున్న ఆహారాల్లో నువ్వులు కూడా ఒకటి. నువ్వులకు కొన్ని వేల ఏళ్ల చరిత్ర ఉంది. వీటిని ఎంతో కాలం నుంచి ఆహారంగా తింటున్నారు. నువ్వులతో అనేక రకాల వంటకాలను తయారు చేస్తుంటారు. నువ్వులతో తయారు చేసే తీపి వంటకాలు ఎంతో రుచిగా ఉంటాయి. నువ్వుల్లో మన శరీరానికి కావల్సిన అనేక పోషకాలు ఉంటాయి. ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్లు, ఫైబర్, మినరల్స్, వృక్ష సమ్మేళనాలు అధికంగా ఉంటాయి. ఇవి మనకు పోషణను, శక్తిని అందిస్తాయి. నువ్వులను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక లాభాలు కలుగుతాయి. నువ్వులను గుప్పెడు మోతాదులో తీసుకుని పెనంపై కాస్త వేయించి రోజూ తినాలి. దీని వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. నువ్వులను తినడం వల్ల పలు అనారోగ్య సమస్యలను సైతం నయం చేసుకోవచ్చు.

**హైబీపీ ఉన్నవారికి..**

నువ్వుల్లో ఫైటో స్టైరాల్స్, లిగ్నన్స్ అనే పోషకాలు అధికంగా ఉంటాయి. ఇవి మన శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. దీనివల్ల రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. దీంతో హార్ట్ ఎటాక్ రాకుండా చూసుకోవచ్చు. నువ్వుల్లో మెగ్నిషియం అధికంగా ఉంటుంది. ఇది రక్త నాళాలను ప్రశాంతంగా మారుస్తుంది. రక్త సరఫరా మెరుగు పడేలా చేస్తుంది. దీని వల్ల బీపీ నియంత్రణలో ఉంటుంది. హైబీపీ ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. నువ్వుల్లో ఐరన్, కాపర్ అధికంగా ఉంటాయి. ఇవి ఎర్ర రక్త కణాలు, హిమోగ్లోబిన్ ఉత్పత్తి అయ్యేలా చేస్తాయి. దీని వల్ల రక్తం వృద్ధి చెందుతుంది. రక్తహీనత తగ్గుతుంది.

**ఎముకల దృఢత్వానికి..**

నువ్వుల్లో అనేక రకాల మినరల్స్ సమృద్ధిగా ఉంటాయి. ముఖ్యంగా క్యాల్షియం, మెగ్నిషియం, మాంగనీస్, ఫాస్ఫరస్ వంటి మినరల్స్‌ను అధికంగా పొందవచ్చు. ఇవి ఎముకల నిర్మాణానికి సహాయం చేస్తాయి. ఎముకల సాంద్రతను పెంచుతాయి. దీని వల్ల ఎముకలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. విరిగిన ఎముకలు ఉన్నవారు నువ్వులను రోజూ తింటుంటే ఎముకలు త్వరగా అతుక్కుంటాయి. నువ్వుల్లో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు సైతం అధికంగా ఉంటాయి. అలాగే వీటిల్లో సెసమోల్ అధికంగా ఉంటుంది. ఇది యాంటీ ఇన్ ఫ్లామేటరీ కారకంగా పనిచేస్తుంది. అందువల్ల కీళ్ల నొప్పులు, వాపుల నుంచి ఉపశమనం లభిస్తుంది. ముఖ్యంగా ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది.

**డయాబెటిస్ ఉంటే..**

నువ్వులను రోజూ ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్లు అధికంగా లభించి షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. డయాబెటిస్ ఉన్నవారికి ఎంతో మేలు చేస్తాయి. టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారు వీటిని రోజూ తింటుంటే ఫలితం ఉంటుంది. ఫైబర్ అధికంగా ఉన్న కారణంగా నువ్వులను రోజూ తింటుంటే జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. ముఖ్యంగా మలబద్దకం తగ్గుతుంది. అలాగే అధిక బరువును తగ్గించుకోవచ్చు. నువ్వులను తినడం వల్ల సెసమిన్, సెసమోల్ అనే యాంటీ ఆక్సిడెంట్లు లభిస్తాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌ను తొలగిస్తాయి. దీని వల్ల కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. ముఖ్యంగా క్యాన్సర్ కణాలు నాశనం అవుతాయి. క్యాన్సర్లు రాకుండా అడ్డుకోవచ్చు. నువ్వుల్లో అనేక రకాల బి విటమిన్లతోపాటు జింక్ కూడా అధిక మొత్తంలో ఉంటుంది. కనుక వీటిని రోజూ తింటుంటే శరీర మెటబాలిజం మెరుగు పడుతుంది. శరీరంలో శక్తి స్థాయిలు అధికంగా ఉంటాయి. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఇలా నువ్వులను రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే అనేక లాభాలను పొందవచ్చు.



# పచ్చి మిర్చి లేదా ఎండు మిర్చి..

## రెండింటిలో మనకు ఏవి ఎక్కువ పోషకాలను అందించి మేలు చేస్తాయి..?

మిరపకాయలను మనం రోజూ వంటల్లో వేస్తుంటాం. కొందరు పచ్చి మిర్చిని ఎక్కువగా వాడుతారు. కొందరు ఎండు మిర్చిని లేదా ఎండు కారాన్ని వాడుతారు. వేటిని వాడినా కూరల్లో వేస్తే మాత్రం కారంగానే ఉంటాయి. అయితే పచ్చి మిర్చి లేదా ఎండు మిర్చి.. రెండింటిలో ఏవి మనకు ఎక్కువ లాభాలను, పోషకాలను అందిస్తాయి.. అని చాలా మంది సందేహిస్తుంటారు. అయితే ఇందుకు పోషకాహార నిపుణులు ఏమని సమాధానాలు చెబుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం. పచ్చి మిర్చి లేదా ఎండు మిర్చి ఏదైనా సరే పోషకాలు అధికంగానే ఉంటాయి. కానీ పచ్చి మిర్చిలో పోషకాల శాతం కాస్త ఎక్కువగా ఉంటుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. కనుక పోషకాలు అధికంగా కావాలంటే పచ్చి మిర్చిని తినాల్సి ఉంటుంది. అయితే పచ్చి మిర్చిని నేరుగా తినకూడదు. ఉడకబెట్టి తినాలి. దీని వల్ల ఎక్కువ పోషకాలను పొందవచ్చని అంటున్నారు.

**పచ్చి మిర్చి..**

పచ్చి మిర్చిలో విటమిన్ సి అధిక మొత్తంలో ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తుంది. మన శరీరంలో కొల్లాజెన్ ఉత్పత్తికి సహాయం చేస్తుంది. దీని వల్ల చర్మం సురక్షితంగా మారి ఆరోగ్యంగా ఉంటుంది. విటమిన్ సి వల్ల మనం తినే ఆహారాల్లో ఉండే ఐరన్‌ను శరీరం సరిగ్గా శోషించుకుంటుంది. దీని వల్ల ఐరన్ లోపం సమస్యను తగ్గించుకోవచ్చు. పచ్చి మిర్చిలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. క్యాలరీలు అసలు ఉండవు. కనుక పచ్చి మిర్చిని తింటే డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటారు. అలాగే బరువును నియంత్రణలో ఉంచుకోవచ్చు. పచ్చి మిర్చిలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణశక్తిని పెంచుతుంది. మలబద్దకం తగ్గేలా చేస్తుంది.

**ఎండు మిర్చి..**

పచ్చిమిర్చిలో క్యాప్సెయిసిన్ అనే సమ్మేళనం అధికంగా ఉంటుంది. ఇది శరీర మెటబాలిజంను పెంచుతుంది. దీని వల్ల కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. ఇక ఎండు మిర్చి లేదా ఎండు కారం తింటే విటమిన్ ఎ ను అధికంగా పొందవచ్చు. మిర్చి ఎరుపు రంగులోకి మారడం వల్ల అందులో బీటా కెరోటిన్ శాతం పెరుగుతుంది. ఇది మన శరీరంలో విటమిన్ ఎ గా మారుతుంది. విటమిన్ ఎ వల్ల కంటి చూపు మెరుగు పడుతుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. గొంతు, ఊపిరితిత్తుల్లో ఉండే కఫం కరిగిపోతుంది. దగ్గు, జలుబు వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. ముక్కు దిబ్బడ తగ్గిపోతుంది. ఆస్తమా, బ్రాంకైటిస్ వంటి సమస్యలు ఉన్నవారికి మేలు జరుగుతుంది. ఎండు మిర్చిలో క్యాప్సెయిసిన్ శాతం పెరుగుతుంది. ఇది మరింత మెరుగ్గా మెటబాలిజంను పెంచి ఇంకా ఎక్కువగా కొవ్వు కరిగేలా చేస్తుంది. అలాగే నొప్పుల నుంచి ఉపశమనం లభించేలా చేస్తుంది.

**వేటిని తినాలి..?**

ఎండు మిర్చిలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది రక్త నాళాలను వెడల్పుగా మారుస్తుంది. దీంతో రక్త సరఫరా మెరుగు పడుతుంది. బీపీ తగ్గుతుంది. ఎండు మిర్చిలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి యాంటీ ఇన్ ఫ్లామేటరీ కారకాలుగా పనిచేస్తాయి. కనుక ఎండు మిర్చిని తీసుకుంటే కీళ్ల నొప్పులు, వాపుల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఆర్థరైటిస్ ఉన్నవారికి మేలు జరుగుతుంది. అయితే ఎండు మిర్చి లేదా పచ్చి మిర్చి రెండూ మనకు లాభాలను అందించేవే. కానీ విటమిన్ సి, చర్మ సంరక్షణ, జీర్ణ సమస్యలను తగ్గించుకోవడం కోసం, ఇతర పోషకాలకు గాను పచ్చిమిర్చిని తినాలి. అదే విటమిన్ ఎ, కంటి చూపు, రోగ నిరోధక శక్తి, నొప్పులకు గాను ఎండు మిర్చిని తీసుకోవాల్సి ఉంటుంది. ఇలా వీటిని తీసుకుంటే ఆరోగ్యకరమైన ప్రయోజనాలను పొందవచ్చు.

# ఉల్లిపాయలతో ఇంటి చిట్కాలు..

## ఈ విధంగా వాడితే ఎన్నో అనారోగ్యాలకు చెక్ పెట్టవచ్చు..!



ఉల్లిపాయలను మనం రోజూ వంటల్లో వాడుతుంటాం. అనేక రకాల కూరల్లో ఉల్లిపాయలను వేస్తుంటారు. ఉల్లిపాయలను వేస్తే వంటకాలకు చక్కని రుచి, వాసన వస్తాయి. ఉల్లిపాయలను పచ్చిగా కూడా తింటుంటారు. అయితే ఆయుర్వేద ప్రకారం ఉల్లిపాయలు మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. ఉల్లిపాయల్లో అనేక పోషకాలు ఉంటాయి. అందువల్ల ఉల్లిపాయలను రోజూ పచ్చిగా తింటే అనేక లాభాలను పొందవచ్చు. అయితే ఉల్లిపాయలను పలు విధాలుగా ఉపయోగించడం వల్ల కొన్ని రకాల వ్యాధులను నయం చేసుకోవచ్చు. పలు ఇంటి చిట్కాల్లో ఉల్లిపాయలను ఉపయోగించాల్సి ఉంటుంది. దీనివల్ల పలు అనారోగ్య సమస్యలు నయం అవుతాయి. ఆరోగ్యంగా ఉంటారు. అనేక వ్యాధులు, ఇన్ఫెక్షన్లను తగ్గించడంలోనూ ఇవి అద్భుతంగా పనిచేస్తాయి. అందుకుగాను ఉల్లిపాయలతో పలు పదార్థాలను కలిపి వాడాల్సి ఉంటుంది.

**హైబీపీ తగ్గేందుకు, రోగ నిరోధక శక్తి పెరిగేందుకు..**

హైబీపీని తగ్గించడంలో ఉల్లిపాయలు అద్భుతంగా పనిచేస్తాయి. అందుకు గాను ఉల్లిపాయ రసం, తేనెలను ఒక టీస్పూన్ చొప్పున తీసుకుని కలిపి రోజూ ఉదయం, సాయంత్రం సేవిస్తుండాలి. దీంతో రక్త సరఫరా మెరుగు పడుతుంది. బీపీ తగ్గుతుంది. హైబీపీ ఉన్నవారికి మేలు జరుగుతుంది. భోజనంలో భాగంగా పచ్చి ఉల్లిపాయను 30 గ్రాముల మోతాదులో తింటుండాలి. దీంతో జీర్ణ సమస్యలు ఉండవు. ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. ఉల్లిపాయలు, కీరదోస, టమాటాలు, క్యారెట్, కొత్తిమీరలను తీసుకుని కట్ చేసి మిక్సీలో వేసి పేస్ట్ లా చేయాలి. అందులో నిమ్మరసం పిండి రోజుకు ఒక్కపూట తీసుకోవాలి. దీని వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. ముఖ్యంగా దగ్గు, జలుబు వంటి సమస్యలు తగ్గుతాయి. వ్యాధులు, ఇన్ఫెక్షన్లు నయం అవుతాయి.

**శ్వాసకోశ వ్యవస్థ పనితీరుకు..**


ఉల్లిపాయల రసం 2 టీస్పూన్లు, తేనె 2 టీస్పూన్లు, అల్లం రసం 1 టీస్పూన్ మోతాదులో తీసుకుని బాగా కలిపి భోజనం తరువాత రోజూ తీసుకోవాలి. ఇలా రోజూ రాత్రి పూట తీసుకోవాల్సి ఉంటుంది. దీని వల్ల శ్వాసకోశ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. దగ్గు, జలుబు తగ్గుతాయి. ముఖ్యంగా ఆయాసం నుంచి ఉపశమనం లభిస్తుంది. ఆస్తమా ఉన్న వారికి మేలు జరుగుతుంది. అలాగే ఈ చిట్కాను పాటిస్తుంటే ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. ఆకలి పెరుగుతుంది. ఉల్లిపాయల రసం 1 టీస్పూన్, తేనె 1 టేబుల్ స్పూన్ మోతాదులో తీసుకుని రెండింటినీ కలిపి రోజుకు 3 పూటలా తాగాలి. ఇలా చేస్తుండడం వల్ల కూడా రోగ నిరోధక శక్తిని పెంచుకోవచ్చు. దగ్గు, జలుబు తగ్గుతాయి. టాన్సిల్స్ ఉన్నవారికి ఎంతగానో ఉపశమనం లభిస్తుంది. టాన్సిల్స్ వాపులను తగ్గించుకోవచ్చు.

**కీళ్ల నొప్పులు, వాపుల సమస్యకు..**

ఆవనూనెతో ఉల్లిపాయలను కలిపి మెత్తగా దంచాలి. అనంతరం ఆ మిశ్రమాన్ని కీళ్ల నొప్పులు ఉన్న చోట రాయాలి. ఇలా రోజూ చేస్తుంటే కీళ్ల నొప్పులు, వాపులు తగ్గిపోతాయి. ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. కొద్దిగా నెయ్యిని వేడి చేసి దాన్ని చర్మంపై గడ్డలు ఉండే చోట రాయాలి. అనంతరం ఉల్లిపాయలను ఉడికించి దంచి ఆ మిశ్రమాన్ని ఆయా భాగాలపై రాయాలి. తరువాత కట్టు కట్టాలి. దీంతో గడ్డలు మెత్తబడి పగిలిపోతాయి.

సమస్య తగ్గుతుంది. అలాగే ముక్కు నుంచి రక్తం కారే సమస్య ఉన్నవారు ఉల్లిపాయలను దంచి రసం తీసి దాన్ని రెండు చుక్కల చొప్పున ముక్కు రంధ్రాల్లో వేస్తుండాలి. దీంతో సమస్య నుంచి బయట పడవచ్చు. చెవినొప్పిని తగ్గించడంలోనూ ఉల్లిపాయలు బాగానే పనిచేస్తాయి. ఇందుకు గాను ఉల్లిపాయల రసాన్ని వేడి చేసి 2 లేదా 3 చుక్కల చొప్పున చెవుల్లో వేయాలి. ఇలా చేస్తుంటే సమస్య తగ్గిపోతుంది. పాదాల పగుళ్లపై ఉల్లిపాయలను మర్దనా చేస్తుంటే సమస్య నుంచి బయట పడవచ్చు. ఇలా అనేక రకాలుగా ఉల్లిపాయలను ఇంటి చిట్కాల్లో ఉపయోగించుకోవచ్చు. అనారోగ్య సమస్యల నుంచి బయట పడవచ్చు.

# గాలి కాలుష్యంతో బ్రెయిన్ స్ట్రోక్



బ్రెయిన్ స్ట్రోక్ ప్రమాదాన్ని గాలి కాలుష్యం పెంచుతున్నది. ఏటా లక్షల మంది ప్రాణాలను తీస్తున్నదని 2024 బయోమెడ్ సెంట్రల్ (బీఎంసీ) పబ్లిక్ హెల్త్ అధ్యయనం వెల్లడించింది. వాయు కాలుష్యం వల్ల ప్రపంచవ్యాప్తంగా దాదాపు ఇరవై లక్షల మంది స్ట్రోక్ బారిన పడుతున్నట్లు ఈ సర్వే తేల్చింది. భారతదేశంతో సహా తక్కువ, మధ్య ఆదాయ దేశాలలో సంభవించే నాలుగు బ్రెయిన్ స్ట్రోక్ మరణాలలో.. ఒకటి గాలి కాలుష్యం వల్లేనని కనుగొన్నది. ముఖ్యంగా.. నగరాలు, పట్టణ ప్రాంత యువకులు ఎక్కువగా దీని బారిన పడుతున్నట్లు వెల్లడైంది. పీఎం 2.5 వంటి సూక్ష్మ కణాలు.. ఊపిరితిత్తుల రక్షణ వ్యవస్థను దాటుకొని రక్తప్రవాహంలోకి ప్రవేశిస్తున్నాయట. రక్త నాళాల్లో అడ్డంకులు సృష్టించి.. బ్రెయిన్ స్ట్రోక్‌కు కారణం అవుతున్నాయని అధ్యయనకారులు చెబుతున్నారు.

మన దేశంలో మూడు దశాబ్దాలుగా బ్రెయిన్ స్ట్రోక్ కేసులు విపరీతంగా పెరుగుతున్నాయి. గాలి కాలుష్యం వల్ల స్ట్రోక్ బారిన పడుతున్నవారిలో యువతే ఎక్కువగా ఉంటున్నదట. దాదాపు 20-30 శాతం స్ట్రోక్‌లు 50 ఏళ్లలోపు వారిలోనే సంభవిస్తున్నాయట. వీరిలో ప్రాణాలతో బయటపడిన వారిలో 50 శాతం మంది శాశ్వత వైకల్యాలతో మిగిలిపోతున్నారట.

ఈ పరిస్థితిని తప్పించుకోవాలంటే.. ఆకస్మికంగా బలహీనమవ్వడం, మాటలు తడబడటం, ముఖం వాలిపోవడం, శరీరం సమతుల్యత కోల్పోవడం లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని నిపుణులు చెబుతున్నారు. ఇక రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్‌ను నియంత్రణలో ఉంచుకోవడంతోపాటు ధూమపానం మానేయడం, చురుకైన జీవనశైలి, గాలి కాలుష్యానికి దూరంగా ఉండటం, ఎయిర్ ప్యూరిఫైయర్‌లను ఉపయోగించడం వల్ల స్ట్రోక్ ప్రమాదం నుంచి బయట పడొచ్చని చెబుతున్నారు.

## బుమ్రా, పాండ్య, అభిషేక్ కాదు.. వరల్డ్ కప్‌లో అతడే

# టీమిండియాకు మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్



**హైదరాబాద్ పెన్ పవర్:** 2026 వరల్డ్ కప్ కు నెల రోజుల కంటే తక్కువ సమయం మాత్రమే ఉంది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీలో తొలిసారి 20 జట్లు ఆడుతుండడంతో భారీ హైప్ నెలకొంది. ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు ఈ టోర్నమెంట్ జరగనుంది. టోర్నీ ఇండియాలోనే జరుగుతుండడంతో డిఫెండింగ్ ఛాంపియన్ టీమిండియా టైటిల్ నిలబెట్టుకుంటుందని ఫ్యాన్స్ ఎంతో ఆతృత్తగా ఎదురు చూస్తున్నారు. జట్టు అత్యంత పటిష్టంగా ఉండడంతో గత రెండేళ్లలో తిరుగులేని విజయాలు సాధిస్తూ ముందుకు వెళ్తుంది. సొంతగడ్డపై ఆడుతుండడంతో ఇండియాపై అంచనాలు పెరిగిపోయాయి.

భారత జట్టు విజయావకాశాలపై టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ మాట్లాడాడు. వరల్డ్ కప్ లో ఇండియాకు మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ ఎవరనే విషయాన్ని చెప్పుకొచ్చాడు. గంగూలీ మాట్లాడుతూ.. "సొంతగడ్డపై వరల్డ్ కప్ కంటే పెద్ద విషయం మరొకటి ఉండదు. భారత జట్టు ఎప్పుడూ నాకు ఫేవరెట్ జట్టు. ఇండియాకు బలమైన స్పిన్ ఎటాక్ ఉంది. వరుణ్ చక్రవర్తి ఫిట్ గా ఉంటే అతను టీమిండియా తరపున ప్రత్యర్థికి ప్రమాదంగా మారతాడు. భారత జట్టులో వరుణ్ మోస్ట్ వాల్యుబుల్ ప్లేయరు. అని గంగూలీ తెలిపాడు. వరల్డ్ కప్ కోసం ప్రకటించిన జట్టులో వరుణ్ చక్రవర్తితో పాటు కుల్దీప్ యాదవ్ , అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ ఉన్నారు.

**నెంబర్ వన్ టీ20 స్పిన్నర్ గా వరుణ్:**

టీమిండియా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ లో తన నెంబర్ వన్ ర్యాంక్ ను మరింత పదిలం చేసుకున్నాడు. ఐసీసీ లేటెస్ట్ టీ20 ర్యాంకింగ్స్ లో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ర్యాంకింగ్స్ లో 818 రేటింగ్ పాయింట్స్ తో ఎవరికీ అందనంత దూరంలో నిలిచాడు. రెండో ర్యాంక్ లో ఉన్న న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్ జాకబ్ డఫీ 699 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాడు.

డఫీకి వరుణ్ చక్రవర్తికి మధ్య ఏకంగా 119 రేటింగ్ పాయింట్స్ ఉండడంతో వరుణ్ చక్రవర్తి నెంబర్ ర్యాంక్ మరికొన్ని నెలలపాటు సేఫ్ గా ఉండడం ఖాయంగా మారింది. వరల్డ్ కప్ లో నెంబర్ బౌలర్ గా వరుణ్ చక్రవర్తి బరిలోకి దిగనున్నాడు.

# సరిగ్గా 300 పరుగులు చేసిన న్యూజిలాండ్... టీమిండియా ముందు భారీ టార్గెట్

- భారత్‌తో తొలి వన్డేలో న్యూజిలాండ్ భారీ స్కోరు
- 50 ఓవర్లలో 8 వికెట్లకు 300 పరుగులు చేసిన కివీస్
- 84 పరుగులతో డారిల్ మిచెల్ టాప్ స్కోరర్
- ఓపెనర్లు కాన్వే, నికోల్స్ అర్ధశతకాలు
- భారత బౌలర్లలో సిరాజ్, ప్రసిద్ధ్, హర్షిత్‌కు రెండేసి వికెట్లు



**హైదరాబాద్ పెన్ పవర్:** వడోదర వేదికగా న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి వన్డేలో టీమిండియా ముందు 301 పరుగుల భారీ లక్ష్యం నిలిచింది. టీమిండియా టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకోగా... కివీస్ బ్యాటర్లు సమష్టిగా రాణించారు. డారిల్ మిచెల్ (84) అద్భుత ఇన్నింగ్స్‌కు తోడు ఓపెనర్లు డెవాన్ కాన్వే (56), హెన్రీ నికోల్స్ (62) అర్ధశతకాలతో రాణించడంతో న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 300 పరుగులు చేసింది.

ఇన్నింగ్స్ ఆరంభించిన కివీస్ ఓపెనర్లు కాన్వే, నికోల్స్ భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ తొలి వికెట్‌కు 117 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. ఈ దశలో భారత్ కష్టాల్లో పడినట్లు కనిపించినా, బౌలర్లు పుంజుకొని వరుస విరామాల్లో వికెట్లు తీశారు. సెంచరీ భాగస్వామ్యం తర్వాత హెన్రీ నికోల్స్‌ను హర్షిత్ రాణా ఔట్ చేయగా, కాసేపటికే కాన్వే కూడా పెవిలియన్ చేరాడు.అయితే, నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన డారిల్ మిచెల్ భారీ షాట్లతో చెలరేగాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా ఏమాత్రం ఒత్తిడికి గురికాకుండా 71 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 84 పరుగులు చేశాడు. చివర్లో క్రిస్టియన్ క్లార్క్ (17 బంతుల్లో 24 నాటౌట్) వేగంగా ఆడటంతో కివీస్ స్కోరు 300 మార్కును అందుకుంది. భారత బౌలర్లలో మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా తలో రెండు వికెట్లు పడగొట్టగా, కుల్దీప్ యాదవ్ ఒక వికెట్ దక్కించుకున్నాడు.

# భారత్‌తో వివాదం... ఇండియా-కివీస్ తొలి వన్డేలో బంగ్లాదేశ్ అంపైర్!



- ఇండియా, న్యూజిలాండ్ వన్డేకు థర్డ్ అంపైర్ గా షర్ఫుద్దౌలా
- ముస్తాఫిజుర్ రెహ్మాన్ ఐపీఎల్ వివాదం నేపథ్యంలో ఈ పరిణామం
- ఇరు దేశాల బోర్డుల మధ్య ఉద్రిక్తతలను మరింత హైలైట్ చేసిన అంశం

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ నియంత్రణ మండలి (దీజజ×), బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (దీజదీ) మధ్య సంబంధాలు తీవ్ర ఉద్రిక్తంగా ఉన్న తరుణంలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. భారత్, న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న వన్డే మ్యాచ్‌కు బంగ్లాదేశ్‌కు చెందిన షర్ఫుద్దౌలా అంపైర్ థర్డ్ అంపైర్‌గా వ్యవహరించడం చర్చనీయాంశంగా మారింది.

**వివాదం ఇదే..**

ఐపీఎల్ 2026 వేలంలో బంగ్లాదేశ్ పేసర్ ముస్తఫిజుర్ రహ్మాన్‌ను కోల్‌కతా నైట్ రైడర్స్ (ఖఖ=) రూ.9.2 కోట్లకు కొనుగోలు చేసింది. అయితే, బంగ్లాదేశ్ లో హిందువులపై దాడుల నేపథ్యంలో... బీసీసీఐ సూచన మేరకు కేకేఆర్ అతడిని జట్టు నుంచి తప్పించడంతో ఈ వివాదం మొదలైంది. ఈ నిర్ణయంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన బంగ్లాదేశ్ ప్రభుత్వం, తమ దేశంలో ఐపీఎల్ ప్రసారాలను నిషేధించింది. అంతేకాకుండా, భద్రతా కారణాలను చూపి, ఫిబ్రవరిలో జరిగే టీ20 ప్రపంచకప్‌లో తమ మ్యాచ్‌లను భారత్ నుంచి శ్రీలంకకు మార్చాలని ఐసీసీని కోరింది.

**తొలి వన్డేలో థర్డ్ అంపైర్‌గా..**

ఈ ఉద్రిక్తతల నడుమ, ఆదివారం గుజరాత్‌లోని వడోదరలో జరుగుతున్న భారత్–న్యూజిలాండ్ తొలి వన్డేకు బంగ్లాదేశ్‌కు చెందిన అంపైర్ షర్ఫుద్దౌలా ఇబ్నే షహీద్ సైకత్ థర్డ్ అంపైర్‌గా నియమితుడయ్యాడు. ఐసీసీ నిబంధనల ప్రకారం, సిరీస్‌లో పాల్గొనే దేశాలకు చెందని ఒక న్యూట్రల్ అంపైర్‌ను నియమించడం తప్పనిసరి. ఇందులో భాగంగానే షర్ఫుద్దౌలా ఈ మ్యాచ్‌కు ఎంపికయ్యాడు. అతడు మార్చి 2024లో ఐసీసీ ఎలైట్ ప్యానెల్‌లో స్థానం సంపాదించిన తొలి బంగ్లాదేశ్ అంపైర్‌గా గుర్తింపు పొందాడు.



సమంత బప్పు బొమ్మ సిరీస్

# వాట్ నెక్స్ట్ హీరో అంటే అన్సర్ ఇదే!



హిట్ మెషిన్ అనీల్ రావిపూడి తదుపరి హీరోపై అప్పుడే చర్చ మొదలైంది. అనీల్ ఏ స్టార్ హీరోని డైరెక్ట్ చేస్తాడు? ఏ హీరో డేట్లు ఇస్తాడు? ఎలాంటి సినిమా చేస్తాడు? ఎప్పుడు మొదలు పెడతాడు? అన్న దానిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. తాజాగా వీటిలో కొన్నింటిపై క్లారిటీ వచ్చేసింది. అనీల్ ఫలనా హీరోతోనే సినిమా చేయాలని ఇంకా డిసైడ్ అవ్వలేదు. తాను సిద్దం చేసుకున్న కథకు అప్పటికి ఏ హీరో ఖాళీగా ఉంటాడో చూసుకుని..ఆ స్టోరీ అతడి కి సెట్ అవుతుందంటే? ముందుకెళ్లిపోవడమే అన్నాడు. స్టోరీల పరంగా చూసుకుంటే? తనకు బాగా పట్టున్న జానర్లోనే సినిమా చేస్తాడు తప్ప ప్రయోగాలకు వెళ్లనన్నాడు.అనీల్ తో సినిమా అంటే అతడి సక్సెస్ ట్రాక్ చూసి ఏ స్టార్ హీరో అయినా ముందుకొస్తాడు. అందులో ఎలాంటి సందేహం లేదు. కానీ హీరోలు ఖాళీగా ఉండాలి. అప్పుడే అది సాధ్యయమవుతుంది. ప్రస్తుతం పాన్ ఇండియా స్టార్లు అంతా బిజీగా ఉన్నారు. వాళ్లెవ్వరికీ అనీల్ తో పనిచేసే సమయం లేదు. మరో ఏడాదిన రెండేళ్లపాటు ఇదే సన్నివేశం ఉంటుంది. సీనియర్ హీరోలు వెంకటేష్, బాలకృష్ణ, చిరంజీవిలతో ఇప్పటికే పని చేసారు. ఇప్పట్లో వాళ్లతో మరో సినిమా చేసే అవకాశం లేదు. వీళ్లలో మిగిలిన సీనియర్ ఎవరైనా ఉన్నారా అంటే కింగ్ నాగార్జున ఒక్కరే.

ఆయనతో కూడా సినిమా చేస్తానని అనీల్ ప్రకటించాడు. కానీ అదెప్పుడు? అన్నది పక్కగా వెల్లడించలేదు. ప్రస్తుతం నాగార్జున హీరోగా రా కార్తీక్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోంది. ఈ సినిమా ఆన్ సెట్స్ లో ఉంది. ఏడాది మిడ్లో ఈ చిత్రం రిలీజ్ అయ్యే అవకాశం ఉంది. అదే జరిగితే అనీల్ తదుపరి ప్రాజెక్ట్ నాగార్జున తో సెట్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. నాగార్జున ఇమేజ్ కు తగ్గ కథ సిద్దంగా ఉంది అంటే అనీల్ మరో ఆలోచన లేకుండా ముందుకెళ్లిపోతాడు. ఒకవేళ నాగార్జున మిస్ అయితే ? అందుకు ఆస్కారం ఉన్న హీరోలు ఎవరు అంటే? టైర్ -2 హీరోలకు ఛాన్స్ ఉంటుంది.నాగచైతన్య, రామ్, నితిన్, విజయ్ దేవరకొండ, అఖిల్, కల్యాణ్ రామ్ లాంటి స్టార్లతో ఛాన్సెస్ తీసుకోవచ్చు. కళ్యాణ్ రామ్ తో అనీల్ కు మరో సినిమా కమిట్ మెంట్ ఉంది. -పటాస్- సినిమాతో అనీల్ ని డైరెక్టర్ గా పరిచయం చేసింది కళ్యాణ్ రామ్ అన్న సంగతి తెలిసిందే. ఆ సినిమా విజయంతోనే అనీల్ ట్యాలెంట్ బయట పడింది. ఆ విజయం అనీల్ జీవితాన్నే మార్చేసింది. ఈ నేపథ్యంలో కళ్యాణ్ రామ్ కోసం అనీల్ మరోసారి రంగంలోకి దిగిన ఆశ్చర్యపో వాల్సిన పనిలేదు. -పటాస్- కి సీక్వెల్ గా -పటాస్ 2- చేయాలని అభిమానులు చాలా కాలంగా కోరుతున్నారు. నాగ్ తో సెట్ అవ్వకపోతే గనుక కళ్యాణ్ రామ్ తో ఛాన్సెస్ ఎక్కువగా ఉన్నాయి. మరి అంతిమంగా హిట్ మెషిన్ తో ఛాన్స్ ఏ హీరో అందుకుంటాడో చూడాలి.



బీజ్ బ్లేజర్ ఫోటోషూట్ లో మిర్నా మీనన్ స్టన్స్

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965